అందరూ చదవదగినవి

అపూర్వ నవలా సాహిత్యం

— * శరత్ నవలలు * —	
శ్రీకాంత	7-8
పల్లెజీవనం	2-0
వాగ్దానం	2-0
చంద్రనాథ్	1-8
దేవదాస్	1 8
అరక్షణీయం	1-4
పరిణీత	1 0
స్వామి	1-0
అనుపమాదేవి	1-0
బిందుగారబ్బాయి	1-0
బడిబహన్	-12
సుమతి	-12
సవిత	4 0
నళిని	-12
— * సాంఘిక నవలలు * —	
సుందరి	2-8
షాదరిండియా	1-8
మదర్ఇండియా	1-0
హరిచరణుడు	1-0
భిక్షుకి	1 0
గరీబ్	1-0
నాగమ్మ	1-0
నీలకంఠం కథలు	1-0
పరిత్యక్త	1-8

పేరుకోసం	1-0
ఉషాసుందరి	1-0
శోభారాణి	1-0
నైల్ నదీతీరంలో	1-0
ప్రణయమందిరం	1-0
ఆంధ్ర బుక్‌ట్రస్టు డిటెక్టివు నవల్సు	
మూడు రోజుల్లో	0-9
లేడీ సెక్రటరీ	0-9
నలుగురు దొంగలు	0-9
నిగూఢ రహస్యం	0-9
రెడ్ లెటర్	0-9
ఏ. బి. సి. డి. మర్డర్సు	0-9
దేవదాసు	0-9
స్త్రీ	0-9
ఒకే హత్య	0-9
— * జీవిత చరిత్రలు * —	
స్వామివివేకానంద్	1-0
రామకృష్ణ పరమహంస	1 0
బాపూజీ	1-0
ప్రధాని నెహ్రూ	1-0
నేతాజీబోసు	1 0
రవీంద్రనాథ్‌టాగూర్	1-0
రాజేంద్రప్రసాద్	1-0
సర్దార్ పటేల్	1-0

¼ సొమ్ము ముందుగా అడ్వాన్సు పంపాలి - పోష్టుఖర్చులు ప్రత్యేకం.

కాళహస్తి తమ్మారావు అండ్ సన్సు

సంస్కృతాంధ్ర బుక్‌డిపో (స్థా. 1882) రాజమండ్రి

రాజేశ్వరి ప్రెస్, రాజమండ్రి.

చంద్రగుప్త చక్రవర్తి

చారిత్ర గాథ

KONDA SHANKARIAH
BOOK SELLER.
SECUNDERABAD-A.P.

పునర్ముద్రణ
15 డిశంబర్ 1956
ముఖ చిత్రము
శ్రీ వడ్డాది పాపయ్య
అచ్చు :
రాజేశ్వర ప్రెస్,
రాజమండ్రి.

వెల 1—8—0

విజ్ఞాన చంద్రికా గ్రంథమాల—2

చంద్రగుప్త చక్రవర్తి

Acc. 665

CHECKED - 1963

రచన

శ్రీ స్వామి విద్యానంద పరమహంస B. A.

ప్రకాశకులు

కాళహస్తి తమ్మారావు అండ్ సన్స్

సంస్కృతాంధ్రబుక్‌డిపో (స్థా. 1882) రాజమండ్రి

ముందు మాట

ఈ గ్రంథము మేము తలపెట్టిన హిందూదేశ పాలక చరిత్రమాల (Rulers of India Series) యందు మొదటి సంపుటము. దీనికి విషయము సమకూర్చుటయందు గ్రంథకర్త మిక్కిలి పరిశ్రమ చేయవలసి వచ్చినది. మన ప్రథమచక్రవర్తి చంద్రగుప్తుడు. ఆతనిం గురించి మొట్టమొదట వ్రాయ నుపక్రమించితిమి. కాని ఇటీవల ప్రతి దినమును అక్కాలమును గూర్చి ఏదో యొక విశేషాంశము బయలు పడుచుండుటవలన సాధ్యమయినంత వఱకు ప్రాచీన నవీనాంశముల సమన్వయము చేయుట ధర్మమని యెంచి ఇంతకాలాతి క్రమంబు నకు నోర్వవలసి వచ్చినది.

ఆంధ్రమున వ్రాయఁబడిన చరిత్ర గ్రంథములలో నిదివఱకు నవలం బింపఁబడని నవీనపద్ధతు లిందు నవలంబింపఁబడినవి. చంద్రగుప్త కాలనిర్ణయము ఆంగ్లేయ చరిత్రకారులలో నగ్రగణ్యుల నందగువారి పక్కి ననుసరించి చేయఁబడినది. గ్రంథాంతమున "చంద్రగుప్తుని సమకాలీనులు" అను ప్రకరణమున స్వదేశీయులును పరదేశీయు లును నగుఁ గొందఱు మహాపురుషుల జీవితములు వర్ణింపఁబడినవి. ప్రసిద్ధ పాశ్చాత్య చరిత్రకారులచే రచింపఁబడిన "జీవితచరిత్రముల" సారమిం దిమిడ్చినందులకు గ్రంథకారు లభివందనీయులు.

ఇయ్యది చిన్న సంపుటమే యైనను నిద్దానిని జాతీయాభిమానముతోఁ జదువునట్టివా రెల్లరకును దీని యుపయోగము గొప్పది యని తోఁపక మానదు.

సంపాదకుఁడు.

కె. వి. లక్ష్మణరావు M. A.

చంద్రగుప్త చక్రవర్తి

మొదటి ప్రకరణము

మగధ రాజ్యము

మగధము ఆర్యావర్తంబునందు మిక్కిలి పురాతన కాలమునుండి ఖ్యాతివడసిన యొక మహా రాజ్యము. ఈ రాజ్యము యొక్క వైశాల్యము వేరు వేరు యుగములయందు వేరువేరు విధములుగ నుండినను మొత్తము మీఁద నీ దేశమునకు ఉత్తరమున గంగానదియు, దక్షిణమున వింధ్యగిరియు, పడమట శోణానదియుఁ, దూర్పున చంపాదేశమును నెల్లలుగా నుండెనని చెప్పవచ్చును. ఇప్పు డీ ప్రదేశమును దక్షిణబేహార్ అనియెదరు. బేహారనునది విహారశబ్ద భవనము. బౌద్ధయుగమునం దీ రాజ్యముయొక్క చుట్టుకొలత రెండువేల మూఁడువందల మైళ్లు. ఇందలి గ్రామములసంఖ్య యెనిమిది వేలు.

మగధదేశపు రాజధాని ప్రథమమున గిరివ్రజ మను దుర్గము. పిదప క్రమముగా రాజగృహము, వైశాలి, పాటలీపుత్రము అను పట్టణములు రాజధాను లయ్యెను. ఉత్తర ప్రాంతమందలి రాజ్యముల యభివృద్ధియే యిట్టి మార్పులకు

ముఖ్యకారణము. గిరివ్రజ మయిదుపర్వతముల నడుమ నిర్మింపఁబడిన యొక దుర్గము. రామాయణమునందు గిరివ్రజ మీలాగు ననే వర్ణింపఁబడి యున్నది.*

మహాభారతమునం దీపర్వతముల పేళ్లు వైహార, వరాహ, వృషభ, వృషిగిరి చైత్యకము లయినట్లు చెప్పఁబడియున్నది.•
ఇప్పు డీపర్వతములను జనులు వైభార, విపుల, రత్నోదయ, సోనగిరు లని వాడుకొనియెదరు. వైభార పర్వతము మీఁద జైనుల శాసనములు పెక్కులు గలవు. ఈ పర్వతము మీఁదనే క్రీ. పూ 543లో బౌద్ధులయొక్క ప్రథమ పాంచవార్షిక సంఘము కూడియుండెను. గిరివ్రజము యొక్క చుట్టుకొలత నాలుగున్నర మైళ్లు. గిరివ్రజము కుశరాజు యొక్క కుమారుఁడగు వసురాజుచేఁ గట్టింపఁబడెను. కట్టిన శిల్పిపేరు మహాగోవిందుఁడు. గిరివ్రజపు రాతిగోడలకంటెఁ బురాతనమైన కట్టడములెవ్వియు నార్యావర్తమునందుఁ గానరావు. గిరివ్రజమునే యిప్పటి జనులు పురాతన రాజగృహమని వాడెదరు.

రాజగృహ పట్టణము గిరివ్రజమున కుత్తరమున అర్ధక్రోశము దూరమున నిర్మింపఁబడెను. ఈపట్టణము బింబిసారుఁడను నృపపుంగవునిచేఁ గట్టింపఁబడియె. ఈతని కుమారుఁడగు ప్రజాతశత్రువు గౌతమ పుత్రునకు సమకాలికుఁడు. ప్రస్తుత మీ స్థలమందు రాజగిర్ అను జీర్ణమర్గ మొకటి గలదు.

---

* బాలకాండము 32 వసర్గము.

• సభాపర్వము 21 వ అధ్యాయము

ఇఁక మగధ దేశపు రాజులనుగుఱించి విచారింతము.

మహాభారతకాలమునం దచ్చట జరాసంధుఁడను రాజు రాజ్యము చేయుచుండెను. అతఁడు మిక్కిలి పరాక్రమవంతుఁడు. ఆతని దాడికి ఓర్వలేక యాదవులు మధురానగరము విడిచి పాఱిపోయి ద్వారకలో నివసించిరి. అతఁడు పెక్కండ్రు లగు రాజులను బట్టితెచ్చి తన చెఱసాలలో నుంచెనని మహాభారతమునందు వర్ణింపఁబడు యుండుటఁ జూడ నతఁడసామాన్య పరాక్రమశాలి యనియుఁ, బెక్కు రాజులు తన్నుఁ బలిసికొలువఁ బ్రభుత్వము చేయుచున్న చక్రవర్తియనియుఁ దోఁచుచున్నది. ధర్మనందనుఁడు రాజసూయ యజ్ఞముఁ సేయ నుద్యమించి నప్పుడు కృష్ణ భీమార్జునులు గిరివ్రజమునకు బ్రాహ్మణులవలెఁ బోయి జరాసంధుని వధించి యతని చెఱసాలలోనున్న నసంఖ్యులగు మూర్ధాభిషిక్తుల విడిపించి, యతని పుత్త్రుఁడగు సహదేవునకే పట్టాభిషేకముచేసిన సమాచారము మహాభారతముఁ జదివినవారందఱకును దెలిసిన విషయమే.

మహాభారత యుద్ధమునం దీ సహదేవుఁడు పాండవ పక్షమునం బోరాడి హతుఁడయ్యెను. అతని వంశపువారగు నిరువదియొక్కరు రాజులు తరువాత రాజ్యము చేసిరి. చివరవాఁడు పురంజీవుఁ డను నామాంతరము గల రిపుంజయుఁడు. వీరందఱును గలసి వేయిసంవత్సరముల వఱకు రాజ్యముచేసిరని పురాణములవలనఁ దెలియ వచ్చుచున్నది. పురంజయునిమంత్రి యగు శునకుఁడు తన రాజును జంపి తన కుమారుఁ డయిన

ప్రద్యోతునకు రాజ్యము నిచ్చెను. ఈ వంశమువారైదుగురు రాజ్యము నేలిరి. చివరివాఁడగు నందివర్ధనుని జంపి యాతని మంత్రియైన శిశునాగుఁడు రాజయ్యెను. ఈ వంశమునకు శిశు నాగవంశ మని పేరు. శిశునాగుఁడు, కాకవర్ణుఁడు, క్షేమ ధర్ముఁడు, క్షత్రౌజుఁడు, బింబిసారుఁడు, అజాతశత్రువు, దర్శ కుఁడు, ఉదయనుఁడు, నందివర్ధనుఁడు, మహానంది, అని శైశు నాగులు పదుగురు.

శిశునాగు డేడవశతాబ్దమున రాజయ్యెనని చెప్ప వచ్చును. ఈ వంశమునం దయిదవవాఁడు బింబిసారుఁడు ఇతనికి శ్రేణికుడని నామాంతరము. ఇతఁడు క్రీ.పూ. 528 వ సంవత్సర ప్రాంతమున అంగరాష్ట్రము నాక్రమించి వశపఱచుకొనెను. ఇతఁడు కోసలరాజు కూతురును లిచ్ఛవివంశ కన్యను వివాహ మాడెను. ఈ రాజు రాజ్యము చేయుచుండఁగనే గౌతమ బుద్ధుఁడును, మహావీరుఁడును దమతమ క్రొత్త సిద్ధాంతములను మాగధులకు బోధజేసి నూతన మతాభివృద్ధి చేసిరి. జైన మతాచార్యుఁడగు మహావీరుఁడు బింబిసారుని రెండవ భార్యకు దగ్గరి చుట్టము. గౌతమ బుద్ధుఁడు తన జీవితములో చాలకాల మితని రాజ్యములోనే నివసించి యుండెను. రాజ్యము విడిచి సన్న్యాసి యయి బయలుదేరిన తరువాత బుద్ధుఁడు ప్రప్రథమ మున రాజగృహమునందే గురువులయొద్ద తత్త్వవిచారము నేర్చుకొనెను. అతఁడు బుద్ధత్వము చెందిన బుద్ధగయ మగధ దేశములోనిదే.

బుద్ధుడు బింబిసారుని దనశిష్యునిఁ జేసికొని రాజగృహ పట్టణమునకు వెలపలనున్న వేణువనమునందు విశేషముగా వాసము చేయుచుండెను. అనేక రాజులును, విద్వాంసులును, బ్రహ్మవేత్తలును వేణువనమునకు వచ్చి యాతని మతమును స్వీకరించిరి. బుద్ధుఁడు నిర్వాణము చెందిన సంవత్సరముననే రాజగృహము నొద్ద సప్తపర్ణిగుహాలో ఏ నూరుగురు బౌద్ధాచార్యులు చేరి బుద్ధుని యుపదేశ వాక్యములను మూఁడు పిటకములుగా సంగ్రహించిరి.

బింబిసారుఁ డిరువదియెనిమిది సంవత్సరములు రాజ్యము నేలి తన రెండవభార్య కుమారుఁ డగు అజాతశత్రునకు పట్టముఁగట్టి తాను ముక్తిమార్గమును వెతకుచుండెను. కాని అజాతశత్రువు దుర్మార్గుఁడై దేవదత్తుఁ డనువాని బోధవలనఁ దండ్రిని జంపించెను.

అజాతశత్రువు క్రీ. పూ 500 ల ప్రాంతమున రాజ్యమునకు వచ్చెనని చెప్పవచ్చును. గౌతమబుద్ధుని బోధవలన నీతనికిఁ దాను జేసిన పితృహత్యకై పశ్చాత్తాపముగలిగెననియు దరువాత నాతఁడు పరిశుద్ధాచరణ గలవాఁడుగ నుండెననియు బౌద్ధ గ్రంథములు చెప్పుచున్నవి. ఈ యజాతశత్రువునకును, కోసలదేశపు రాజునకును, జరిగిన యుద్ధవిషయమైన యొకవింత కథ గలదు. అప్పటి కోసలాధీశ్వరుడు పసేనది. (ప్రసేనధీ) ఈతని యక్కయగు కోసలాదేవి బింబిసారుని భార్య; అనగా అజాతశత్రువునకు సవతి తల్లి. తన సవతికొమారుడగు నజాత

శత్రువు తన భర్తను జంపగాఁ గోసలాదేవి యా దుఃఖముతో మరణ మొందెను. కోసలరాజులు కాశీరాజ్యములోని కొన్ని గ్రామములు కోసలాదేవికి నరణమిచ్చియుండిరి. ఆమె పోఁగానే యా గ్రామములు గోసలరాజయిన పసేనదిచే నాక్రమింపఁ బడియె. అందుపై ముసలివాడగు పసేనదికిని, అతని సవతి మేనల్లుడగు నజాతశత్రువునకును యుద్ధము ప్రారంభమాయెను. మొదట నజాతశత్రువునకు గొంచెము జయము కలిగెఁ గాని నాల్గవసారి యాతడు దాడి వెడలినప్పుడు పసేనదిచేఁ జెఱఁబెట్టఁ బడియె. కాశీదేశము గ్రామములపై దనకు నేమియు హక్కు లేదని యనిపించుకొని యాతని గోసలేశ్వరుడు విడిచిపెట్టెను. కాని చెఱలో నున్న కాలమందు నాతనికిని గోసలేశ్వరుని కూఁతునకును ప్రేమ యంకురించినందునఁ గోసలేశ్వరుఁడు తన కూతురగు వజిరా (వజ్రా) దేవిని అజాతశత్రువునకిచ్చి వివాహము చేసి వివాదగ్రామములనే యామెకు అరణమిచ్చెను.

ఇట్లు కోసలదేశములోని కొంత భాగమును స్వాధీన పఱచుకొని యజాతశత్రువు గంగ కుత్తరమందున్న లిచ్ఛవీ దేశముపై దండు వెడలి రాజధానియైన వైశాలి పట్టణమును స్వాధీన పఱచుకొనెను. అజాతశత్రుని తల్లి లిచ్ఛవీ రాజు కూతురైనందున యిప్పుడీతడు జయించిన రాజ్యము తాతదయినను, మేనమామదైనను కావలయును. ఈ దిగ్విజయముచే నాతడు గంగా నదికిని, హిమాలయ పర్వతమునకును నడుమ నున్న రాజ్యముయొక్క ఎక్కువ భాగమును సంపాదించి

మగధ సామ్రాజ్యముయొక్క వైభవమును హెచ్చించెను. అజాతశత్రువు క్రీ. పూ. 475 సంవత్సర ప్రాంతమున గాల ధర్మము నొందియుండవచ్చును. ఆతని మనుమఁడు ఉదయుఁడు. ఉదయుని కాలము క్రీ.పూ 450 ఇతడే పాటలీపుత్రపట్టణమును గట్టించెనని చెప్పెదరు. అతని తరువాత నందివర్ధనుఁడు, మహా నంది అనురాజులు రాజ్యము చేసిరి.

మహానందితో క్షత్రియకులము నశించినదనియుఁ దరు వాత రాజ్యముచేసిన వారందఱును శూద్రులనియు మన పురాణకారుల యభిప్రాయము. మహానందికి ఔరస సంతానము లేదు. మహా పద్మడను దాసీపుత్త్రుఁ డొకఁడు మాత్రముండెను. మహానందికి తరువాత మహాపద్మడే మగధరాజ్యమునకు చక్ర వర్తి యయ్యెను.

రెండవ ప్రకరణము

చంద్రగుప్తుని జననము

క్రీ. పూ. 528 లో బింబిసారుని ప్రతాపము వలన నంగదేశాక్రమణముతోఁ బ్రారంభమయి క్రీ. పూ. 371 లో మహాపద్మని దిగ్విజయము వలనఁ దన ఛత్రము క్రిందికి దేశమంతయు రాఁగనిన మగధసామ్రాజ్యము క్రీ.పూ 321 లో జంద్రగుప్తుని భుజాదండము నాశ్రయించెను.

ఈ చంద్రగుప్తుని యుత్పత్తియు వృద్ధియు మిగుల నాశ్చర్య కరములు, కాని వానిని గుఱించి ఇదమిత్థమ్మని సంశయ రహితంబుగ జెప్పుట కఠినకార్యము. పురాణములలో నొక రీతిగను, నాటక కథలలో వేఱొక రీతిగను, జైనబౌద్ధ చరిత్రములలోను గ్రీకుల చరిత్రములలోను మఱొక రీతిగ నుండుటం బట్టి చరిత్ర కర్తలు దమ తమ చిత్తములకు సరి పోయిన ట్లూహా పోహాలను విస్తరించి యున్నారు. కావున మన దేశమునందు సాధారణముగ నంగీకరింపఁబడి యుండు పద్ధతిని మొదట వ్రాసెదము. తరువాత నితరుల వ్రాతల ననువాదించెదము.

'నందాంతం క్షత్రియకులమ్' అని పౌరాణిక శాసనము లోకోక్తియు గలదు. ఇందునకు దృష్టాంతము, కల్యాదిని నందనామాంకితులు కొందఱు రాజులుండిరి. అందు మిక్కిలి ఖ్యాతిగాంచిన వాఁడు సర్వార్థసిద్ధి. ఇతనికి మహాపద్మనందుఁడు, ధననందుఁడు, మహాబలి యని నామాంతరములు. ఈతఁడు నవకోటిశ తేశ్వరుండు. చిరకాలము భూమినేలెను. వక్రనాసికుఁడు మున్నగు బ్రాహ్మణు లతనికి కులమంత్రులు. వీరిలో రాక్షసుఁడనువాఁడు పరమవిఖ్యాతుఁడు. దండనీతి ప్రవీణుఁడు. సంధి, విగ్రహ, యాన, ఆసన, ద్వైధ, ఆశ్రయములు, అనియెడు షాడ్గుణ్య ప్రవిభాగముల నెఱింగినవాఁడు; శుచి, శూరుఁడు. ఇతఁడు నందమాన్యుఁడై రాజ్యభారమును ధరించెను.

మహాపద్మనందుఁడు పెక్కుదేశముల రాజులను గెలిచి మిక్కిలి శూరుఁడని పేరొందెను. ఇరువది నలుగురు ఐక్ష్వాకులను, ఇరువది యయిదుగురు పాంచాలురను, ఇరువదినలుగురు హైహాయులను, ముప్పది యిద్దఱు కాళింగులను, ఇరువది యయిదుగురు శకులను, ఇరువది యాఱుగురు కురువులను, ఇరువది యెనమండ్రుడు మైథిలులను, ముప్పది యిద్దఱు శూరసేనులను, ఇతఁడోడించెనని వ్రాయబడి యున్నది.

మహాపద్ముఁడు మిక్కిలి ధనవంతుఁడు. ఇతనియొద్ద మహాపద్మ ధనమున్నందుననే యితనికీ పేరువచ్చెనట. నూఱుకోట్లయిన నొకపద్మమగును. అట్టి పద్మములు వేయియయిన నొక మహాపద్మమగును. ఈతఁడు తన ప్రతాపముచే వృద్ధిపొందించిన

మగధరాష్ట్రమునుండి పన్నులు, కప్పములు, కానుకలు దయా దాక్షిణ్యములు లేక లాగి ధనమును గుప్పలు పోసికొనినందున ధననందుఁ డాయెను. తాను సంపాదించిన ధనమును ఈతడు గంగానదిలోఁ బంచకోశములుగా బాతియుంచెనట. పైభాగము నందు నడ్డకట్టగట్టించి గంగాప్రవాహమును ద్రిప్పి బయల్పడిన స్థలమునందు నయిదు గోతులు త్రవ్వించి వాని ప్రక్కలను రాళ్ల కట్టడముతో ననువుపఱచి లోభాగమున ధనమునించి కరగిపోసిన సీసముతో వానిని మూయించి, యడ్డకట్టను ద్రెంచి ప్రవాహము నెప్పటి మార్గమునకు మరల్చి యా ధనము మీఁదుగ బోవునట్లు చేసెనట. ఈరహస్యము వెల్లడి కాకుండు టకై యాపనులయందు నియుక్తులైన పరిజనులనెల్ల సంహరించి నట్లుగ ఒక గాధకలదు.

గ్రీకువారి వ్రాతల ననుసరించి చూడగా క్రీ. పూ. 326వ సంవత్సర ప్రాంతమున నసఁగా అలెగ్జాండరు (సికందర్) ఈ దేశము మీదికి దండెత్తి వచ్చినప్పుడు, మగధరాజ్యము మహోన్నత్యము జెందియుండెను. ఆ దేశవు రాజునొద్ద ౨౦,౦౦౦ గుఱ్ఱములును, ౨౦౦,౦౦౦ పదాతి సైన్యము, ౨౦౦౦ రథములును, ౪౦౦౦ ఏనుగులును వుండెను.

నవనందులు—మౌర్యుఁడు

మహాపద్మునకు ఇళయను పట్టపురాణియు, మురయను ఉంపుడుకత్తెయు గలరు. ఇళకు నెనమండ్రు కుమాళ్ళు గలిగిరి. తండ్రియైన నందుడును, వీరును గలిసి నవనందులని పిలువ

బడిరి. మురకు బుట్టినవాడు మౌర్యుడని పిలువబడెను. ఈ మౌర్యుడే చంద్రగుప్తు డనికొందఱును నీ మౌర్యుని పుత్రుడే చంద్రగుప్తు డని మఱి కొందఱు వ్రాసియున్నారు. మొదటి పురాణగాథ ననుసరింతము.

మహాపద్మనందుడు దుష్టస్వభావము గలవాడై ప్రజా పీడన మొనరించినందున నతడు ప్రజలకు నప్రియుడయ్యెను. ఇతడు కలికాంశుడనియు, శూద్రప్రాయుడనియు, అధార్మికు డనియు పురాణములు చెప్పుచున్నవి. విష్ణు, పురాణ వ్యాఖ్యానమునందీతడు ఏకచ్ఛత్రుడు, ఏకరాట్టు, లుబ్ధుడు, సర్వక్షత్రకర్త, పరశురామసదృశుడు అని వర్ణింపబడియున్నది.

గ్రీకువారి వ్రాతను జూచినను రాజగు నందునిపై ప్రజల కప్రీతియనియు అతడు లుబ్ధుడును విషయ లంపటుడును అనియు దెలియుచున్నది.

మఱియొక కథ చొప్పున నందునకు శకటాలుడను ప్రియమంత్రి గలడు. ఒకప్పుడు రాజునకు మంత్రిపై గోపము వచ్చి యాతడు మంత్రిని భూగృహములో ద్రోయించెను. అతనికి దేహయాత్ర మాత్రమున కవసరమగునంత ఆహారము పెట్టించు చుండెను. ఇట్లతడు ప్రాణావశేషుడై చెఱలో నుండగా పగతురు మగధము మీదికి దాడి వెడలివచ్చిరి. నందుడు శత్రులను బారదోలునట్టి యుపాయము గానక శకటాలుని చెఱనుండివిడిపించి యాతని మంత్రశక్తిమహిమచే శత్రువులను దిరస్కరింప గలిగెను. కాని తరువాత నాతడు

మంత్రిత్వము చేయనొల్లక యన్న సత్రాధికారిగ నుండుచు నందుల కప్రఖ్యాతి వచ్చునటుల గుట్టలు పన్నుచు దుదిని చాణక్యుని కోపమును రేగించి నంద నిర్మూలము గావించెనట.

నందుని యధర్మపుత్రుడగు మౌర్యుడు బలసాహసము లచే పేరువడసెను. ఇతనికి చంద్రగుప్తుడు మున్నగు నూఱుగురు సుతులు గలిగిరి. వీరు మహా బలాఢ్యులు. మౌర్యుడును మౌర్యుని నూర్గురు పుత్రులును నవనందుల సైన్యమునకు అధిపతులుగ జేయబడిరి. కాని పుత్ర సమేతుడయిన మౌర్యుడు రాజ్యము నపహరించునేమో యని నందులకు నసూయ హెచ్చెను. కావున దమ యుద్యాన వనమున నొక కృత్రిమ శిల్ప గృహమును నిర్మించి మంత్రాలోచన మిష మీద మౌర్యుల నచ్చటికి రావించి వారలనందఱను నేలక్రింది గుహాలో ప్రవేశపెట్టిరి. చంద్రగుప్తుడు దప్ప మిగిలిన వారంద అచ్చట భూగర్భమందు దుర్మరణము నొందిరి. చంద్రగుప్తుడు మాత్రము తప్పించుకొని లోనుండి బయ... ...వెను.

చంద్రగుప్తుడు చాణక్యుని నాశ్రయించుట

ఆజాను బాహుండును, రాజలక్షణ సమన్వితుండును, ఔదార్య శౌర్యగాంభీర్య నిధియు, వినయ వారిధియు నైన యాతని నా ఈర్ష్యాళులు నందులు తిరిగి సమయింప గపటో పాయముల బన్నిరి. ఉన్నత పదవియం దునిచిన నంతఃక్షోభ మును, వెడల గొట్టిన బాహ్యక్షోభమును బుట్టించునని

వెఱచి నీచమును హాస్యాస్పదమును నగు నన్న సత్రాధికార మందుంచిరి. ఇచటను మరి పగతీర్చునకు సమయోపాయముల నెదురు చూచుచున్న చంద్రగుప్తు డొకనాడు ఆగ్రహావతార మనదగిన యొక అగ్రజన్మని జూడగల్గెను. ఈతడు కాలికి దగిలిన యొక గడ్డిపోచను వేగుతో బీకి నిప్పున గాల్చి మిగిలిన బూదిని నీళ్ళలో గరగించి త్రాగెను. అదిగని మౌర్యుడు, ఇటువంటి చండకోపియే నంద నిర్మూలనమునకు దగినవాడని నిర్ణయించెను.

గుప్తుడను పేరుగల యీ బ్రాహ్మణుడు పౌశనునిదండ నీతియందును, జ్యోతి శ్శాస్త్రమందును పారంగతుడు; నీతి శాస్త్ర ప్రణేతయగు చణకుని నందనుడు చాణక్యుడని ప్రసిద్ధి గాంచిన శ్రోత్రియుండు, సర్వధర్మవిదుండు, గుణాఢ్యుండు ఈ బ్రాహ్మణుడు వేదములన్నిటిని వల్లెవేసినవాడు, శాస్త్రము లన్నిటిని జదివినవాడు, ముఖ్యముగ బృహస్పతి, శుక్రుడు, మున్నగువారి నీతుల యందత్యంత ప్రవీణుడు, నైజమైన బుద్ధి సామర్థ్యమును సమయ స్ఫూర్తియు గలవాడు, మిక్కిలి ముక్కోపమును, పట్టినపట్టు వదలని గట్టి దిట్టతనమును గల వాడు. ఇతడొకనాడు నందులశాలలో నొకదాని యందు బహుజనమధ్యమున నగ్రాసనమునందు గూర్చుండి యుండెను. అపుడెయచటికి నందులు వచ్చుటదటస్థించెను. వచ్చి యీ వికృత రూపుడును బ్రహ్మచారియునగు బ్రాహ్మణుని బూర్వోత్తరముల విచారించి నందుల వెంటవచ్చిన వారి మంత్రులును మూగి

యున్న జనులలో గొందఱును బ్రాహ్మణోదాసీనము కూడ దని బోధించినను నా మాటలు వా రాలకింపక యతనిని గర్విష్టునిగ భావించి బంటులఁ బసిచి యా యాసనమునుండి లాగివేయించిరి. అంత నా చాణక్యుని జుట్టు వీడిపోయెను. కండ్లెఱ్ఱనాయెను. ఒడలు వడకెను. పెదవిని కొఱికికొని యెగిరిపడుచు నచ్చటి జనులందఱు వినునట్లు గొప్పపంత మొకటిపట్టెను. చాణక్య శపథమేమనిన, "నన్నిట్లగ్రాసనము నుండి లాగి బహుజన సమూహమున నవమాన పఱచిన యో నందాధములారా! ఇట్లనే మిమ్ములను మీ సింహాసనము నుండి లాగించి మీశిరముల నెల్లదునిమి, యటుపిదపనే యీజుట్టును ముడిచెద! నా చాతుర్య సామర్థ్యములఁ జూతురుగాక!" అని ధిక్కరించుచు కాలరుద్రునివలె గర్జించిన యా బ్రాహ్మణుని కోపానలమును జల్లార్చుటకై నందు లేవిధమైన శాంతివచనముల నైన నాడక పోయిరి. అయ్యో పాపము! బ్రాహ్మణ ద్వేషము సామాన్యమా? అద్దాని ఫలమును నందులు త్వరలోనే అనుభ వింప వలసి వచ్చెను.

చాణక్యుని యాగ్రహోక్తుల చంద్రగుప్తుఁడు చూడఁ గలిగెను. అట్లు ప్రతినపట్టి యరుగుదెంచుచున్న యా బ్రాహ్మణుని వెంబడించి నడచివచ్చుచున్న చంద్రగుప్తుఁడు, వెనుక చూచుచు నతని కనులఁ బడియెను. అంత జంద్రగుప్తుఁడు సాగి పడి నమస్కరించెను. అతఁడును నితని లేవనెత్తి కుశలప్రశ్నము వేయ నతనితో చంద్రగుప్తుఁడు తనకును నందులకును గల

విరోధమును విశదీకరించి శరణము వేడెను. వెంటనే చాణక్యు డతని నోదార్చి సర్వ నందరాజ్యమునకును పట్టాభిషేక మతనికి జేయించునట్లు రెండవ ప్రతిజ్ఞయు జేసెను. మౌర్యచంద్రుని తన యండ జేర్చుకొని యా కుటిలుడు నందకుల నిర్మూలనోపాయ మును పన్నెను. తన మిత్రుఁ డిందుశర్మకు క్షపణక వేషము వేసి, యా యభిచారికావేత్తతో రాక్షసాదుల వంచించుచు, నందరాజ్యార్ధమును బహుమతిగా వాగ్దానము చేసి మహాబలిష్ఠు డైన పర్వతేంద్రుని సాహాయ్యముగా జేర్చుకొని మ్లేచ్ఛబలము లతో కుసుమపురిని ముట్టడించెను. నందులును సంరబ్ధులై మంత్రి రాక్షస వీర్యదృప్తులై యుద్ధమునకు సమకట్టిరి. పలు తెఱంగుల ప్రయత్నించియు, నా బలమును జయింప నశక్తుడై రాక్షసుడు ఛద్మమున చంద్రగుప్తుని సంహరింప నుద్యమించెను.

కాని సర్వనందులును పర్వతేంద్ర బలానిలముతో చెల రేగింపబడిన చాణక్య క్రోధానలంబున శలభంబుల మాడ్కి సందగ్ధులైరి. పిదప రాక్షసుడు క్లేశపరవశుఁడై, బల పౌరుష నష్టుడై, అరిబలాక్రాంతమైన సేనలసాహాయ్యము గోలుపోయిన వాడై, ప్రాణత్రాణ పరాయణుడై, నందవృద్ధుడైన సర్వార్థ సిద్ధిని సురంగమార్గమున పురమునుండి బయలుపంపి, నంద పక్షపాతులగు పౌరులతో పురమును మౌర్యవశము పఱిచెను.

బౌద్ధ గ్రంథములందలి కథ

బౌద్ధులు చెప్పుటేమనగ, చంద్రగుప్తుడు శాక్యవంశ సంభూతుడు. కాన నితడు శాక్యసింహుడని వాడబడు గౌతమ

బుద్ధునివలె క్షత్రియకులస్థుడు. అతని తండ్రి మయూర దేశాధిపుడు. ఆ రాజు రాజ్యమేలుచుండ పగతురతని దేశముపై దాడి వెడలివచ్చి యుద్ధమునం దతని నోడించి సంహరించిరి. అట్టి విపత్సమయమున మన చంద్రగుప్తుని గర్భమునందు గాంచియున్న మయూరరాణి ఒక పశువులకొట్టమునకు చేసువనా బిడ్డను కని విడిచిపోయెను, అంత నొక గొల్లడు బిడ్డను పెంచి, పాటలీపురమున నొకనాడు వెడల దటస్థించి యచ్చట తక్షశిలా బ్రాహ్మణుడగు చాణక్యున కమ్మివేసెనట. ధననందుడు చాణక్యుని అవమానపఱచి నందున, చంద్రగుప్తుని నిమిత్తీకరించుకొని పగదీర్చుకొనెనట.

మఱియొక వృత్తాంతము చొప్పున మోరియ అనగ మయూరనగరపు రాణి, స్వభర్తసంహారము కాగనే గర్భార్భకుని కాపాడుటకై, తన యన్నను దోడ్కొని పుష్పపురికి పరుగెత్తి పోయెనట. అచ్చట మాఱువేషము దాల్చి బ్రతుకుచుండ కుమారుని గాంచెను. దేవతలు రక్షింతురుగాతమని యా శిశువును ఒక జాడీలోబెట్టి పసుల కొట్టపు గుమ్మమున నుంచిపోయె. అప్పుడు చణ్డుడన్న ఒక యెద్దు జాడియొద్ద నిలిచి బిడ్డను కాపాడుచున్నందున అచ్చటి పశువులకాపరి వానికి చండగుప్తుడని పేరుపెట్టి కాపాడెను. చండగుప్త నామము చంద్రగుప్తనామముగా మాఱిపోయెనట. మోరీయులు పిప్పలి వనమున నున్నవారని బౌద్ధజైనుల వార్తగా నున్నది. స్వాటు పల్లపు సీమయందు నేటికిని. ' మోరా ' యని యొక కనుమ

యున్నదని వాడ్డెలుగారు నుడువుచు ఈనామము చంద్రగుప్తుని పౌత్తర జన్మమును సూచించు చున్నదనుచున్నారు.

బౌద్ధచరిత్రములు గ్రీకు ఇతిహాసములతో మిక్కిలి సమరస పడియున్నవి. ముఖ్యాంశముల కథనమునందు వ్యత్యాసము లగుపడవు. మరికొన్ని బౌద్ధ గ్రంథములలో నిట్లున్నది :—

చాణక్యుడు గొల్లవానికి క్రయంబిచ్చి చంద్రగుప్తుని తీసికొని అతనికి యుక్తమైన శస్త్రవిద్యాభ్యాసము జేయించెను. చంద్రగుప్తుడు యౌవనము బొందగనే, తనయొద్ద రహస్యముగ వేతనంబిచ్చి యుంచియున్న సేనను అతని వశముజేయ నతడు పాటలీపురముపై దాడి వెడలెను. కాని యీ తిరుగుబాటు వ్యర్థమాయెను. కావున చంద్రగుప్తుడు పంజాబునకు బాఱిపోయెను.

మఱియొక కథ గలదు. చాణక్యుడు తన చేతనున్న దొంగ కాహాపణములతో సేనను గూర్చికొని నందునిపై దాడి వెడలగ మొదట నపజయము బొందెను. అంత చంద్రగుప్తుని బిలిచి "యుద్ధమువల్ల లాభము లేదు. గుప్తచారులమై జనుల యభిప్రాయములను మొదట దెలిసి కొందము" అని చెప్పి వారిరువురు గ్రామములలో గుప్తచారులై దిరుగుచుండిరి. ఒక దినమొక పిల్లవాడు తల్లి తనకొక రొట్టె నియ్యగా దాని నడిమి భాగముమాత్రము తిని చుట్టునున్న భాగము వదిలిపెట్టి మఱియొక రొట్టె నడుగగా తల్లి "ఓరి పిచ్చివాడా! చుట్టునున్న రాజ్యమును ముందు వశపరచుకొనకయే మొట్ట

మొదట రాజధాని మీదికి దండెత్తివచ్చి యోడిపోయిన చంద్రగుప్తునివలె రొట్టెను తింటివిగదా” యని వెక్కిరించెను. సమీప ప్రదేశమునందే మారువేషములతో నున్న చంద్రగుప్తుడా మాటలు విని మొదట సామంత రాజులను వశపఱచుకొనుటకై యత్నము చేయసాగెను. ఒక బెస్తవానికి లంచ మిచ్చి గంగానది ప్రవాహములో దాచి యుంచబడిన పంచ నిధుల సంపాదించెను.

మాక్సుముల్లరుగారి కథ

ఉత్తరవిహార సన్యాసుల కథలయందుండితీసి మాక్సుముల్లరు గారు తమ సంస్కృత గ్రంథావళీ చరిత్రమునం దుదహరించున దేమనగ: తక్షశిలావాసియగు బ్రాహ్మణుం డొకడు కలడు. అతనిపేరు చాణక్యుడు. పాటలీపుత్రమందుండ దటస్థించిన ఈ చాణక్యుడు ఏవిధముననో నందాగ్రహము నార్జించుకొనెను. అపుడు నందుడు భటులఁ బనిచి యతని బట్టుకొమ్మని యానతిచ్చెను. అంత చాణక్యుడు సమయస్ఫూర్తితోఁ దక్షణమె తన గట్టిన బట్టల సడలించి పారవైచి దిసమొలకాడై అజీవక వేషంబు గైకొని తప్పించుకొని పోయి నగరున విజనస్థలముగనున్న సంభారస్థానమునందు దాగియుండి కొంత తడవుమీద పర్వతరాజకుమార పరివారమును సంధించి వింధ్యంబుఁజేరె. వృషభరక్షితుడైన చంద్రగుప్తుడు అచ్చట పశువుల మేపుచుండెను. ఆ పిల్లవాని శుభలక్షణములఁ జూచి, పశువులకాపరికి ఒకవేయి కాహాపణములఁ జెల్లించి చాణక్యుడు

కుట్టునిం గొని, యతని మెడకు లక్ష విలువగల బంగారు ప్రోగుతోం జుట్టబడిన యొక కంబళి త్రాటిని జుట్టి కట్టెనంట. పర్వత రాజపుత్రునకు నిటువంటి త్రాటిని మెడకు గట్టించెను. ఒకనాడా యిద్దఱు బాలురును విచిత్రములైన కలలు కనిరట. అంత నా బ్రాహ్మణుండు పార్వతుని బిలిచి నిదురించుచున్న చంద్రగుప్తుని మెడ త్రాటిని త్రెంపకయు వీడ్వకయు నతనిని మేలుకొలుపకయు దెమ్మని చెప్ప, పార్వతుడు చేతకాక వచ్చెను. మఱునాడు పార్వతుడు నిదురింపగ చంద్రగుప్తుని బిలిచి యమ్మెయినే ఆనతియ్య నితడు చేతికత్తితో పార్వతుని శిరమును ద్రుంచి త్రాటిని తెచ్చి సమర్పించెనట. అదిగని చంద్రగుప్తుని యోగపురుషునిగ నిర్ణయించి నాంటనుండి యేడు వత్సరములలో సమస్త విద్యా విశారదునిగ జేసెను.

గ్రీకుల వ్రాతలు

చంద్రగుప్తుడు చిన్నవయస్సులోనే మగధరాజు కోపమునకు బాత్రుడై పాటలీపురమునుండి తక్షశిలా ప్రదేశమునకు అనగా పంజాబు దేశమునకు బాఱిపోయి యచ్చట సైన్యమును గూర్చుకొని అదివఱకు రాజ్యము చేయుచుండిన గ్రీకువారిని వెడలగొట్టి, పిదప నందుల సంహరించి మగధ రాజ్యమును స్వాధీన పఱుచుకొనెను.

గాథల సమన్వయము

ఇట్లు చంద్రగుప్తుని జననమును గుఱించి, సర్వార్థసిద్ధి మనుమడని యొకకథ, ధననందునికి మురయందు బుట్టినవాడని

మఱియొక కథ, మయూరదేశపు రాణికి బుట్టి చాణక్యున కమ్మఁబడిన వాడని వేఱొక కథ, ఆరాణి కని పసుల కొట్టమందుంచి పోఁగ గొల్లవాఁడు కాపాడి చాణక్యున కమ్మిన శిశువని యింకొక కథ, మోరియను రాణి మారువేషమున బుష్పపురమున బిడ్డను గని జాడిలోనిడ చన్డుడన్న యెద్దు సంరక్షించి నందున బసులకాపరిచే చండగుప్త నామమందిన బాలుడని యైదవకథ, పర్వతరాజపుత్రునితో పాటలి వదలి పోయి వింధ్య ప్రాంతమున నొక గొల్లపాళెమునందు దేజస్వియగు బాలచంద్ర గుప్తుడు తోటి గోపాలబాలురతో రాజుమంత్రుల యాట లాడుచుండ నతడు కులీన సంభవుడని చాణక్యుడూహించి యా బాలుని విలువకు దీసికొనిన దాఱవకథ.

కావున నతడు ఈ కులమున బుట్టినవాడని నిర్ణయించుట ఇంచుమించుగ నశక్యము. ముద్రారాక్షసమున నతడు వృషలుడుగ నెన్నబడి యున్నాడు. చాణక్యు డతనిని చాటున వృషలుఁడను చున్నాడు. ఎదుటను వృషల యనుచున్నాడు. జాతి వివేకమునందు వృషలుఁడనగ అంబష్ఠునకు శూద్రియందు బుట్టినవాడని వివరణ. మహానందియను శైశునాగుల గడపటి రాజునకు శూద్రియందు మహాపద్ము డుదయించె ననునది పురాణ సిద్ధము. ప్లూటార్కు ద్వారా మహానంది అంబష్ఠుడని తెలియుచున్నది. కావున మహాపద్మనందుడే వృషలుఁడాయెను. అతని కొమారుడును వృషలుడనిన, చంద్రగుప్తుడే కాక నందులున్ను వృషలు లయిరి. తక్కిన కథలెల్ల చంద్రగుప్తుని

క్షత్రియుఁడను చున్నవి. ముద్రారాక్షసమున విష్ణుగుప్త విరాధ గుప్తులు బ్రాహ్మణులు, బలగుప్తుఁడు క్షత్రియుఁడు. కావున చంద్రగుప్తుఁ డెవఁడు? తరువాతి కాలములో గుప్తనామము వైశ్యుల బిరుదాయెను.

అన్ని కథలను ఆలోచించి చూడ చంద్రగుప్తుడు మురయను స్త్రీకి గుమారుఁడనియు చిన్ననాఁడె సపత్నులగు శత్రువులచేఁ బీడింపఁబడి స్వగ్రామము విడిచి దూరదేశమునకుఁ బాఱిపోయెననియు నచ్చట చాణక్యుఁడను బ్రాహ్మణుని ఆశ్రయించి యతని కుటిలనీతి సాహాయ్యముచే నందుల సంహారించి రాజ్యమును సంపాదించె ననియుఁ గానవచ్చుచున్నవి. చంద్రగుప్తుఁడు మొదట నందుల సంహారించి మగధ మాక్రమించుకొనెనో లేక గ్రీకుల వెడలఁగొట్టి పంజాబును వశపఱచుకొనెనో నిశ్చయముగఁ జెప్పుటకు చరిత్ర సాధనము లేవియును లేవు. అతని జీవితములో నాతఁడు చేసిన ముఖ్య దిగ్విజయములు రెండు: ఒకటి మగధము నాక్రమించుకొనుట, రెండవది గ్రీకుల నోడించుట. మొదటిది మన పురాణాదులలోను ముఖ్యముగా ముద్రారాక్షసమను నాటకములోను వర్ణింపఁబడి యున్నది. రెండవ సంగతి యగు గ్రీకుల పరాభవమును గుఱించిన చరిత్రము వారి గ్రంథముల వలననే తెలిసికొనవలసి యున్నది. ఈ చరిత్రాంశములు వేరువేరుగ రెండు ప్రకరణములలో రచియింపఁబడును.

మూఁడవ ప్రకరణము

మగధరాజ్యము నాక్రమించుట

మహాపద్మ నందుని వార్ధకమునందు రాచకార్యము లన్నియు నతని ఎనమండ్రుగురు కుమారులే చూచుచుండిరి. వారు గర్వాంధులు. మంత్రిశ్రేష్ఠుఁడును అనన్యసామాన్యస్వామి భక్తి భూషితుండును అగు నమాత్య రాక్షసుని బోధలు వినక వారు చాణక్యుఁడను బ్రాహ్మణుని అగౌరవించుటయు నతఁడు నందుల నందఱను సంహరించెద ననియు చంద్రగుప్తునకు రాజ్యము గట్టెదననియు నీ రెండు కార్యము లయినంగాని జుట్టు ముడివేయననియుఁ బ్రతిజ్ఞ చేయుటయు నిదివఱకే వర్ణింపఁబడి యున్నది.

అట్లు రెండు పంతములఁ బట్టిన యాబాపఁడు మౌర్యుని వెంటఁబెట్టుకొని పోయెను. త్రోవలో చాణక్యునకు అత్యంత స్నేహితుఁ డొకఁడు నివసించుచుండెను. ఇతని పే రిందుశర్మ. ఈతఁడును చాణక్యుఁడును ఒక్క గురువునికడ విద్య నేర్చిన వారు. ఇందుశర్మ శుక్రనీతి యందును జ్యోతిశ్శాస్త్రమందును అఖండమైన నేర్పుగలవాఁడు. చాణక్యుఁ డతని యాశ్రమమున

నిలిచి చంద్రగుప్తున కాతిథ్యమిప్పించి, కుశలప్రశ్న రాఁగనే నందతిరస్కారాది విషయములనెల్ల వెల్లడి చేసి యతని సాహాయ్యము వేఁడెను.

అందుపై నిందుశర్మ తాను క్షపణకవేషమును దాల్చి నందమంత్రులకు తనయెడ స్నేహవిశ్వాసములు పుట్టునట్లుగ నటించుచు గట్టితనముగల నమ్మకమైన శిష్యులను చారులుగ నియమించి తనకుఁ దెలిసిన వర్తమానములెల్లఁ జాణక్యునకుఁ దెల్పుచు దేశకాలపాత్రములకుఁ దగినయట్టి పనులను సల్పుచు జంద్రగుప్తునకు తోడ్పడుటకు నంగీకరించెను.

నందసంహారము

పిదప చాణక్య చంద్రగుప్తులు పర్వతరాజు నగరునకుఁ బోయిరి. పర్వత రాజ్యమునకు తక్షశిల రాజధానియని కొందఱనుచున్నారు. కాని రాజునకు సింహళ దేశాధిపుఁడని యుఁ బేరుండుటంబట్టి సిమ్లాయను పురియం దతఁడుండుట కలదు కాఁబోలు. చాణక్యుఁడు పర్వతరాజు సన్నిధిఁజేరి చంద్రగుప్తుని యొక్కయుఁ దనయొక్కయుఁ బూనికలను దెలియఁ జెప్పె. పర్వతరాజునకును మగధరాజునకును బద్ధవైరముకలదు. కాని యతఁడు వంచకుఁడు, మిత్రునివలె నభినయించువాఁడు. దండయాత్రకుఁ దగుపాటి సమయము నెదురుజూచు చున్నవాఁడు. చాణక్య చంద్రగుప్తుల వ్యాజమునఁ దన రాష్ట్రమును వృద్ధిఁ బొందించు కొనఁదగిన యదను రాఁజూచి స్వబలమును శత్రుబలమును ఆలోచించుచు నిశ్చిత ప్రత్యుత్తరంబీయ కుండెను,

కాని చాణక్యుఁడు గడుసరికావున అతని యాలోచనల నూహించుకొని అతని సంశయములు నశించునట్లు దగినట్టి మంత్ర తంత్రములఁ బన్ని యతని మెప్పించి నందరాజ్యమునం దర్ధభాగము నిప్పించునట్లుగా నొప్పందము సేయించి యెట్టకేల కతని సాహాయ్యమును బడసెను. పర్వతరాజు వెంట నతని సహాయులుగ శక, యవన, కిరాత, కాంభోజ, పారసీక, బాహ్లిక రాజ ప్రభృతులును లేచివచ్చిరి. ఇట్లు ప్రాంతసీమలనుండి దాఁడి వెడలివచ్చిన మ్లేచ్ఛబలములు బహుసంఖ్యాతములును శౌర్య వీర్య వైర సంయుతములు నైనవి.

చాణక్య చంద్రగుప్తుల యాలోచన మూలమున, మ్లేచ్ఛబలములు రెండు భాగములుగ వీడి, పూర్వభాగము గండకీ ప్రాంతముచేరి పాటలిని ముట్టడింపఁబోవ పర్వతరాజుచే నడపఁబడిన మూలబలము గంగా శోణాసంగమము వైపు నడచెను. నందులు తమ సైన్యముల నడపుకొని సరయూసంగ మున శత్రువునకై వేచియుండఁగా, ఇందుశర్మ తంత్రములఁ బన్ని నందుల విడఁదీసి చాణక్యుని వలయందుఁ జిక్కించెను. అంత నితఁడు వీరి నందఱను సంహరింపించి మొదటి ప్రతిజ్ఞను నెరవేర్చుకొనెను.

మంత్రి రాక్షసుఁడు

నందమంత్రులలో ప్రముఖుఁడును ప్రచండధీబలదోర్బల ములు గలవాఁడు నొకఁడుండెను. ఇతని పేరు రాక్షసుఁడు. రాజ్య నిర్వహణమునందు మనుష్యులలో నితనికి సమాను డక్కాలమున

లేనందున, అట్టి అమానుష ప్రజ్ఞా శౌర్యములకు రాక్షసుఁడని బిరుదుఁ బడసియుండెను. స్వామిభక్తి పరాయణుఁడగు నితఁడు తన యనుపమేయ సాహసంబుతో పగతుర సైన్యములఁ బలు సోలించి కూలించి నందుల శ్లాఘనను బడసెను గాని నంద నాశ వృత్తాంతము సేనలయందుఁ బర్వఁగనే పర్వతరాజు బలముల కుత్సాహాధిక్యమును పాటలీబలములకు దైన్యాధిక్యమును రాక్షసునకు శోకవిహ్వలతయు నుప్పతిల్లె.

నందసంహార మయినను మంత్రి రాక్షసుని ప్రతిభా విశేషమునకును స్వామిభక్తికిని వెఱచి చంద్రగుప్తుఁడు పాటలీ నగరమునఁ బ్రవేశించినవాఁడు కాఁడు. మఱియు చాణక్యుఁడు తన రెండవ పంతమగు చంద్రగుప్త పట్టాభిషేకమును జెల్లించుట కుపాయముల నాలోచించుచు పాటలీ ప్రవేశ ప్రయత్నమందు నుద్యుక్తుఁ డయ్యెను. కావున జయరాత్రిని పర్వతు బలములు పురికి దూరమున శిబిరములయందు విడిసియుండెను.

విషకన్యక

ఇంతలో రాక్షసుఁడు నందుల కుచితమైన తర్పణము చాణక్య చంద్రగుప్త పర్వతేశ్వరాదుల సంహారమె యని నిశ్చయించుకొని, అది ముగించుటకు యుద్ధోపాయ మక్కఱకు రానందునఁ దగిన మాయోపాయములను తన యావచ్ఛక్తితో బన్నెను. అందు మొదటిది విషకన్యా ప్రయోగము. చిఱుత ప్రాయమునుండి యొక యాఁడుపిల్లను రాక్షసుఁడు సాఁకుచు వచ్చెను. దీనికిఁ గ్రమక్రమముగ నల్పమాత్రలనుండి యెక్కిం

చుచు నధికనూత్రల పర్యంతము జీర్ణమగునట్లుగా విసము మెసవించు చుండెను. ఈ చిన్న దిప్పుడు నవ యువతిగను జగన్మోహనాంగిగను నుండె, జీవసిద్ధియను పేరఁబరంగుచు తనయొద్ద నాశ్రితుఁడుగ, విశ్వాస పాత్రుఁడుగ, దైవజ్ఞసూత్రుడుఁగనున్న క్షపణక వేషధారి నిందుశర్మను బిలిచి యతనిని బలువిధములఁ బొగడి యొక సందేశమునకు నియ్యకొలిపి విష కన్యక నొప్పగించి చంద్రగుప్తునకుఁ దన కృతజ్ఞతాస్వాగత సూచకమగు కానుకగా నా చిన్న దానిని జేర్చుమని వేడెను. అట్టి సందేశ సమర్పణములతో నా జీవసిద్ధి చాణక్య సన్నిధిఁ జేర నితఁడును రాక్షసాపేక్ష నూహించి చంద్రగుప్తునకు పరస్త్రీ కాంక్ష లేమిని దెలిపి పర్వతేశ్వరుని సంశ్లేషంబునకు కొనిపోవు నట్టి యుపాయమును చేయింప, బుద్ధిహీనుఁడును కామాతురుఁడును నగు నాపర్వతేశుఁడు ఆకన్యకను స్వీకరించి విషస్పృష్టుఁడై మృతినొందెను. ఇట్లు చాణక్యుడీ యుక్తివలనఁ జంద్ర గుప్తుని ప్రాణములను దక్కించుటయే కాక నందరాజ్యములో భాగమడుగకుండఁ బర్వతేశ్వరునిఁ గూడ సంహరించెను.

భాగురాయణుఁడు

పర్వతరాజు కొమారునిపేరు మలయకేతువు. తండ్రి మరణముచే భీతిఁబడుచున్న మలయకేతువు నొద్దకు సేనాపతి భాగురాయణుడువచ్చి పర్వతేంద్రుఁడు చాణక్యునిచేఁ జంపింపఁ బడెననియు మలయకేతువు తక్షణమే స్వదేశమునకుఁ బారి పోవని యెడల వానిఁ గూడ అర్ధరాజ్యమెగఁగొట్టఁ దలఁచిన

చాణక్యునిచేఁ జంపింపబడునని యుచెప్పి చంద్రగుప్తచాణక్యుల మీఁదఁ దనకు భక్తి లేనందున మలయకేతువునే యాశ్రయించి మనుదమని నిశ్చయించి వచ్చినట్లు దెలిపి, యతని యెడ గొలు వమరియుండి చంద్రగుప్త పరమున మలయకేతువును వంచించెను. మలయకేతువు ఆమాటలనమ్మెను. భాగురాయణుం డును అత్తెఱంగుననే నలుపుచు మలయకేతువును తోడ్కొని పర్వతరాజ్యంబుఁజేరి యతని కమాత్యుఁడుగ నమరియుండెను.

రాక్షసుని మాయోపాయములు

ఇట్లు పర్వతకుఁడు చచ్చిపోవ, మలయకేతువు పాఱి పోవ, చాణక్యచంద్రగుప్తులు పాటలీపురియందు జయఘోష ముతోఁ బ్రవేశించిరి. రాక్షసుఁడు నందున కీయకొనన ట్లభిన యించుచుఁ బ్రవేశించిన సైన్యములపై తన సైన్యములఁద్రోలి పెక్కు శత్రువుల సంహరించెను. నందపక్షమే జయించినట్లు జయఘోషములఁ జేయించి చంద్రగుప్త పట్టాభిషేకమునాటంక పఱచెను. సర్వార్థసిద్ధిని భద్రపఱచిన యెడల స్వీకారపుత్రుని ద్వారా నందవంశమును నిలుపవచ్చునని, అతని సురంగమార్గ మున నగరునుండి వెడలిపోయి తపోవనంబున నుండుమని వేఁడి పంపెను. తనకు అత్యంత ప్రాణసఖుండగు చందనదాసుని వశ మున గర్భిణియగు స్వపత్నిని పుత్రసమేతముగ నిలిపి కాపాడు మనియెను. తనకార్యస్థుని శకటదాసునివశమున రహస్యముఁగ ధనకోశముల నప్పగించి నందపక్షబలంబునకై యుక్తరీతి నెల్ల వ్యయంబు సేయుఁబనిచెను. సూత్రధారదారువర్మను పిలిచి

రాజభవనపు పూర్వద్వారమును కనకతోరణాదులతో నలంకరించి అందు యంత్రమును నిలిపి దానిని చంద్రగుప్తుఁడు ప్రవేశించునపుడు సడలించి వాని తలపైఁ ద్రోయించి చంప నియమించెను. పట్టపుటేనుఁగు మావటీకాని బర్బరకునిపిలిచి సవారిని మంచి యదనుజూచి కనకదండికలో దాఁచిన కత్తిని దూసి వెనుక నుండు చంద్రగుప్తుని పొడిచి చంపుమనియెను. రాజవైద్యుఁడో అభయదత్తుని రప్పించి యోగచూర్ణము గలిపిన యోషధముతో చంద్రగుప్త మరణమును సంపాదించుమని ప్రేరేపించెను. రాజ శయనాధికారియగు ప్రమోదకుని బంచి చంద్రగుప్తుఁడు మైమఱచి నిదురించుతఱిని సానకత్తితో సంహరించు మనియెను. రాజగృహముయొక్క అంతర్భిత్తి సురంగమునందు బీభత్సకాది ఘాతుక సమూహమును వేచియుండ నేర్పఱచి శయనమందు చంద్రగుప్తుని బ్రహరింపింప దిట్టముచేసెను. ఈప్రకారము రాక్షసుఁడెన్ని సందిగ్ధసమయములందు చంద్రగుప్త సంహారమునకై యతిచతురతరోపాయములఁ బన్నినను నందోక్కొండైన నతనికి సుఫలప్రదంబు గాకపోయెను.

సర్వార్థసిద్ధి తపోవనం బరిగినది విని చాణక్యుఁడు నమ్మికమైన ఘాతుకులఁ బనిచి యతని శిరము దునిమించెను. ఇట్లు విషకన్యక మూలమున బర్వతరాజ మరణమును, చాణక్య ప్రయత్నమున సర్వార్థసిద్ధి మరణమును విని, రాక్షసుఁడు తనకిఁకఁ బాటలియందు నిలుకడ తగదనియెంచి సురంగమార్గమున

నగరు వదలి పర్వత రాజ్యమునకు నడచెను. నడచిపోయి మలయకేతువు నాశ్రయించి తన నందభక్తియు మృతనంద తర్పణ ప్రతిజ్ఞయు విప్పిచెప్పెను. పర్వతేశ్వరునకు ఉచిత తర్పణము శత్రుసంహార రూపమున మలయకేతువు ఆచరింప వలసిన యగత్యమును గట్టిగ బోధించెను. రాక్షసునివంటి యమాత్య శ్రేష్ఠుఁడు తోడై యుండఁదనకు తప్పక జయము కలుగునని నిశ్చయించి అతఁడు తన సైన్యముల నెల్ల సన్నద్ధపఱచి యుద్ధమునకు బయలుదేరెను. అతనికి కశ గాంధార యవనక శచీన పూణకౌలూతాది రాజులు తోడ్పడిరి.

చాణక్య ప్రయత్నములు

చాణక్యుఁ డీవినోదములను చూచుచు నూరకుండెనా? లేదులేదు. రాక్షసుని ప్రయత్నముల నన్నిటిని జారులచేఁ దెలిసికొనుచు నాతని మాయోపాయముల కన్నిటికిని ప్రతి మాయోపాయములు పన్నుచు చంద్రగుప్తునకు నెట్టి యూపద రాకుండఁ గాపాడుచుండెను. తనకు పరమమిత్రుఁడగు పర్వత రాజు ఘాతమునకై రాక్షసుని పనుపున విషకన్యను దోడ్కొని పోయెనని నేరమువోపి జీవసిద్ధిని గ్రామమునుండి వెడలఁ గొట్టెను. ఇందుమూలమునఁ దిరిగియు రాక్షసాశ్రయము జీవ సిద్ధి కనుకూలించినట్లును, ఇట్టి యనుకూలమున చంద్రగుప్తుని పరమున వేగు చూచుటకును, రాక్షస మలయకేతువులకు వైరము కల్పించుటకును, జీవసిద్ధికి సందుదొరికెను. మఱియు

నీ యుపాయము వలన పర్వత రాజు నొద్దకు విషకన్యను బంపిన వాఁడు చాణక్యుడన్న యపవాదము తొలఁగి ఆ కన్యను రాక్షసుఁడే బంపెనన్న జనశ్రుతి పుట్టెను.

చాణక్యుఁడు పట్టణమునందంతటను తన చారుల నంపి నందపక్షపాతు లెవ్వరెవ్వ రెచ్చటనున్నది కనుగొనుచుండెను. ఒక చారునివలన నమాత్య రాక్షసుని భార్యాపుత్రాదులు పాటలీపురములోనే యొక సెట్టి ఇంటనున్నారని తెలిసికొనుటయే గాక రాక్షసుని చేతిముద్రికయు సంపాదించెను. ఆ ముద్రికా సాహాయ్యము వలన నాతఁడు కొన్ని కాగితములు సృష్టించి మలయకేతువునకును రాక్షసునకును వైరము కలుగునట్లు చేసి వారి దాడిని వ్యర్థపుచ్చెను. ఇట్లు రాక్షసుఁడు చేసిన పరశిక్షణోపాయముల కెల్ల చాణక్యుఁడు తగుపాటి ప్రతివిధానముల నేర్పఱచి రెప్పవాల్పక చంద్రగుప్తుని రక్షించుచుండెను. నందాదు లందఱు మృతినొందినను వారియెడ భక్తి విశ్వాసములు గలవాఁడై వారి శత్రువుఁడైన చంద్రగుప్తు నెట్లయిన సంహరించి తన మృతస్వాములకు తృప్తింగలుగఁ జేయవలెనని యమాత్య రాక్షసుఁడు పట్టు విడువకుండెను. అమాత్య రాక్షసునివంటి మంత్రి చంద్రగుప్తుని కబ్బినయెడల నతఁడసామాన్య వైభవ శాలియగునని యెంచి రాక్షసున కెన్నియో యాశలు చూపి చాణక్యుఁ డతని వశపఱచుకొన నెంచెనుగాని యా స్వామిభక్తి పరాయణుఁడు లోఁబడిన వాఁడు కాఁడు. తుదకు నీ క్రింది యుపాయముచే రాక్షసుని వశపఱచుకొనెను.

రాక్షసుని వశీకరణము

చందన దాసుఁడను సెట్టి పాటలీపురమున కలఁడు. అతఁడు రాక్షసునకు పరమమిత్రుఁడు. రాక్షసుఁ డూరువిడిచి వెళ్ళినప్పుడు తన భార్యా పుత్రాదుల నీతని యింటనే విడిచి వెళ్లెను. ఈ సంగతి తెలిసికొని చాణక్యుఁడు రాక్షస భార్యా పుత్రాదులను తన స్వాధీనము చేయుమని చందనదాసుని నిర్బంధ పెట్టెను కాని యాతఁడు మిత్రద్రోహముచేసిన వాఁడు కాఁడు. అందుకాతనికి నురిశిక్ష విధింపఁబడెను. ఈసమాచారం తెలిసి తనకొఱకై తన మిత్రుఁడు చంపఁబడుట న్యాయము కాదని తలఁచి రాక్షసుఁడు తన ప్రతిస్పర్థియయిన చాణక్యుని స్వాధీనమయి తనను జంపి తనమిత్రుని విడువ వలసినదనికోరెను. కాని "నీవు చంద్రగుప్తుని మంత్రిత్వము నొప్పుకొనిన యెడల నీ మిత్రుని రక్షించెద" మని చాణక్యుఁడు చెప్పగా విధిలేక రాక్షసుఁడు అందుకు నొప్పుకొనెను. ఈ సమాచారమంతయు క్రీ. పూ. 322 వ సంవత్సర ప్రాంతమున జరిగియుండును. అమాత్యరాక్షసుని సాహాయ్యము వలనను చాణక్యుని మంత్రపు సాయమువలనను చంద్రగుప్తుఁ డరిభంజకుఁడై తనరాజ్యమును భరతఖండమం దంతటను వ్యాపింపఁ జేయుటయేగాక హిమాలయ పర్వతమున కావలనుండు దేశమును గూడ సాధించెను.

చరిత్రాంశములు

రాక్షసుని వశపఱుచుకొనినప్పుడే మలయ కేతువును గూడ వశపఱచుకొని యాతనిచే చంద్రగుప్తునకు సామంత రాజుగా నుండుట కొప్పించుకొని చాణక్యుఁ డాతని రాజ్యము

నకు నాతని బంపివేసెను. ఈ మలయకేతు వెవ్వఁడై యుండ నోపు? ఇతనిచే నడుపఁ బడిన మ్లేచ్ఛయవన కాంభోజాది సైన్యములనఁగ నెవ్వి? ఈ ప్రశ్నలకుఁ బండితులనేకులు పెక్కు రీతుల ప్రత్యుత్తర మిచ్చుచున్నవారు. మలయకేతువు తండ్రి పర్వతరాజని చెప్పఁబడియున్నది. అందుచే నాతఁడు హిమాలయ గిరికందర ప్రాంతమున వసించువాఁడని తోఁచుచున్నది. చంద్రగుప్తుని కిట్లు సాయముచేసిన సైన్యములు గ్రీకుసైన్యము లని కొందఱు యూరోపియనుల యభిప్రాయము. కాని గ్రీకు చరిత్రకారు లందఱును చంద్రగుప్తునకు గ్రీకు సైన్యములు సాయముచేసినట్లు వ్రాసియుండనందున పై యభిప్రాయము సరియైనది కాదని కీర్తిశేషులైన కాశీనాథ త్ర్యంబక తెలంగు గారి యభిప్రాయమై యున్నది. పిలిప్పాస్ అను గ్రీకుక్షాత్రపుని హిందువులు చంపిరని కర్టియస్ మొదలైన గ్రంథకారులు వ్రాసినందున ఈక్షాత్రపుఁడే పర్వతరాజ నామముతో హిందూ గ్రంథములందు వర్ణింపఁబడి యుండ నోపునని తలంప వచ్చును. తరువాత చంద్రగుప్తునిచే నోడింపఁబడి యాతనితో సంధిచేసి కొనిన శెల్యూకస్ అనువాఁడే మలయకేతువైనఁ గావచ్చును. కాని ఇది యిట్లని నిశ్చయముగాఁ జెప్పవీలులేదు. హిమాలయ పర్వత సమప్రదేశములందును దరులందును పార్వతీయ జాతుల వారనేకు లిప్పటికిని వాసము చేయుచున్నారు. అట్టివారు గొందఱు చంద్రగుప్తునకు సహాయులు వచ్చి యుందురు. అప్పుడా ప్రాంతముల గ్రీకువారును కొందఱుండినందున వారును నీ సైన్యములో చేరినను చేరియుండవచ్చును.

నాలుగవ ప్రకరణము

గ్రీకువారితో యుద్ధము

చంద్రగుప్తుఁడసంఖ్యాకములగు సైన్యములఁ గూర్చుకొని యపరిమిత పరాక్రమవంతుఁడై యదివఱకు పంజాబ్ దేశము నాక్రమించియున్న గ్రీకుసైన్యములఁ బూర్తిగ నోడించి వెడలఁగొట్టెను. కాని ఈ కథాభాగమంతయు సవిస్తరముగ వర్ణించుటకుఁ బూర్వము గ్రీకువారెవరైనది, వీరీ దేశమున కెట్లువచ్చినది సంగ్రహముగఁ జెప్పవలసియున్నది.

సింధునది కావలివైపునుండు సులేమాను హాలా పర్వతములు సరిహద్దుగ బ్రారంభమయి వరుసగ పశ్చిమమున ఆఫ్గనిస్థానము, బెలూచిస్థానము, పర్షియా (పారసీకము) ఆసియాలోని తుర్కి, ఐరోపాలోని తుర్కి-యను దేశనామములచేఁ బిలువంబడు భూభాగమంతయు మన కథాకాలమునఁ బారసీకముగ నుండెడిది. అట్టి పారసీకమునకుఁ బశ్చిమసరిహద్దు మకడోనియా రాజ్యము. ఈ మకడోనియాకు దక్షిణమున గల దేశము గ్రీసు. అక్కడిజనులే గ్రీకులు. ఇట్లు గ్రీకు మకడోనియా దేశములకును హిందూదేశమునకును మధ్యనుండినది పూర్వకాలమున నొక్క పారసీకమె. ఇందు దక్షిణ సముద్రమునుండి

గెడ్రోష్యా, అరకోష్యా, పరోపమిశదము, బాక్ట్రియానా, సాగ్డియానా క్రమముగ నుత్తరమున వ్యాపించి యుండెను. ఇందు గెడ్రోష్యా, అరకోష్యా, పరోపమిశదములు ఇక్కాలమున బెలూచిస్థానము, అఫ్గనిస్థానము లనఁబడుచున్నవి. బాక్ట్రియానా సాగ్డియానాలు ఇప్పట్ల బొకారా, సమరకండము లనియుఁ భారతమున బాహ్లిక మనియు, ప్రకటములై యున్నవి. పరోపమిశద బాక్ట్రియానాలకు నడుమ హిందూకుశ పర్వతములును, బాక్ట్రియానా సాగ్డియానాలకు నడుమ ఉక్షు (Oxus) నదియును నున్నవి. సాగ్డియానా దేశమునకు దక్షిణమున ఉక్షు నదియు ఉత్తరమున జాక్సార్టిసు నదియును పాఱుచున్నవి. అరకోష్యాకు పడమట డ్రాంగియానా, పరోపమిశదమునకు పడమట ఆర్యా, బాక్ట్రియాకు పడమట మార్గియానా దేశములు కలవు. గెడ్రోష్యాకు పడమట కార్మానియా, పెర్సిసు దేశములును వీనికుత్తరమున ఎడారియు దీనికుత్తరమున వరుసగ పార్థియ, హుర్కేనియా దేశములు వ్యాపించి కశ్యప (Caspian) సముద్రమును డాయుచున్నవి. పార్థియ, హుర్కేనియలకు పడమటను, కశ్యప సముద్రమునకు దక్షిణ పశ్చిమముల మధ్య దేశము ఉన్నది. మధ్యదేశమునకు దక్షిణమున సూసియానా సీమయున్నది. ఈ దేశములన్నియు గలిసి ఇప్పట్ల పెరిషియా (పారసీకము) అని పఱగుచున్నవి. ఇట్టి భూమికి పడమట టైగ్రిసునది ప్రవహించుచున్నది. టైగ్రిసునది మొదలు సింధునది వఱకును, పారశీక అరేబియాసముద్రములు మొదలు కాకసపర్వతము కాశ్యపసముద్రము జాక్సార్టిసునది వఱకును,

వ్యాపించియుండు భూభాగమునకు అతిప్రాచీన కాలమునందు, ఐరాను అనగ ఆర్యావర్తమని పేరు. ఇందున్నవారికి ఆర్యులని పేరు. ఈ ఆర్యులే క్రమముగ ప్రజాధనబలములు ప్రబలించి నానా దిగ్దేశములను వ్యాపించి, నేఁటికిని పృథివీతలవాసులలో నత్యంత బుద్ధి భుజబలాఢ్యులై విలసిల్లుచున్నారు. అగుంగాక. మానము ప్రస్తుతమనుసరింతము.

గ్రీకుదేశమునకు హిందూదేశమందలి సింధూనదమునకును అంతరము రమారమి నాలుగువేల మైళ్లుండును. గ్రీసుదేశస్థులను గ్రీకువారని పిలిచెదరు. వీరిని మన పూర్వులు మ్లేచ్ఛులనియు యవనులనియు వాడియున్నారు. ఈ పదములకు చదువరులు మహమ్మదీయులని యర్థము చేయగూడదు. ఏలయన మేమిప్పుడు వ్రాయుచున్నకథ మహమ్మదు పుట్టుటకు పూర్వము జరిగినది. ఈ వృత్తాంతము జరిగిన తరువాత 900 సంవత్సరములకు మహమ్మదు పుట్టెను. గ్రీకువారు మహాబలాఢ్యులు. మగధదేశముపై నందులు రాజ్యము చేయుచున్నప్పుడు గ్రీసుదేశము దన సామ్రాజ్యములఁ జేర్చుకొని యుండిన మకడోనియాలో అలెగ్జాండరను నొక మహావీరుఁడు క్రీ. పూ. 356 వ సంవత్సరమందు జన్మించెను.

అలెగ్జాండరు దండయాత్ర

ఇతఁడు పెక్కుదేశములు జయించి పారసీకదేశమును స్వాధీనపఱచుకొనిన తరువాత హిందూదేశము మీఁదికి దండెత్తి వచ్చెను. ఈతఁడు క్రీ. పూ. 327 వ సంవత్సరము

మే నెల మొదలుకొని క్రీ. పూ. 324 వ సంవత్సరము మే నెల వరకును అనఁగా మూఁడు సంవత్సరముల కాలము పంజాబ్ సింధు దేశముల యందుండి చిన్న చిన్న రాజ్యము లనేకములు జయించెను. ఇతనికిఁ దమంతట వశులయిన గొప్ప రాజులలో మొదటివాఁడు తక్షశిలా నగరాధీశ్వరుఁడు. తక్షశిలారాజ్యము సింధూ జీలమ్‌నదుల నడుమనుండి పూర్వము మిక్కిలి విఖ్యాతి వడసి యుండెను. బౌద్ధ కాలమునందు తక్షశిలా (రావల్ పిండి) నగరము సకల విద్యలకుఁ బుట్టినిల్లై యొప్పెను. అలెగ్జాండర్ సింధునదికిఁ దూర్పున విడిసియుండగనే తక్షశిలారాజగు ఆంభీ అనువాఁడు ఏడువందల గుఱ్ఱములును, ముప్పది యేనుఁగులును, మూఁడువేల బలిసిన ఎద్దులును, పదివేల బలిసిన గొఱ్ఱెలును, కానుకఁగా దీసికొనిపోయి అలెగ్జాండరు శరణుఁజొచ్చెను. ఇట్లు పంజాబు దేశమందలి యొక గొప్పరాజే అలెగ్జాండరుకు వశుఁడైనందున నతని సాహాయ్యమువలన నలెగ్జాండరు పెక్కు స్వదేశీయ రాజుల నోడింపఁ గలిగెను.

అలెగ్జాండరు సింధు నదముమీఁద ఓహింద్ అను స్థలము నొద్ద నావలతో వంతెనకట్టి దాఁటి తక్షశిలా రాజ్యమునకు వచ్చి అచ్చటి రాజువలన మిక్కిలి గౌరవమందెను. అటనుండి యాతఁడు తక్షశిలా సైన్యములనుగూడ వెంటఁబెట్టుకొని పోరస్ రాజ్యముమీఁదికి దండెత్తివెళ్లెను. జీలమ్ చీనాబ్ నదుల నడుమ పోరసులను పౌరుష ప్రథాను లప్పుడు రాజ్యము చేయుచుండిరి. గ్రీకు చరిత్రకారులు ఈ రాజుల పేరు పోరస్ అని వ్రాసిరి. ఈ పదము పౌరవపదద్యోతక మని కొందఱును

పురుషోత్తమ పదద్యోతక మని మఱికొందఱును వ్రాసి యున్నారు. అప్పటి పౌరవరాజు హూణుఁడగు నలెగ్జాండరును జీలము నదియొద్ద తన చతురంగసేనతో నెదురించెను. ప్రస్తుతము చిలియాన్‌వాలా యనఁబడు మైదానమునకుఁ బశ్చిమమునఁ బదునాల్గుమైళ్ళ దూరమున నదియొడ్డున ఘోరమైన పోరుగలిగె. ఇంటిగుట్టు లంకకుఁ జేటన్నట్టు లీ యుద్ధములోఁ దక్షశిలా రాజులు తమ స్వదేశస్థుఁడగు పురుషోత్తమునికి సాహాయ్యము చేయుటకు మాఱుగ దేశఘ్నులై తమ సైన్యముతో నలెగ్జాండరు పక్షమునఁ బోరిరి. అందువలనను, పురుషోత్తముని రథంబులు నదియొడ్డు బురదలో దిగఁబడినందునను అతని యేనుంగులు తిరుగఁబడి యతని సైన్యమునే నాశనము చేసినందునను అలెగ్జాండరు సైన్యములు పురుషోత్తముని సైన్యములకంటె నెక్కుడుగా నున్నందునను, అతనికిఁ బరాభవము గలిగి యలెగ్జాండరునకే జయము గలిగెను.

అలెగ్జాండరు పంజాబుదేశములోను, సింధు దేశములోను, రెండుసంవత్సరముల కాలముండెను. అంతలో నుత్తర పంజాబులోని తక్షశిల (డేరిషహాన్), నికాయా (మాంగ్), దక్షిణ పంజాబులోని అలెగ్జాండ్రియా, (వుచ్), సింధుదేశములోని పాటల (హైదరాబాద్), అను స్థలముల రాజులను దనకు నంకితులఁ జేసికొనియెను. తన సైన్యములోఁ గొంత భాగ మచ్చటచ్చట నుంచెను.

ఆతనికి హిందూదేశమంతయు జయింపవలెనను కోర్కె యుండెను గాని యతని సైన్యములు బియాస్‌నది దాఁటుటకు

సమ్మతింపక తిరుగఁబడినందున నాతఁడు క్రీ. పూ. 325 లో మరలి పోవలసినవాఁ డాయెను. తాను పంజాబు దేశములో సంపాదించిన రాజ్యమును కాపాడుటకు నధికారుల నియమించి వెళ్ళెను.

చంద్రగుప్తుఁ డలెగ్జాండరును జూచుట

ఇట్లు మన కథానాయకుండగు చంద్రగుప్తుఁడు చిన్న వయస్సులో నుండఁగా పంజాబు దేశమంతయు గ్రీకు దేశస్థులచే నాక్రమింపఁబడియె. నందవైరము కారణముగ చంద్రగుప్తుఁడు పాటలీ పురమునుండి పలాయితుఁడై పంజాబు ప్రాంతమున దిరుగుచు నలెగ్జాండరుని దండుఁజొచ్చి యాతని దర్శించునట్లును నందులు సర్వజన విరోధులుగావున వారినోడఁగొట్టి మగధము నాక్రమించుట మహాసులభ కార్యమని గ్రీకు యోధశ్రేష్ఠునకు నేష్య భారత చక్రవర్తి మంత్రోపదేశ మొసఁగినట్లును, యేవో యొక కారణమువలన అలెగ్జాండరునకు చంద్రగుప్తునిపై నాగ్రహముప్పతిల్లి యతనిని బట్ట నాజ్ఞయిడ నతఁడు పర్వత ప్రాంతము లోనికిఁ బారిపోయినట్లును ప్లూటార్కు వ్రాసి యున్నాఁడు. ఈ మాటయే నిజమైన యెడల చంద్రగుప్తుఁ డిరువదియైదేండ్ల వయస్సును మించనివాఁడుగా నున్నప్పుడు అలెగ్జాండరు మన దేశము మీఁదికి దండెత్తి వచ్చెనని మన మూహింపవచ్చును. గాని అలెగ్జాండరుతో నితనికిఁ బోరేల కలిగెనో మన మూహింపలేకున్నాము.

మూఁడులక్షల సైన్యపు వ్యూహములను మగధాధీశుని యేకచ్ఛత్రాధిపత్యమును, మహాపద్మని ధనజనాదివైభవము

లను, చూచిన చంద్రగుప్తుని కనులకు అలెగ్జాండరుని 50,000 సైన్యమును పేదఱికమును చులకనమై తోఁచెనో? అలెగ్జాండరు చంద్రగుప్తుల పరస్పర మర్యాదోపచారములలో హెచ్చు తక్కువలు కానిపించెనో? గాంగేయసీమకు రాక స్వదేశ ప్రయాణోన్ముఖుఁడైన గ్రీకు వీరునిజూచి మౌర్యుఁడు పరిహసించెనో? సాయమిచ్చి గాంగేయ భూమిని బొసఁగ గూర్చిన యెడ, తనకు భవ్యతం జూపమిని తెల్పిన మౌర్యునిపై నలెగ్జాండరు కినిసెనో? సామాన్య సంభాషణయందే చంద్రగుప్తుని స్వస్వామ్యతాగౌరవ భావంబుల కలెగ్జాండరోర్వక పోయెనో? చింత్యము.

చంద్రగుప్తుఁడు స్వతంత్రుఁడగుట

పైని వర్ణించినట్లు గ్రీసు దేశీయుఁడగు నలెగ్జాండరు పంజాబు దేశంబునఁ గొంత రాజ్యము సంపాదించి, వాని రక్షణార్థమై కొందఱు సైనికుల నటనట నునిచి వెడలినతరువాత వారిని వెడలిగొట్టి యా రాజ్యమును దా నాక్రమించు కొన వలెనని చంద్రగుప్తుఁడు ప్రయత్నములు చేయఁ నొడగెను.

మహావీరుడగు నీతఁడు సమయమునుకనిపట్టి వాయువ్య ప్రాంతమందలి యుద్ధప్రియులగు భటులను నరాట్టులను గూర్చుకొని శేషించిన గ్రీకుదళముల విదళీకరించి సైన్యబలమును నానాఁటికి వృద్ధిజేసికొని ప్రాంతసీమలకెల్ల నధికారియాయెను. (క్రీ.పూ. 322) అరాట్టులు,* అనఁగ, పంజాబు నివాసులును

* అరాట్టులు, అరాష్ట్రులు అను పదములకు గ్రీకు చారిత్రకులును చోరార్థమునం దుపయోగించి యున్నారు.

దొంగలును దోపిడికాండ్రును అని భారతమునందు దూషింపఁ బడియున్నారు. కతేయులు నటులనే దూషింపఁబడియున్నారు. కాని ఈ అరాట్టుల సీమలు ప్రజాసభ పాలితములై, రాజుల కధికారమియ్యక స్వతంత్రజనపూరితముగ నున్నట్లు తోఁచెడిని.

మహామ్మదీయ చరిత్రమునందు అక్బరు చెల్లాచెదరుగ నున్న దేశభాగములనెల్ల తన యాజ్ఞయం దిమిడ్చికొని చక్రవర్తిత్వఁ బడసినట్లు అతనికి 1900 సంవత్సరములకు మునుపు చంద్రగుప్తుఁడు చెల్లాచెదరుగనున్న సామంత ప్రభుత్వముల నెల్ల ఏకాజ్ఞాచక్రమునకు వశపఱచుకొని మగధాధీశుఁడాయె ననవచ్చును.

చంద్రగుప్తుఁ డిట్లు గ్రీకు వారిని వెడలఁగొట్టి, పంజాబు దేశమంతయు నాక్రమించుకొని, నందుల నోడించి, మగధ రాజ్యము సంపాదించి, హిందూదేశమున కంతకును దానుయేక చ్ఛత్రాధిపతిగ నుండఁదలఁచి సైన్యముల మిక్కిలి యభివృద్ధి చేసెను. ఆతనియొద్ద నాఱు లక్షల కాల్బలమును, ముప్పదివేల స్వారులును, తొమ్మిదివేల గజంబులును నుండెను. ఈ ప్రచండ సైన్యంబుతో నాతఁడు త్తర హిందూదేశ మందలి యన్ని రాజ్యములను గెలిచి, నర్మదా హిమాలయములు దక్షిణోత్తరపు టెల్లలుగను బూర్వపశ్చిమ సముద్రంబు లాయూ దిక్కుల యెల్లలుగను గల యార్యావర్తంబున కంతటికిని ప్రథమ చక్రవర్తి యయ్యెను.

శల్యూకస్‌ను జయించుట

అట్లు పంజాబునుండి వెడలఁగొట్టఁబడిన గ్రీకువారికి శల్యూకస్ నికేటర్ అను రాజుగలఁడు. ఇతఁడు మొదట నలెగ్జాండరు నొద్దనున్న గొప్ప సేనానులలో నొకఁడు. అలెగ్జాండరు కాలధర్మము నొందిన తరువాత సెల్యూకస్ కొన్ని దినముల వఱకు నితర సేనానులతోఁ బోరాడి ఆసియా ఖండములోని పశ్చిమ భాగమునకును మధ్య భాగమునకును రాజై బేబిలోన్ పట్టణమందు క్రీ. పూ. 312 వ సంవత్సరమున పట్టాభిషిక్తుఁ డయ్యెను. అతని రాజ్యము యొక్క తూర్పుసీమ హిందూదేశము నంటియున్నందున గ్రీకుపతాకమును మఱల పంజాబుదేశములో నిల్పనెంచి దానిపై దాడి వెడలి వచ్చెను. (క్రీ పూ. 305) అప్పటికి చంద్రగుప్తుఁడు సింహాసన మెక్కి పదునైదు సంవత్సరములయి యుండెను. అతఁడు పంజాబు సింధు దేశములను, గుజరాతు దేశమును జయించి వశపఱచి కొని యుండెను. సెల్యూకసు సింధునది దాఁటుట నడ్డగింపక చాణక్య చంద్రగుప్తులు అత్యంత చాతుర్యముతో అతని సైన్యమునెల్ల తమ సైన్యములతో చుట్టి ముట్టడించుకొని బంధించివేసిరి.

ఇట్టి యవసరమున సెల్యూకసు యుద్ధముఁజేసి సోలి పోయి శరణాగతుఁ డాయెనని కొందఱును, యుద్ధముసేయుటకు వెఱచి తన దుర్బలము నరసి వీర్యముకంటె వివేకము మేలని నిశ్చయించి చంద్రగుప్తునకు శరణాగతుఁడాయెనని మఱికొంద

యును ప్రవాసియున్నారు. కాని సెల్యూకసు శరణువేడుటయు చంద్రగుప్తుఁడభయమిచ్చుటయు జరుగుటకు బూర్వమే తమ చేతఁజిక్కిన మకడోనియా సైన్యములపై మాగధసైన్యములు కసిదీర్చుకొనె ననుటకు సందియము లేదు. (క్రీ. పూ. 303)

చంద్రగుప్తుడు శెల్యూకసుతో నొడంబడిక చేసికొని, గెడ్రోషియా అరకోషియా అనబడు అఫ్ఘానిస్థాను బెలూచిస్థాను దేశములు నూడఁబీకికొనియెను. ఇప్పటి యాంగ్లేయులు పశ్చిమోత్తర సామంత సీమలందు పర్వత రక్షితమై, పరశత్రువుల కభేద్యమై యుండు సరిహద్దులు తమచేతఁ జిక్కుపడవలెనని యత్నించిరి. మోగలరాజులును యత్నించిరి. కాని వీరి కేరికిని సాధ్యము కాలేదు. ఇట్టి సరిహద్దులు 2200 సంవత్సరములకు మునుపె మనదేశపు చారిత్రక చక్రవర్తియగు చంద్రగుప్తుని యాజ్ఞచేత నిమిడియుండెనన్న మన కెంతటి యశఃకరము నానందకరముగ నున్నది!

చంద్రగుప్తుఁడు సెల్యూకసును అంతటితో వదలిపెట్ట లేదు. అతని కుమారిత సుందరియు, యువతియు, నిపుణయునై యున్నందునను, తనకు మహిషినష్టమై యున్నందునను, యవను లటుమీఁదట శత్రుత్వము పాటింపకుందురనట్లు దగుపాటి వస్తువును విశ్వాస స్థానమందుంపవలసి యున్నందునను, యాదవ పాండవులయు విరాట పాండవులయు వియ్యంబులు వోలె నాకాలమునందు వియ్యంబు నెయ్యంబునకు ఆధారముగ భావింపబడినందునను, చాణక్య మంత్రాలోచన నంగీకరించి

చంద్రగుప్తుడామెను తనకు భార్యగ నామె తండ్రి సమర్పించు నట్లు చేసెను. అటుపిమ్మట నా గ్రీకునాయకునకు తనకు 500 ఏనుఁగులు కావలయునని వేడ, ఒక గజగమనకు మూల్యముగ 500 గజముల నియ్యవచ్చునను వాడుక ననుసరించి చంద్ర గుప్తుడు మామకు బహుమానమంపెను. నాఁడు చంద్రగుప్తుని వలనఁ బడినబాధలు మనస్సున నాటుకొనినందున గ్రీకులు ఈ దేశముపై దాడివెడలుట కలలోనైనను దలంపరయిరి. కాని గ్రీకుదార కుమారిత గాన, చంద్రగుప్తుని మహిషికిఁ బరివారములుగ ననేకగ్రీకులు పాటలియందు నివసించుచుండిరి. సెల్యూకసు తన రాష్ట్రపు పశ్చిమ ప్రాంతమున అంతిగోనసు అను పగతుఁడొకఁడు లేచి యుభ్రదవించుట విని క్రీ.పూ.303వ సంవత్సరమున బయలుదేరి వెడలెను. కాని తనకు రాయబారిగ మెగాస్తనీసు అనువానిని నియమించి పాటలీపురమున నుండు మని నిలిపె. ఈ మెగాస్తనీసు పరివారములును, ఆ గ్రీకుసాని పరివారములును, మౌర్యసేనయందమరియున్న శిల్పులును, చేతిపనివాండ్రును గలిసి యొక్క గ్రీకుపేటయే పాటలీపుర మందున్నట్లూహింపదగియున్నదని రిసుడేవిడ్సుని అభిప్రాయం. ఇందువలన మన దేశపు జనులకు శిల్పాదికృత్యములు తెలియవని భావముకాదు. * మనవారి నేర్పును గ్రీకులును గ్రీకుల నేర్పును మనజనులును నేర్చియుందు రందము.

---

* శిల్పములు మున్నుగువాని యందు హిందువుల నేర్పరి తనమునకు మెగాస్తనీసు వలనినంత దృఢసాక్ష్య మిచ్చినాఁడు.

అలెగ్జాండరునకు పూర్వము భరతవర్షమును గుఱించి పశ్చిమ ఖండవాసులకు నిర్ణీతజ్ఞానము లేక యక్షరక్షాది లోకములవలె పుక్కిటి పురాణములకు విషయమై యుండెను. లోకమంతటిని జయింప నాసక్తుఁడై వచ్చిన అలెగ్జాండరు అక్కాలమందు గ్రీకులకు ఋషిస్థానముననున్న అరిస్టాటిలుని శిష్యయందుంపఁబడి విద్యావిసీతుఁడై పెరిగినందున, దానాక్రమింపఁగల సమస్త దేశముల చరిత్రభూగోళాది వివరములఁ జక్కఁగ వ్రాయగలయట్టి గ్రీకువిద్వాంసులను తోడ్కొని వచ్చెను. అట్టి పలంపరా ప్రాప్తబుద్ధితో మెగాస్తనీసు తానున్నంత కాలము విన్నవియు కన్నవియు నౌ విషయముల దినచర్యగ వ్రాసికొనిపోయెను.

ఆ దినచర్యలో పాటలీపుత్ర నిర్మాణాది వివరములును, చంద్రగుప్త రాజ్యభారాది వివరములును, ఆ కాలమున నతడు అవలోకింపగల్గిన మతవర్ణాశ్రమాచార వ్యవహారాది వివరములును, దక్షిణ హిందూస్థానము మున్నగు తాను గనని ప్రదేశములను గుఱించి దా వినినయట్టి వివరములును, వంచన లేక లిఖించియున్నాఁడు.

ఆతఁడు పాటలీయందున్న రెండు వత్సరముల లోపలనే ఎంతయో వ్రాసి స్వదేశమునకు పుస్తకరూపముగ జ్ఞానమును కొనిపోయెను. అందలివర్తమానములను గ్రీసు ఇటలీ దేశస్థులగు చరిత్రకారులు తమ తమ చరిత్రములలో నెక్కించుకొని. సరితప్పులను తమ చిత్తమువచ్చినట్లు విమర్శనములలో కలిపి వ్రాసియుంచిరి.

ఇట్టివగు ఈ చరిత్రాంశములే మన హిందూదేశపు చరిత్ర వృత్తాంతముల కాలనిర్ణయములను గూర్చుటకు ఆధారములాయెను. భారతీయుల నాగరికతయు, చరిత్రయు శ్రుతి స్మృతి పురాణేతిహాసముల మూలమున దొరుకగల యట్టివి అత్యంత ప్రాచీనములును 5000, 10,000, 20,000 మొదలు గాగల సంవత్సరముల భూతకాల వ్యాప్తములయినను, కాల నిర్ణయ పట్టికా రూపమున పేర్చి వ్రాయనందునను, అద్భుత విచిత్రములను అతిశయోక్తులుగ కలిపిరచించినందునను చరిత్ర దృష్టికి నవి అవిశ్వసనీయములయి యున్నవి. కావున మన దేశపు గత 2500 సంవత్సరముల వృత్తాంతముల పట్టికకు ఈ మెగాస్త సీసుని దినచర్య సమస్త చరిత్రకారకులకును అనివార్యమైన యాధారముగ నున్నది. ఈతఁడు సాంద్రకోట్టసు, అని పేర్కొని యుండు నామము మొదట అనర్థ నామముగనే యుండెనుగాని, చంద్రగుప్త పదము ఆ గ్రీకుని నోట నట్లు మాఱినదని సరు విల్లియమ్ జోన్సు అను నొక పాశ్చాత్య విద్వాంసుఁడు వాఖ్యానమియ్యగనే, అందుండి చరిత్ర జ్ఞానాగ్ని రేగి ఇదమిత్థమని తెలియని హిందూ చరిత్రపు వార్తాంగారము లెల్ల రగులుకొనెను.

అటువంటి అగ్నిదాయకుఁడీ మెగాస్తనీసు, అటువంటి అగ్ని యీ చంద్రగుప్త (సాంద్రకోటసు) నామము. కావున నవనందులను చితియందు దగ్ధముగునట్లు చేసిన యీ చంద్ర గుప్తుని పేరు, ఈ భరతక్షితి దిగంతములకు వ్యాపించిన ప్రథమ చక్రవర్తి యశోఽగ్నిగను, భారతచరిత్రాంధకారమును కొంత

మట్టునకైన తొలఁగించుచు, పురాణాతిశయోక్తి గహనంబును భస్మీకరించునట్టి దావానలంబుగను ప్రజ్వరిల్లుచున్నది.

చంద్రగుప్తుడు పూర్వమే కోసలరాజ్యమును కబళీకరించి యుండెను. అతఁడు స్వయముగ పంజాబును సింధు దేశమును జయించెను. పంజాబులో సైన్యశిథిలత రాఁగనే చెదరుపడి యున్న సైన్యమంతటిని నాతండు తన మూలబలముగా చేసి కొనెను. అనంతరము గుజరాతును జయించి అచ్చట నొక రాజ ప్రతినిధిని నియమించినట్లు రుద్రదాముని శిలాశాసనము నేఁటికిని తెల్పుచున్నది. దీనికిపూర్వమే ఇతఁడు అవంతి అనగా ఉజ్జయిని దేశమును ఆక్రమించి వశపఱచుకొని యుండెను.

ఇమ్మెయిని రాజ్యారూఢుఁడైన చంద్రగుప్తునకు విశ్రాంతికి సమయము దొరికినదిగాదు. వృషలజనన కలంకము నకు విషయభూతుండు కావునను, ధననందునిచే పరపీడింపఁ బడిన ప్రజలపై యధిరూఢుండు కావునను, నందకులాభి మానుల కూటోపజాపములకు లక్ష్యుండు కావునను, ఉన్నత జాతి సంభూత సామంత రాజుల అవజ్ఞా విరోధంబులకును, అలెగ్జాండరు పాశ్చాత్య సేనానాయకుల యభియోగంబునకును ఆస్పదుండు కావునను, స్వయంభారత సర్వస్వ విజయకాంక్షి గావునను, జయింపఁబడిన రాష్ట్రముల సమాధానపఱచి పరి పాలనా సంవిధానములయందు సంస్కారలక్షణ దృష్టినైజము గలవాఁడు గావునను ఒక్కయెడ కూర్చొనుటకుగాని నిలచు టకుగాని త్రుటికాలము పరుండుటకుగాని వ్యవధిలేక, సదా దుష్టనిగ్రహ శిష్టపరిపాలనమునందే జీవితకాలమంతయు గడప

వలసినవాఁ డయ్యెను. చారిత్రక విషయముల కవిశ్వసనీయము లగు పురాణేతిహాసాది విషయముల నటుండనిచ్చిన భరతఖండ చక్రవర్తులయం దీతఁడే మొదటివాఁడుగఁ గన్పించుచున్నాడు. సేనలు నడుపుట, శత్రువుల నాక్రమించుట, నూతన దేశముల నార్జించుట, న్యాయముల దీర్చుట, నగర పంచాయతులు గ్రామపంచాయతులు నియమించుట, శిల్పముల వృద్ధిపరచుట, విదేశీయుల విచారించుట, జనన మరణముల గణించుట, వ్యాపారముల విమర్శించుట, చేతిపనుల బెంచుట, బాటలు వేయుట, వంతెనలు కట్టుట, ఓడలు నిర్మించుట, రాజపురుషుల నియోగించుట, చారదృష్టి చూచుట, చౌర్యఘాతకాదుల ఖండించుట, పన్నులరాఁబట్టుట, కాలువలు చెరువులు బావులు త్రవ్వించుట, నీళ్లువిడుచుట, నేలకొలుచుట, పంటలెక్కించుట, దుర్భిక్ష మహామార్యాది దుఃఖముల విమర్శించుట, మున్నగు సర్వ రాష్ట్రనిర్వాహ విషయములందును వేగన్నుల చూపుతో జాగరూకుఁడై, ఆత్మరక్షణార్థము ఆహార, విహార, శయ్యా, ఆసన, భాజన, ఔషధ, బంధు, కళత్ర, మిత్ర, పుత్రాదులనెల్ల ననిమీలిత నయనుఁడై పరిశోధించుచు ఇరువది నాలుగు వత్సరములు రాజ్యమేలెను.

చంద్రగుప్త రాజ్యవిస్తారము

క్రీ. పూ. 322 మొదలుకొని 303 వఱకు అనగా చంద్రగుప్తుఁడు మొదట గ్రీకువారిని పంజాబుదేశమునుండి వెడలఁగొట్టినది మొదలు శెల్యూకస్ నికేతర్ నోడించి అతనితో

సంధిచేసికొను కాలమువఱకును చంద్రగుప్తుఁడు ఉత్తరమున అఫ్గనిస్థానము బెలూచిస్థానముల వఱకును, పూర్వముననుపశ్చిమముననుసముద్రము వఱకును గల రాజ్యమును జయించి యేకచ్ఛత్రాధిపత్యముతో నేలి హిందూదేశముయొక్క మొదటి చక్రవర్తియనిన బిరుదును సంపాదించుకొనెను.

మైసూరు గెజటీయరు లేఖకుఁడగు రైసుగారినుడువున, శికర్పూరు తాలూకా బందనిక్కె గ్రామపు శిలాశాసనము (12-వ శతాబ్దములో) కుంతలదేశమును మౌర్యుల మాగాణముగా వర్ణించు చున్నది. ఇయ్యది భీమావేదవతులకు నడుమ సహ్యాద్రులవఱకును శివమొగ్గ, చిత్రదుర్గము బళ్లారి, ధార్వాడ బీజాపురము, బొంబాయి, హైదరాబాదు సీమల భాగములను వ్యాపించిన దేశమనియు తెలిపెడిని. ఈ దక్షిణదేశమును జయించినవాఁడు చంద్రగుప్తుఁడో లేక ఇతని కొడుకగు బిందుసారుఁడో తెలియకున్నది. మైసూరు సీమలోనే శ్రవణ బెళగొళమునందలి శిలాశాసనము చెప్పిన చంద్రగుప్తుఁడు అచ్చట జైనమతావలంబకుఁడై మరణమొందినట్లుగాన బడియెడి. కాని ఇది యింకను చింత్యము.

పదునాఱు సంవత్సరములలో నింత విశాల రాజ్యమును నిర్మించి, దానిని మిక్కిలి జాగ్రత్తతోఁ గాపాడిన ఈ రాజును భూమండలములో శూరాగ్రేసరులని ఘనతవహించిన ఫిలిప్పు అలెగ్జాండరు, హ్యానిబలు, నెపోలియను మొదలయిన మహా సేనానాయకులలో నొక్కనిఁగా నెంచవలెనని యొకానొక పాశ్చాత్యుఁడు వ్రాసియున్నాఁడు.

అయిదవ ప్రకరణము

చంద్రగుప్త కాలనిర్ణయము

హిందూ దేశమునకుఁ బ్రథమ చక్రవర్తియైన చంద్రగుప్తుని కాలమెట్లు నిర్ణయింపఁబడినదని చదువరు లడుగవచ్చును. వారి జిజ్ఞాస తృప్తిపఱుచుటకై యిచ్చట నీ విషయము చర్చింప వలసియున్నది. ఇదియుఁగాక చంద్రగుప్త కాలనిర్ణయము హిందూదేశ చరిత్రాధ్యయనముఁ జేయగోరు విద్యార్థులు గమనింపవలసిన ముఖ్యవిషయములలో నొక్కటి. హిందూదేశము యొక్క సాద్యంత చరిత్రము నేటి వరకు హిందూ మహాయుగము, మహమ్మదీయ మహాయుగము బ్రిటిషు ప్రభుత్వము అని త్రిప్రకరణాత్మకముగా వర్ణింపఁబడు చున్నది. ఇందు రెండవ మూఁడవ ప్రకరణములలోని కాల నిర్ణయములు నిశ్చితములు. వానిని గుఱించి విశేష భిన్నాభి ప్రాయము లుండవు. గజినీమహమూదు సోమనాథ దేవాలయ మును దోఁచుకొనిన సంవత్సరమును, అక్బరు చక్రవర్తి రాజ్య మునకు వచ్చిన తేదియు, లార్డు కారన్ వాలిసు రాజప్రతి నిధిగా హిందూదేశమునకు వచ్చిన యేఁడును మనము నిశ్చయ ముగా నెఱుఁగుదుము, ఇందుకు కారణము ఆయా కాలముల

చరిత్రకారులు కాలస్థల నిర్ణయముతో సమకాలిక చరిత్ర విషయములను వ్రాసియుంచుటయే. కాని హిందూమహా యుగము నందలి చరిత్రాంశముల కాలనిర్ణయ మిట్టిదికాదు. ఇందలి ప్రతివిషయిక కాలనిర్ణయము సంశయాస్పదమే. ప్రతి విషయమును గుఱించియు అభిప్రాయ భేదములు తండోప తండములుకలవు. ఋగ్వేదమెప్పుడు రచింపఁబడెననిన ప్రశ్నకు నొక్కఁడు వైదువేల యేండ్ల క్రిందననియు మఱియొకఁడు ఏడువే లేండ్ల క్రిందననియు, నింకొకఁడు పదివేలేండ్ల క్రిందననియుఁ బ్రత్యుత్తరము లిచ్చెదరు. ఇదమిత్థమని చెప్పుటకు దగిన సాధనములు లేవు. ఇట్లే ఉపనిషత్తుల కాలమును గుఱించియు మహాభాష్య రచనాకాలమును గుఱించియు శంకరాచార్యుని యవతార సమయమును గుఱించియు వాద ప్రతివాదములును గలవు. పై కారణములచే హిందూ మహాయుగము నిశ్చితకాల జ్ఞానాభావ మను అంధకారముచే నిండియున్నది. ఇట్టి మహాంధకార మధ్యమున చంద్రగుప్త కాలనిర్ణయమను నొక చిన్న దీపము గ్రీకు చరిత్రకారుల సాయముచే వెలుగు చున్నందున దానిని నాధారముఁ జేసికొని అందుకు ముందు వెనుక జరిగిన చరిత్రాంశముల కాలము పండితులు నిశ్చయించుచున్నారు.

కావున కాలనిర్ణయము లన్నింటికిని ఆధారభూతమైన చంద్రగుప్త కాలనిర్ణయమెట్లు చేయఁబడెనో, అదియెంతవఱకు నమ్మఁదగినదో మన మాలోచింప వలెను.

అలెగ్జాండరు హిందూదేశమునకు వచ్చినప్పు డతనితో నేతెంచిన పండితులును, చంద్రగుప్తుని దివాణమునకు రాయబారిగ వచ్చిన మెగస్తనీస్ అనువాఁడును వాని ననుసరించి మఱియు ననేకులగు గ్రీకు గ్రంథకారులును సాంద్రకోటస్ లేక శాంద్రగోప్టస్ అనువాఁడు అలెగ్జాండరును మొదట వచ్చి చూచినట్టును అలెగ్జాండరు చనిపోయిన కొలఁది కాలములోనే అతఁడు పంజాబు దేశమునుండి గ్రీకుసైనికులను వెడలఁగొట్టి స్వతంత్రుఁ డైనట్టును అతని రాజధాని గంగయొడ్డున పాలిభోత్రానామముతో మిగుల వైభవమునొందిన పట్టణమైనట్టును అతనికి పూర్వమున రాజుగనుండినది నంద్రస్ అనువాఁడై నట్టును వానియందు జనులకు ద్వేషము గలిగినందున సాంద్రకోటస్ వానిని జంపి రాజైనట్టును వ్రాసియున్నారు. మొట్టమొదట సాంద్రకోటస్ అన నెవ్వఁడో దెలియక పోయెనుగాని పై వర్ణనలన్నియు చక్కఁగ విమర్శించి పాశ్చాత్య విద్వాంసులు సాంద్రకోటస్ అనగా చంద్రగుప్తుఁ డనియు పాలిహోత్ర యనగా పాటలీపుత్రమనియు నంద్రస్ అనగా నందుఁడనియు నిశ్చయించి యున్నారు. పాలిహోత్రకును గంగానదికిని గల యంతరము మెగస్తనీస్ వ్రాసి యున్నాఁడు. అదియును ప్రస్తుతము పాట్నా పట్టణమునకును గంగకును గల యంతరముతో సరిపోవుచున్నది. ఇంతియగాక పాలిహోత్ర గంగాశోణల సంగమము వలన గలిగిన యంతర్వేదిలో నున్నదని అతఁడు వ్రాసిన విషయము ప్రస్తుతము పాట్నా, అనఁగా పూర్వపు పాటలీపురమునకే, అన్వయించుచున్నది, కావున

పాలిబోత్ర యనగా పాటలీపురమనియు, సాంద్రకోటస్ అనఁగా చంద్రగుప్తుఁడనియు ఈతఁడే సెల్యూకస్ నికేతర్ నోడించెననియు, ఇతని రాజధాని పాటలీపురమనియు మనము గట్టిగఁ జెప్పవచ్చును.

కాలనిర్ణయమునకు రెండవసాధనము

ఇట్లు మనమొక నిశ్చయమైన సాధనమును బట్టి చంద్రగుప్తుని కాలమును కనుగొంటిమి. ఇదియే నిజమైనదని నొక్కి వక్కాణించుటకు మఱియొక స్వతంత్ర సాధనముకలదు. మొదటి సాధనమునకును దీనికిని సంబంధములేక దీన వేఱువిధముగ లెక్కలువేసి పై కాలమునే సాధించుటవలన దీనిని స్వతంత్ర సాధనమంటిమి.

చంద్రగుప్తుని కుమారుడు బిందుసారుడు. బిందుసారుని కుమారుఁడు అశోకవర్ధనుఁడు. ఇతఁడే ధర్మోపదేశార్థమై తన రాజ్యము నందంతటను శిలాశాసనములను చెక్కించి వేయించి మిక్కిలి ఖ్యాతివడసిన అశోకుఁడు. ఇతని శాసనములలో అశోకుఁడనెడు నామములేదు. ప్రియదర్శియన్న సంస్కృత పదమునకు ప్రాకృతరూపమైన పియదశి నామముకలదు. కాని అశోకునికే ప్రియదర్శియనిన నామాంతరము గలదని మనము పెక్కు సాధనములవలన నిశ్చయింపవచ్చును. * ఈవిషయము

* ఇందును గురించి యధికము తెలిసికొనఁ గోరువారు The Journal of the Royal Asiatic Society యొక్క 1901 వ సంవత్సరపు సంపుటలో Identity of Piyedasi with Asoka Maurya అన్న వ్యాసము చూడనగును.

చరిత్రకారులందఱును నిస్సంశయముగా నొప్పుకొనినదే యయి నందున ఇచ్చట వివరణ మనవసరము.

అశోకునిచేఁ బ్రకటింపఁబడిన పదమూఁడవ శిలాశాసనమునందు నీ ప్రకారముగా వ్రాయఁబడియున్నది.

పదమూఁడవ శిలాశాసనము.

సత్యజయము.

" పియదశి ముఖ్యతమముగ నెన్నెడి విజయము ధర్మ సందేశము వలననగు విజయమే. ఇట్టి విజయము పియదశి దన సామ్రాజ్యము నందేగాక దన కిరుగు పొరుగు సీమల యందలి ప్రజలందఱమీఁదను గూడ నొందియున్నాఁడు. ఆరువందల యోజనముల దూరముననుండు అంతియోక నామధేయుఁడగు యోనరాజు నివసించు ప్రదేశమునకు ఈ అంతియోకున కావల 'తురమాయె' 'అంతికిని' 'మక' 'అలికసుందర' అను నామములతోఁ బరగు రాజచతుష్టయము నివసించు ప్రదేశములకును ఈ విజయము వ్యాపించియున్నది."*

---

* Eshe cha mu (kha) mute Vijayedevanam Priyasayo dhramavijayo; so cha puna ladho devanam priyasa iha cha sa (dre) shu cha anteshu (8) ashashu pi Yojanasa (te) shu yatra Amtiyokonama Yona raja param cha teva Amtiyokena chature (4) rajani Turamaye nama Amtikini nama Makanama Alikasundaro nama. (ఏ షేచా ముఖముతే విజయే దేవానాం ప్రియసయో ధ్రమవిజయోషో చ పున లధో దేవానాం ప్రియస ఇహ చ సద్రేషుచ అంతేషు [8] అషషుపి యోజనా శ [తే] షు యాత్ర అంతియోకోనామ యోనరాజా పరాంచ తేవ అంతి యోకేనచతురే [4] రాజాని తురమాయే నామ అంతికిని నామ మక నామ అలిక సుందరో నామ.)

ఈ శాసనమునందు నైదుగురు విదేశపురాజుల పేళ్లుదాహరింపఁబడినవి. వీరిలో అంతియోకుఁ డనువాఁడు ఆంటియోకస్ థియాస్ అను (**Antiochus Theos**) సిరియా దేశపు రాజు. ఇతఁడు క్రీ. పూ. 246 వఱకు రాజ్యముచేసెను. తురమాయే అనువాఁడు టాలిమీ ఫిలాడల్ ఫస్ (**PtolemyPhiladel—Phus**) అను నామముతో ఈజిప్టు దేశముపై రాజ్యముఁజేసి క్రీ. పూ. 246 లో మృతుఁడయ్యెను. ఈతని కూఁతునే అంతియోకుఁడు వివాహమాడెను. అంతికిని అనువాఁడు ఆంటిగోనస్ గొనిటస్ అనునామముతో మకడోనియా రాజ్యమును సంపాదించి 239 వఱకు రాజ్యముచేసెను. అలికసుందరుఁడను వాఁడు పైరసు అనువాని కుమారుఁడు. అలెగ్జాండరు నాఁబడు ఎపిరస్ దేశపు ప్రభువు. క్రీ. పూ. రమారమి 260 వ సంవత్సరము వఱకు ప్రభుత్వముఁ జేసెను. మాగాస్ అనువాఁడు సైరిన్ దేశపురాజు టాలిమీకి సాపత్న్య సోదరుఁడు. 258 వ సంవత్సరమున పరలోకగతుఁ డయ్యెను.

పైని ఉదాహరింపఁబడిన పేళ్లుగలరాజు లచ్చటచ్చట భిన్నకాలములం దుండినను పై ఐదుపేళ్లుగల రాజులేక కాలమునందు భిన్నదేశముల నేలుచుండుట మేముదహరించిన సిరియా, ఈజిప్టు, మకడోనియా, ఎపిరస్, సైరిస్ రాజుల విషయమయ్యే సిద్ధించుచున్నది. కనుక కాలనిర్ణయ విషయములో పొరబాటెంతమాత్ర ముండుటకు వీలులేదు. ఇదియునుంగాక ఈ మెగాస్ తప్ప యీ నామధేయము గల మఱియొక రాజు లేనేలేఁడు.

మెగాస్ రాజు 258 వ సంవత్సరమున మృతుండయ్యెను. అలెగ్జాండరు గూడ ఆ సంవత్సరముననో లేక యంతకు గొంచెము కాలము పూర్వముననో పరలోక గతుండయ్యెను. కావున పైని పేర్కొనంబడిన అశోకశాసనము మెగాస్ బ్రతికి యుండగనో లేక మృతిఁజెందిన సమాచారము తెలియక పూర్వమో చెక్కింపంబడి యుండును. సైరన్ నుండి మెగాస్ మృతిఁజెందిన వర్తమానము హిందూదేశమునకు వచ్చుటకు నొక సంవత్సరము కంటె నెక్కుడుకాలము పట్టదనుట నిశ్చయము. కావున 257 వ సంవత్సరముకంటెఁ దరువాతి కాలమున నీ శాసనము చెక్కింపఁ బడ లేదని మనము నిశ్చయింపవచ్చును. ఈ శాసనము అశోకుని పట్టాభిషేకమయిన తరువాత పదమూఁడవ యేట చెక్కింపఁ బడియెను. అనఁగాఁ బట్టాభిషేకమై పండ్రెండు సంవత్సరములు గతించెనని యర్థము. 257 తో 12 కలుపగా 269 వ సంఖ్య సిద్ధించుచున్నది. కావున క్రీ. పూ. 269 వ సంవత్సరమున అశోక మహారాజు పట్టాభిషిక్తుఁడయ్యె నని తేలుచున్నది. సింహళద్వీప చరిత్రములఁజూడ కొన్ని గృహ కలహములచే నశోకుఁడు రాజ్యమునకు వచ్చిన తరువాత మూఁడు సంవత్సరములకు నతని పట్టాభిషేకము జరిగెనని తెలియుచున్నది. కనుక నాతనికి 269 లోఁ బట్టాభిషేకము జరిగి నను ఆతఁడంతకు మూఁడు సంవత్సరముల ముందే అనఁగా క్రీ. పూ. 272 లో రాజ్యమునకు వచ్చినట్టు గ్రహింపవచ్చును.

అశోకుని తండ్రి బిందుసారుఁడు. ఆతఁడిరువది యైదు సంవత్సరములు రాజ్యముఁ జేసెనని పురాణములు చెపు

చున్నవి. మన చరిత్ర నాయకుఁడగు చంద్రగుప్తుఁడే బిందుసారునితండ్రి. ఈతఁడిరువదినాలుగు సంవత్సరములు నేలయేలె నని పురాణములును సింహళ గ్రంథములును నుడువుచున్నవి. అనఁగా చంద్రగుప్తుఁడును బిందుసారుఁడును కలిసి 49 సంవత్సరములు రాజ్యమేలిరి. ఈ సంఖ్య 49 యిదివఱకు మనచే సాధింపబడిన 272లో ననఁగా అశోకుఁడు రాజ్యమునకు వచ్చిన సంఖ్యలోఁ గలుపఁగా 321 వచ్చుచున్నది. ఇదియే చంద్రగుప్తుఁడు రాజ్యమునకు వచ్చిన సంవత్సరపు సంఖ్య.

ఈలాగున మనము రెండు భిన్నమార్గముల బయలుదేరి వేఱు వేఱు నడకల నడచినను ఘట్టకుటీప్రభాత న్యాయమున నొక్కచోటికే వచ్చి చేరుచున్నాము. సాంద్రకోటస్ అనఁగా చంద్రగుప్తుఁడని యెంచి, అలెగ్జాండరుయొక్క దండయాత్ర తిథులును గ్రీకు చరిత్రకారులును నాధారముగాఁగైకొని వేసిన లెక్కలవలనను అశోకవర్ధనుని శాసనము నాధారము చేసికొని పురాణాదులలో వర్ణింపఁబడిన మౌర్యరాజుల పాలనాకాలము లెక్క వేసినను క్రీ. పూ. 321 లోనో, లేక 322 లోనో అతఁడు రాజ్యమునకు వచ్చినట్లు స్పష్టమగుచున్నది.

ఇదియుఁగాక వేరొక విశేషము గలదు. అశోకుఁడు క్రీ. పూ. 272 మొదలుకొని 231 వఱకు రాజ్యమేలెను. అతనిచే శాసనములోఁ బేర్కొనఁ బడిన ఆంటియోకుఁ డతనికి సమకాలికుఁడై 261 మొదలు 246 వఱకు రాజ్యమేలెను. చంద్రగుప్తుఁడు అశోకుని తాత. శెల్యూకస్ నెకటార్ ఆంటి

యొకని తాత. మనుమలు సమకాలికులైనప్పుడు వారి తాతలు గూడ సమకాలికులగుట సహజమని సాధారణముగ గ్రహింపవచ్చును. కావున సెల్యూకస్ నికేతర్ చంద్రగుప్త మౌర్యునకు సమకాలికుడనుట స్పష్టము.

పైని వ్రాయఁబడిన హేతువులచే మనచరిత్ర నాయకుండగు చంద్రగుప్త మౌర్యుఁడు అలెగ్జాండరు తోడను సెల్యూకస్ నికేతర్ తోడను సమకాలీనుఁడు అని తేలినది. గ్రీకు వారగు వీరిద్దఱి చరిత్రలును సమకాలికులైన గ్రంథకారులచే వ్రాయఁబడి యున్నందున వారి కాలము నిశ్చితము. వారి యుద్ధములను గుఱించియు దాడులను గుఱించియు ప్రవాసములను గుఱించియు చేయఁబడిన కాలనిర్ణయములలో ఒకటిరెండు నెలల విభేదము వచ్చినను రావచ్చును. కాని అంతకంటె నెక్కుడు ఎచ్చుతక్కువ లుండవు.

అలెగ్జాండరు హిందూదేశమునకు వచ్చినప్పుడు చంద్రగుప్తుఁడు ఆతనిని సందర్శించి నట్టున్నది. గావున ఈ ప్రసంగము క్రీ.పూ. 325 లోనో 326 లోనో జరిగియుండవలెను. అలెగ్జాండరు క్రీ.పూ. 325 వ సంవత్సరమందు మే నెలలోనో జూన్ నెలలోనో కీర్తిశేషుఁడయ్యెను. అతని మరణవార్త తెలిసిన కొలఁది కాలమునకే చంద్రగుప్తుఁడు స్వతంత్రుఁడయ్యెనని వ్రాయఁబడి యున్నది. అలెగ్జాండరుని మరణవార్త హిందూదేశ జనులకుఁ తెలియుటకు రెండు నెలలు పట్టినదనుకొన్నను ఆగష్టు నెలలోనో లేక సెప్టెంబరు నెలలోనో యీ వార్త తెలిసియుండును. ఆతఁడు వెంటనే సైన్యములను కూర్చుకొని

పంజాబు దేశమునుండి గ్రీకువారిని వెడలఁగొట్టి నందున సీవార్త క్రీ.పూ. 322లో జరిగెనని చెప్పవచ్చును. సెల్యూకస్ తన పశ్యాపై భవమునకు బునాది నిర్మించుకొను చుండగా చంద్రగుప్తుఁడు హిందూదేశమునకు చక్రవర్తి యయ్యెనని జస్టిస్ వ్రాసియున్నాఁడు.* సెల్యూకస్ క్రీ. పూ. 321 లో బేబిలోన్ పట్టణమునకు క్షేత్రపుడుగా నియమింపఁబడెను. ఈ క్షేత్రపాధికారమే యతఁడు తరువాత రాజగుటకు మూలాధారము. అప్పటికి చంద్రగుప్తుఁడు మగధాధీశ్వరుఁడై యుండవలెను. కావున నంద సంహారము, పర్వతేశ్వర వధ, అమాత్య రాక్షసుని వశపఱచుకొనుట మొదలైన ముద్రారాక్షస వర్ణిత కథాంశము లన్నియు 321 లోనో తరువాత ఒకటి రెండు సంవత్సరములలోనో జరిగియుండవలెను. సెల్యూకసు 305 లోనో 304 లోనో చంద్రగుప్తుని మీఁదికి దండెత్తి వచ్చి 303 లోఁ బూర్తిగ పరాభూతుఁడై మగధేశ్వరునితో సంధిఁ జేసికొని వెళ్లిపోయెను. చంద్రగుప్తుఁ డిఱువదినాలుగు సంవత్సరములవఱకు రాజ్యముఁ జేసెనని వాయుభాగవతాది పురాణములలోను సింహళదేశపు చరిత్రలోను వ్రాసియుండుటఁ బట్టి అతఁడు 298 లోనో లేక 297 లోనో కీర్తిశేషుఁ డయ్యెనని మనము చెప్పవచ్చును. చంద్రగుప్తుఁ డలెగ్జాండరును చూచు వఱకు నిఱువదియైదేండ్ల వయస్సు గలవాఁడని యెంచితి మేని

* "Sandrakottus having thus won the throne was reigning over India when Seleucus was laying the foundations of his future greatness" (Justis)

యాతఁడు 350 వ సంవత్సర ప్రాంతమున జన్మించి యుండ వలెను. మనమిట్లు తేల్చుకొనిన కాలనిర్ణయమంతయు నీక్రింది పట్టికలోఁ గనుపఱుచఁ బడినది.

క్రీ. పూ.	
350	చంద్రగుప్త జననము.
326, 325	అలెగ్జాండరును చూచుట
323 అక్టోబరు, 322	చంద్రగుప్తుఁడు పంజాబునుండి గ్రీకు వారిని వెడలఁగొట్టుట.
322, 321	మగధరాజ్యము నాక్రమించుకొనుట.
305, 304	సెల్యూకస్ హిందూదేశముమీఁదికి దండెత్తి వచ్చుట.
303	సెల్యూకసు పరాభవము, చంద్రగుప్తునితో సంధిచేసికొనుట.
298, 297	చంద్రగుప్తుని మరణము.

ఆఱవ ప్రకరణము

చంద్రగుప్తుని రాజధాని

భరతఖండంబు నంతయు ఏకచ్ఛత్రాధిపత్యము క్రిందికిఁదెచ్చిన మన కథానాయకుఁడు పాటలీపుత్రమను నగరమునందు రాజ్యము చేయుచుండెను. పుష్పపురము, కుసుమపురము అను నామాంతరములు గల యీ పట్టణరాజము చంద్రగుప్త చక్రవర్తి ప్రభుత్వకాలమునందు మహోన్నతావస్థను చెంది, అతని మనుమఁడగు అశోకుని రాజ్యకాలమందు నత్యుచ్చవైభవ శిఖరముఁజేరి. భూలోకమునందు నా కాలమున నున్న యశేష పట్టణములలో నతిశ్రేష్ఠమైనదియు, నద్వితీయమైనదియు నని బాగ ద్దఁగని యుండెను. ఇదియుఁగాక, యనేక కవులకును, పండితులకును, శిల్పులకును, అన్యదేశ వర్తకులకును, ఆశ్రయ స్థానమును, వర్ణనీయవిషయమును అయి రాఘవుల అయోధ్యకును, కౌరవుల హస్తినాపురమునకును, మొగలాల ఢిల్లీకిని, ఆంగ్లేయుల కలకత్తాకును సరిపోల్చఁదగిన యీ పుష్పపురి రమారమి వేయి సంవత్సరముల వఱకును మగధరాజధానియై విలసిల్లెను! ఇట్టి పురశ్రేష్ఠము యొక్క యుత్పత్తియు, చంద్రగుప్తుని కాలమున నద్దాని

వైభవమును, సంక్షిప్తముగఁ దరువాతి చరిత్రయు, నీ ప్రకరణమునందు వర్ణింపఁబడుట యత్యంతావశ్యకము.

నామనిర్దేశము

సాధారణముగా నిటీవలి యింగ్లీషుచరిత్ర గ్రంథములలో 'పాటలిపుత్ర' నామమే యెక్కుడుగా వ్యవహరింపఁబడు చున్నను, సంస్కృతకవులు మాత్రము పాటలీపుర, కుసుమపుర, పుష్పపుర నామములనే వాడి యున్నారు.* త్రికాండశేషము నందు మాత్రము 'పాటలీపుత్ర' మను పాఠాంతరము కలదు. బృహత్కథయందుఁ గూడ నీ పేరు వచ్చినట్లున్నది. గ్రీకుల భాషలో దీనిని పాలిబోతు (Palibothu) అని వాడియున్నారు. ఈ పట్టణ స్థానమునందున్న పట్టణమునకు నిపుడు 'పాట్నా' యన్న పేరు కలదు.

ఇప్పుడీ పట్టణ మెచ్చట నున్నది ?

హిందూదేశ పటమును ఎదుట వేసికొని చూచినయెడల ఈశాన్య దిశయందు ఇప్పుడు ఈ దేశపు ముఖ్యరాజధానియగు కలకత్తాపురి కానవచ్చును. ఇప్పురి గంగానదిపాయలో పెద్దది యగు హూగ్లినదీ తీరమున గంగాసాగరమునకు నలువదిమైళ్ళ దూరమున అలరారుచున్నది. ఇచ్చటనుండి యోడమార్గమునో లేక పొగబండి మార్గమునో అనుసరించితిమేని రమారమి 333 మైళ్ళ దూరమున పాట్నా యను పట్టణము గంగాతీరమున

* రఘువంశము, 6 వ సర్గము, 24 వ శ్లోకము. ఆర్యభట్టీయము, ద్వితీయ గణితపాదము.

కలకత్తాకు వాయవ్యమున నుండఁజూతుము. ఇయ్యది దిగువ బంగాళపు (Lower Bengal) పట్టణములలో కలకత్తాకు రెండవదిగా నున్నది. ఇంతటి విస్తీర్ణమును జనసంఖ్యయు నేఁటికిని గల యీ పాట్నాపురి మహమ్మదీయ పరిపాలనమున బేహారు జిల్లాకు ముఖ్యస్థానముగ నుండె. కాని ఈ నామముచే నొప్పుపురము 650 వత్సరములకు మున్నుండలేదు. దీనిస్థానమున గొంతకాలము బీడును, అంతకుఁ బూర్వమున, ననఁగా ప్రాచీన కాలమునందు మఱియొక గొప్పపురియు నుండెడివి. ఆ పురియే పాటలీపురము,

రాజకీయ విషయమునందు గంగానదియొక్క విశేషము నరయుఁడు. గంగాశాఖ యగు హూగ్లీతీరమున హిందూదేశపు ప్రస్తుతపు రాజధాని కలకత్తా యున్నది. గంగ కుపనదియగు యమునాతీరమున మహమ్మదీయ రాజధానులగు ఢిల్లీ, యాగ్రాలు కలవు. ఢిల్లీకి మూఁడు మైళ్ళదూరమున పాండవ రాజధాని ఇంద్రప్రస్థముండె. ఇంద్రప్రస్థమునకు అఱువదిమైళ్లు వాయవ్యమున కౌరవపారిక్షితుల రాజధాని హస్తినాపురముండె. గంగ కుత్తరోప నదియగు సరయు (గాగ్రా) దక్షిణతీరమున అయోధ్యాపురి రఘుకుల రాజుల రాజధానిగనుండె. గంగ, గాగ్రా, రాప్తి, గండకి, శోణానదులు కలియు ప్రాంతమున పాటలీపుత్రము చంద్రగుప్త రాజధానిగ నుండె. కావున రాఘవ, కౌరవ, పాండవ, పారిక్షిత, నంద, చంద్రగుప్త, గుప్త, ఆంధ్ర, మహమ్మదీయ, ఆంగ్ల రాజధానులు, గంగనో, గంగా

శాఖోపశాఖలనో ఆశ్రయించి యున్నవి. ఇందు పాటలీపుత్రము నిర్మింపఁబడిన స్థలము కంఠసరములను గూర్చిన పతకమువలె అనేక నదుల సంగమమునకు సమీపమున నుండుటఁబట్టి అలంకారముగను, బలప్రదముగను, వ్యాపారానుకూలతంబట్టి ధనప్రదముగను నుండెను. కనుకనే ఇది వేయునెక్కు-వేండ్ల కాలము హిందూస్థానపు బలిష్ఠ రాజధానిగ విరాజిల్లుచుండెను.

నామోత్పత్తి

పాటలీపుత్రమన్న పేరుగల్గుట కనేకు లనేక హేతువులు చెప్పుచున్నారు. పాటలీయన నొక పుష్పవిశేషము. దీనిని తెలుఁగులో కలిగొట్టు పువ్వందురు. ఈ పువ్వును బోలి ఆ పురి యొక్క యాకారముండెననియు, అందుచే నా పేరు వచ్చెననియు కొందఱి యభిప్రాయము. ఆ పట్టణమందును, సమంత ప్రాంత మందును పాటలీ వృక్షములును, పుష్పములును మెండుగ నున్నందున ఈ నామము కల్గెనని కొందఱందురు. శ్రీరామ లక్ష్మణులు సరయూగంగా సంగమమునకు పైని సరయును దాఁటి దక్షిణతీరము చేరఁగనే వారికి పాటలాది వృక్ష సంకీర్ణమైన వనము కానవచ్చినట్లు శ్రీమద్రామాయణము నందు వర్ణింపఁబడినది.* కావున మిక్కిలి ప్రాచీన కాలము నుండి మగధదేశముయొక్క యీభాగము పాటలిపుష్పమున కై ప్రసిద్ధి వహించినట్లు కానవచ్చెడిని.

* వాల్మీకి రామాయణము, బాలకాండము, 24 వ సర్గము.

ఇప్పుడు పాట్నా నగరమునందు చిన్న పట్నదేవి, పెద్ద పట్నదేవి యను దేవాలయములు రెండు గలవు. వానిలో నర్చకులుగా నుండువా రిట్లు చెప్పెదరు. సుదర్శనుఁడను రాజునకు పాటలి యను కూఁతురు గలదు. ఆమెచే నీ పట్టణము కట్టింపఁ బడియెను. ఈమె కాలేఁడు బహుమతిగ నీ పట్న మొసంగగ, దీనిని పుత్రవాత్సల్యముతో తల్లింబోలె సంరక్షించి నందున పాటలిపుత్రమని పేరుగల్గెనఁట.

పుత్రకుఁడు అను రాజకుమారుఁడు మంత్రదండ మహిమచే నిర్మించెననియు నతని భార్యపేరు పాటలి. కావున దీనికి పాటలిపుత్రమని పేరుఁ బెట్టెననియు కథా సరిత్సాగరము నందును హ్యూయాన్‌ట్సాంగుని యాత్రా చరిత్రమునందు వ్రాయఁబడియున్నది. డియోడొరసు అను గ్రీకు చరిత్రకారుఁడు హెరక్లస్ (**Herakles**) అనఁగా బలరామునిచే నిది ప్రతిష్ఠింపబడియెనని తాను వినినట్లుగా దెల్పియున్నాఁడు. వాయు పురాణమును సూత్తపిటకమును శిశునాగవంశస్థుఁడు ఉదేయుఁడు దీనిని కట్టించినట్లు తెల్పుచున్నవి.

మేజరు విల్ఫోర్డు పాటలీపుత్రమును పద్మావతియనియు మహాబలిపురమనియు పేళ్ళు గలవనియు, ఈ పేళ్ళు గల్గుటకు కారణము, మహాబలియనియు మహాపద్ముఁడనియు దానిని బ్రతిష్ఠించిన రాజు పేళ్ళగుట యనియు వివరించుచున్నాఁడు. అట్టి నందుని పట్టణము కావున బలిపుత్ర యనియు పాలిబోత్ర యనియుఁ బేళ్ళనొంది గ్రీకుల చెవుల కందెననియు నుడువు

చున్నాఁడు. ఇంకొకవ్యుత్పత్తి కలదు. కోసి గంగాసంగమమున రాజమహాలునకు సమీపమున పాలిబోత్రయుండెనఁట ఇప్పటికిని మత్స్యదేశమున పాలి జాతివారు మెండుగ నివసించెదరు. కావున పాలిబోత్రయని పేరువచ్చెననియుఁ జెప్పఁబడుచున్నది. సూర్యవంశపు రాజగు మముండను వానికి 18 వ తరమువాఁడు సుదర్శన రాజనియు, ఆతని కూఁతురు పాటలియనియు, నీమె మూలమున పాటలిపుత్ర నామంబనియు నింకొక వ్యాఖ్యానంబు గాన వచ్చుచున్నది.

మఱియొక చిత్రకథ

దక్షిణదేశమునందు నొక బ్రాహ్మణుఁడు కలడు. వానికి ముగ్గురు కొమాళ్లుండిరి. ఆ బ్రాహ్మణుఁడు చిన్నవారైన తన పుత్రులను ఇంటియొద్దనే యుంచి హిమాలయ మందలి గంగాద్వారమునకు యాత్ర వెడలి యచ్చటనే కాలధర్మము నొందెను. ఎంతకాలమునకును తండ్రి తిరిగిరానందున అతని ముగ్గురుపుత్రులును విద్యాభ్యాసము నిమిత్తమై బయలుదేరి కుమారస్వామి క్షేత్రము నొద్దనున్న చించణీ యను గ్రామ మందు నివసించియున్న భోజకుఁడను విద్వాంసుఁడైన బ్రాహ్మణుని ఆశ్రయించిరి. ఆ బ్రాహ్మణుఁడు వీరి ముగ్గురికిని తగిన విద్యలఁ గఱపి తనకు ముగ్గురు కూఁతులుండ వీరిముగ్గురికిసిచ్చి వివాహముచేసి వారిని తన యింటనే యుంచుకొనెను.

వారు పెద్దకాల మచ్చటనే యుండి యొకప్పుడు కఱవు సంభవింపఁగాఁ దమ భార్యలను అచ్చటనే యుంచి ధనార్జనకై

తాము దేశాంతరమునకు వెడలిపోయిరి. వారు వెడలు నప్పుడు నడిపివాని భార్య గర్భవతియై యుండెను. కాని యీ సమాచారమా బ్రాహ్మణునకుఁ దెలియదు. ఆమెకు నొక కుమారుఁడు కలిగెను. వానికిఁ బుత్రకుఁడని పేరుపెట్టిరి. కాని, బ్రాహ్మణులు తిరిగి రానందునను, కఱ వధికమైనందునను పుత్రకునిఁ దీసికొని చూతని తల్లి మగధదేశమునకుఁ బోవలసినదాయెను. అచ్చట ఈమె దనకుమారునితోఁ గూడ యజ్ఞదత్తుఁడను బ్రాహ్మణు నాశ్రయించి యుండెను.

పుత్రకుఁడు పెద్దవాఁడై విద్యాబుద్ధులు నేర్చుకొని మిక్కిలి ధనమును ఆర్జించెను. తన తండ్రియు పినతండ్రి పెద తండ్రులును దేశాంతరము వెళ్ళి రాలేదన్న సమాచారము విని వారిని కనుఁగొను నిమిత్తమై యొక యన్నసత్రములు స్థాపించి తాను సత్రాధికారిగనుండి వచ్చిపోవువారి గోత్రనామములఁ దెలిసికొను చుండెను. ఆ ముగ్గురు బ్రాహ్మణులును ఒక్కదిన మా సత్రమునకు రాఁ దటస్థించెను. వారా పుత్రకుని సమాచారమంతయుఁ దెలిసికొని వాఁడు వ్యభిచార జాతుఁడుగాఁ దలంచి వానిని జంపుటకుఁ గొందఱు పురుషులను నియమించిరి. పుత్రకుఁడు వారికి లంచమిచ్చి వారిచేతినుండి తప్పించుకొని వింధ్యప్రాంతమునకుఁ బోయెను. ఈతఁ డచ్చట చంచరించు చుండ నిద్దరన్నదమ్ములు రాక్షస కుమారులు తమ పిత్రార్జిత మైన మూఁడు వస్తువులను గూర్చి తగవులాడు చుండఁ జూచెను. వారు తగవులాడుచున్న వస్తువు లేవన ౧ భోజన

పాత్రము, 2 దండము, 3 పాదరక్షలు. ఈ మూఁటియందును మూఁడు విశేషములు కలవు. భోజన పాత్రము కోరిన భోజన పదార్థములనిచ్చును. దండమువలన కోరిన ద్రవ్యము లభించును. పాదరక్షలను తొడిగినయెడల ఆకాశపథమున స్వేచ్ఛా విహార మును చేయవచ్చును! ఇట్టి వస్తువులకై పోరాడువారు పుత్ర కుని మధ్యవర్తిగ నేర్పఱుచుకొనిరి. రాక్షస పుత్రులు పరుగెత్త వలసినదనియు, ఎవ్వఁడు నిర్ణీతస్థలముచేరునో వానికి ఈమూఁడు ద్రవ్యము లీయఁబడు ననియుఁ బుత్రకుఁడు నిర్ణయించెను. వారందుకు నంగీకరించి పరువెత్తసాగిరి. అటువారిని పరువెత్త నిచ్చి యిటు పుత్రకుఁడా పాదరక్షలను ధరించి మిగిలిన రెండు ద్రవ్యములను తీసికొని యెగిరి యాకాశమార్గమున ఆకార్షికా పురికిఁ బోయెను. అచ్చటిరాజు మహేంద్రవర్మ. ఆతనికి పాటలియను కూఁతురుకలదు. ఆమె యుక్తవయస్కురాలై వివాహమునకు సిద్ధముగనున్న దని విని పుత్రకుఁ డొకనాఁడు ఆకాశమార్గమున నామె మందిరముఁజేరెను. ఆమెయు నతని యమానుషశక్తి కచ్చెరువంది అతనిని వరించెను. కాని యీ సమాచారము రాజునకుఁ దెలిసిన నాతఁడు పుత్రకుని వధించు నని యెంచి వారిరువురును, అచ్చట నుండి ఆకాశ మార్గమున వెడలిపోయి యొక పట్టణమును నిర్మించి, తమ యిద్దఱిపేళ్లను కలిపి దానికి 'పాటలీపుత్ర' మని పేరు పెట్టిరఁట. ఈ కథ బృహత్కథయను గ్రంథమునందున్నది.

ఇట్లీ గ్రామముయొక్క యుత్పత్తిని గుఱించి పెక్కు గాథలు గలవు. ఇఁకవీనిని విడిచి చరిత్రభాగమునకు వత్తము.

పాటలి దుర్గము

క్రీ.పూ. 490 వ ప్రాంతమున అజాత శత్రుఁడను వాఁడు మగధ రాజయ్యెను. ఇంతకుఁ బూర్వము పాటలి యనునది గంగకు దక్షిణతీరమున నుండిన చిన్నపల్లె. ఆ నదికి నుత్తరమున లిచ్ఛవి వంశజులగు రాజుల ప్రబలమైన రాజ్యముండెను. ఆ రాజులు తన రాజ్యమునకు నేమియు నాపద కలుగఁజేయ కుండఁగ వారిని అడఁచియుంప వలయునని అజాత శత్రుఁడు పాటలి గ్రామమున నొకదుర్గమును కట్టించెను. రాజభృత్యులు దుర్గమును నిర్మించుచుండు కాలమున గౌతమబుద్ధుఁడు అచటికి వచ్చెను. అతఁడా దుర్గమును చూచి యందునుగుఱించి యిట్లు భవిష్యత్తు చెప్పెనఁట. "మిక్కిలి విఖ్యాతి చెందు స్థలముల లోను, నలుదిశలనుండి వర్తకమును ఆకర్షించినందున పేరొందు పట్టణములలోను ఇది ముఖ్యమైనది కాఁగలదు, కాని యీ పట్టణమునకు అగ్ని, జలము, అంతఃకలహము అను మూఁడు విపత్తులు సంభవించును."

ఉదయనుఁడు అజాత శత్రుని మనుమఁడు. ఇతఁడు క్రీ. పూ. 450 వ ప్రాంతమున రాజయ్యెను. ఇతఁడు పాటలి దుర్గము నొద్దనే క్రీ. పూ. 434 వ ప్రాంతమున పాటలీపుత్ర పట్టణమును గట్టించెను. ఇదియే భగవాన్ బుద్ధదేవుని భవిష్యత్తు ననుసరించి వేయి సంవత్సరముల వఱకును హిందూదేశము యొక్క కంఠమణివలె భ్రాజిల్లెను.

ఇంతకుఁ బూర్వము మగధరాజ్యమునకు రాజగృహము రాజధానిగ నుండెను. ఉదయనుఁడు రాజధానిని పాటలిపుత్రము

నకు మార్చెను. ఇట్లు పర్వత ప్రాంతములో నున్న రాజగృహమునుండి ఏటియొడ్డున నున్న పాటలిపుత్రమునకు రాజధానిని మార్చుటకుఁ గారణము లేకపోలేదు. మగధరాజ్యము దినదినాభివృద్ధి నొందుచుండెను. రాజ్యముయొక్క యన్ని భాగములను స్వాధీనమం దుంచుకొనుటకును, హిందూదేశమందలి వర్తకము నంతయును ఆకర్షించుటకును గంగా, శోణ, గోగ్రా మొదలయిన నదుల సంగమమునకు సమీపమునందున్న పాటలిపుత్రము మిక్కిలి తగినదియని నిశ్చయింపఁబడెను. ఉదయనుఁడు శిశునాగ వంశపురాజు. క్రీ. పూ. 371 వ ప్రాంతమున ఈ వంశమంతరించి మగధము నందుల స్వాధీనమయ్యెను. వారిని నోడించి మన చరిత్రనాయకుఁడగు చంద్రగుప్తుఁడు క్రీ. పూ. 321 వ ప్రాంతమున మగధాధీశ్వరుం డయ్యెనని యిదివఱకే వ్రాసియున్నారము.

చంద్రగుప్తునికాలపు పాటలీపుత్రము

క్రీ. పూ. 303 వ సంవత్సరము నందుఁ జంద్రగుప్తుఁడు సెల్యూకస్ అను గ్రీకురాజు నోడించి యతనితో సంధిచేసి కొనెనని యిదివఱకే వ్రాసియున్నాము. ఆ గ్రీకురాజు మెగస్తనీస్ అనువానిని పాటలి పుత్రమందు జంద్రగుప్తునియొద్ద రాయబారిగ నుంచెను. (క్రీ. పూ. 302) ఇతఁడు కొన్ని సంవత్సరములవఱకు ఈ పట్టణమునందుఁ గాపురముండి యీ గ్రామమును గుఱించియు, ఈ దేశమును గుఱించియు విశేషము లనేకములు వ్రాసియుంచినాఁడు. ఆ కాలమునాఁటి చరిత్రాంశములు

తెలిసికొనుటకు ఈ రాయబారియొక్క వ్రాతలే ముఖ్యాధారములు. ఆ వ్రాతల ననుసరించియే యీ క్రింది వర్ణనలు వ్రాయఁబడు చున్నవి.

పురవర్ణన

మగధదేశ రాజధానియగు పాటలిపురము గంగాశోణానదుల సంగమముఁవలనఁ గలిగిన యంతర్వేదిలో శోణకు నుత్తరమునను, గంగకు దక్షిణమునను ఉండెను. ఇప్పురి రమారమి తొమ్మిది పదిమైళ్ల సిడివియు, రెండుమైళ్ల వెడల్పును గలిగి చతుర్భుజాకారముగ నిర్మింపఁబడియె. అనఁగా నిది యిరువది చదరపు మైళ్లు వైశాల్యముగల నగరము. అత్యంత ఘనమైన కాష్ఠ ప్రాకారముచే నావరింపఁబడి యఱువదినాల్గు ద్వారములును పనూటడెబ్బది బురుజులును గలిగి, శోణాది నీళ్ళతో నింపఁబడిన మిగులవెడల్పును లోతునుగల యగడ్తచే రక్షింపఁబడియుండెను. పట్టణము చుట్టునున్న యీ కందక మూఁడు వందల యడుగుల వెడల్పును, ముప్పదిమూరల లోతును ఉండెనఁట. ఈ గ్రామముచుట్టు డెబ్బదియైదు గజములకు నొక బురుజును, ఆరువందల యఱువది గజములకు నొక కోటగుమ్మమును ఉండెను. ఇరువది చదరపు మైళ్ల వైశాల్యమును ఇరువదినాల్గు మైళ్లు చుట్టుకొలతయుఁగల యీ నగరరాజము కలకత్తాకు సమముగ నున్నట్లు లెక్కింపనచ్చును.

రాజమందిరము.

శోణానది యొడ్డున నానావిధ వృక్షజాతులచే శోభితంబగు నుద్యానవనము కలదు. అందు రాజమందిరముండెను.

రాజ ప్రాసాదము ప్రాకుతోఁ గట్టఁబడి, పారసీక రాజభవనములగు సూ్సా, ఎక్బటానాలకంటె మిక్కిలి వైభవముతో విలసిల్లుచుండె. దాని స్తంభములు స్వర్ణఖచితములై బంగారు గాలిబెక్కెముల తోను, వెండి పిట్టలతోను అలంకరింపఁబడియుండె. ఈ భవనము అనేక కట్టడములుగ విభజింపఁబడి, అన్నియు నొక విశాలమును మనోహరమునైన యారామము నందు నిర్మింపఁబడియుండె. ఇందు తళుకుతళుకుమని మెఱయుచున్న మత్స్య పల్వలమును, పెక్కుతెగల శృంగార వృక్షములును పొదరిండ్లును పిక్కటిల్లె. ఇందలి కట్టడములలో కొన్ని రాజ కార్యశాలలు, కొన్ని పరివారనివాసములు, కొన్ని రాజస్త్రీల యంతఃపురములు, ఇంతేకాక సప్తభూమికా ప్రాసాదమును, సహస్ర స్తంభ మండపమును, ద్యూతశాలయు, ఉష్ణస్నానవాటికయు నుండెనఁట. ద్యూతశాలలో గెలుపులయందొక యంశము రాజస్వమ్ముగా జేరెనని ఆపస్తంబ వచనము. స్నానశాలయందు మొదట ప్రవేశాగారమును, పిదప ఉష్ణగృహమును, అటుపై స్నాన పల్వలమును పొసఁగి, మధ్యమున అగ్నికుండమును చుట్టును ఆసనములు నుండును. సాధారణ స్నానమునకై వాపీ తటాకము లుపయోగింపఁ బడుచుండును. వీనికి రాతిపడికట్లును ఆ పడికట్లపై పుష్పాది శిల్పాలంకారములును అమరియుండును

రాజ సభామంటపము అత్యంతాలంకారాడంబరములనొప్పియుండె. ఆరడుగుల వెడల్పుగల బంగారు పళ్లెములును గిన్నెలును, బలుసొగసు వలువల్లతోడను, వింతవన్నెన మెత్తల

తోను నొప్పి ముద్దులొలుక నలంకరించిన రాజపీఠములును, ఫలకములును, రత్నఖచితములైన రాగిపాత్రములును, అతి సుందరములైన చిత్రవస్త్ర సంచయములును గాన వచ్చు చుండెను. ఇచ్చట రాజు సంపూర్ణ శోభనముతో నైమిత్తిక వైభవ కార్యముల నాచరించును. అట్టి యుత్సవకాలముల నతఁడు ముత్యపు కుచ్చులతో నలంకరించిన బంగారుపాలకి నెక్కి స్వర్ణ మయములైన పట్టు పచ్చడములును, సొగసుబట్ట లును ధరించి సవారిపోవుచుండు. చిన్న సవారుల కాలముల, రాజు అశ్వారూఢుఁడై యును పెద్దసవారులప్పుడు గజారూఢుఁ డై యును వెడలు సమయముల ఇయ్యవి బంగారు సజ్జలతో నొప్పుచుండును. మఱియు నిట్టిసమయములందు ఎద్దు, పొట్టేళ్లు ఏనుఁగులు, గండకములు మొదలగు మృగముల పందెములను మల్లుల పోట్లాటలను రాజు మిక్కిలి యుత్సుకముతో విలో కించును. ఇందలి ఎడ్లపందెములు మాత్ర మిప్పుడు జరుగు టరుదు. తక్కినవి హిందూరాజధానులలో నేఁటికిని వాడుకలో నున్నవి. ఇంతేకాక రథములకు నడుమ గుఱ్ఱమును దానికి ఇరు వైపుల నెడ్లను పూన్చి పరుగునర దూరపు పందెములు పరి గింతురఁట.

నగరముయొక్క నిర్మాణము విస్పష్టముగఁ దెలియఁ జాలము. కాని ఉన్నతములైన గోడలు, అలంగములు, ముట్టు గోడలు, కాపు గోపురములు, బురుజులు, మహాద్వారములు, అగడ్తలును నిస్సంశయముగనుండె. రాజు సాయంతన విహా రము సేయునపు డతనిని పౌరులు చూచుటకై మందిరము

లుచితరీతిని కిటికీలు గలవై యుండెను.* నలువైపుల నిండ్లతో నమరిన చతుశ్శాలల (Square) లును పెక్కులుండెను.

సామాన్యముగ రాతికట్టడములే లేవు, పునాదులు, కంబములు, పడికట్లును దప్ప తక్కిన వెల్ల ప్రాఁకు కట్టడములు నిటిక కట్టడములునుగ నుండెను. వెలుపలను లోపలను గచ్చు పూసి పువ్వులు, బొమ్మలు, దండపని, తీఁగపని, సన్నని బొందుపని, రాక్షసపుపని, మున్నగునవి యొప్పునట్లు దేదీప్యముగ రంగులుదీర్చి యుండెను.

గ్రామరక్షక సంఘము.

ఇట్టి రాజధానిని రాజ మందిరంబును గాపాడుటకు ముప్పది యుద్యోగస్థుల సంఘ మొకటి యేర్పఱుపఁ బడియెను. ఇది యిప్పటి మునిసిపాలిటి యనవచ్చును. ఇందుండు ముప్పది మందియు నాఱు పంచాయితులుగా విభజింపఁబడిరి. ఒక్కొక పంచాయితిలో నైదుగు రుద్యోగస్థులుండిరి. అందు మొదటి పంచాయితీవారు పట్టణములోని కలాకౌశల్యాభివృద్ధికి నుత్తరవాదులయి యుండిరి. అనఁగా నిప్పుడు మన దేశాభిమానులు కొందఱు చేయుచున్న స్వదేశోద్యమము వంటి యుద్యమ మీ

* కవికులగురు కాళిదాసకృతమైన రఘువంశముయొక్క యాఱవసర్గములో ౨౪వ శ్లోకమునందు పాటలిపురమును గుఱించి "ప్రాసాదవాతాయన సంశ్రితానాం నేత్రోత్సవం పుష్పపురాంగనానాం" అనఁగా "మేడలలోని కిటికీలను ఆశ్రయించియున్నట్టి పుష్పపురమందలి స్త్రీలకు నేత్రోత్సవము" అని వర్ణింపఁబడుట చూడఁగా ఉత్సవాదులు చూచుటకై యిండ్లకు గవాక్షములు నుంచుచుండిరనుట స్పష్టము.

యుద్యోగస్థులప్పుడు చేయుచుండిరి. రెండవ పంచాయితీ దార్లు పాటలీపుత్రమునకు వచ్చెడి యన్యదేశీయులఁ గాపాడుచుండిరి. అన్యదేశీయులు రాజ్యము గుట్టు కనుఁగొనవచ్చిన మోస కాండ్రో లేక నిజముగా నేవో యన్యకార్యముమీఁద వచ్చిన వారలో కనుఁగొనుట, అన్యకార్యముమీఁద వచ్చిన వారిని గౌరవించుట, వారికి నేమియు నిబ్బంది లేకుండఁ గాపాడుట, వారికిఁ గావలయు భోజనపదార్థము లిప్పించుట, జబ్బుగానున్న వారికి ఔషధము నొసంగుట, మృతిఁజెందిన వారికి నంత్య సంస్కారములు చేయించి వారిసొత్తేమైన నున్నయెడల వారి వారసులకు బంపుట, వీరి పనులయి యుండెను. ఇందువలన నా కాలమందు ననేక పరదేశీయులు మనదేశమునకు వచ్చుచుండి రనియు చంద్రగుప్తునకు ననేక పరరాజులు స్నేహితులుగానుండి రనియుఁ గానవచ్చుచున్నది. మూఁడవ పంచాయితీ దారులు గ్రామములోని జననమరణపులెక్కను జూచుచుండిరి. నాగరికతఁ జెందినయిగ్లీషు దొరతనమువారుకూడా మొన్నమొన్నటివఱకు నీదేశంబున జననమరణపులెక్కఁ బ్రారంభింపలేదు. ప్రారంభించి కొద్దికాలమే యాయెను. ఇట్టి స్థితిలో రెండువేవేండ్ల క్రిందఁ జంద్రగుప్తుఁడు ప్రజాక్షేమము తెలియుకొఆకును, పన్నుకట్టు టకు వీలుగనుండుకొఅకును ఈ లెక్కల వ్రాయించుట చూడ నతని బుద్ధివైభవమునకు నెవ్వరాశ్చర్య పడకుందురు ? నాల్గవ పంచాయితీదార్లు వాణిజ్యాధికారము గలవారయి యుండిరి. తూనికెలు, కొల్తలు తప్పవి కాకుండను, అమ్మెడి వస్తువులలో మోసము లేకుండను జూచుట వీరిపని. అయిదవ పంచాయితీ

దార్లు చేతిపనులమీఁది యధికారులు. వారు వర్తకు లమ్మిన సరకులమీఁదఁ బన్నులు పోగుచేయువారు. ఈ విడివిడి పనులు గాక వీరందఱును గ్రామములలోని యితర వ్యవహారములన్నిటిని జూచుచు, గుళ్లు, రేవులు, అంగళ్లు, మొదలైనవానిని గాపాడు చుండిరి. ఇది పాటలీపుత్ర రక్షణ విధము. ఇటులే యితర పురంబులన్నియు రక్షింపఁబడుచుండెను.

ఒక మహోత్సవము

పాటలిపుత్రమున వీథులయందు డంబుగ జరిపింపఁబడిన యొక దివ్య మహోత్సవమును మెగాస్తనీసు దర్శించి తెలిపిన దానిని స్ట్రాబో దిగువరీతిని వర్ణించినాఁడు.

"వారి పండువుల యూరేగింపులయందు స్వర్ణ రజతాలంకృతములగు అనేక యేనుఁగులు ఒయ్యారముగ నడచి వచ్చును. నాలుగు గుఱ్ఱములచేతను, ఎద్దులజతలచేతను లాఁగఁబడిన లెక్కలేని బండ్లును వెంబడించును. వెనువెంటఁ రిబచర సమూహాములు నిండుదుస్తు తొడిగి బంగారు పాత్రలను, పెద్ద పళ్ళెరములను వెడల్పు గిన్నెలను, మేజాయిలు, విలువగల కుర్చీలు, పచ్చలు, మరకతములు, గరుడపచ్చలు, కెంపులు మున్నగు రత్నములు చెక్కిన రాగిగిన్నెలు, మొదలగునవి మోసికొని వచ్చుచుందురు. బంగారు వగిషీపనిచేసిన ఉత్తమ వస్త్రములు మోచువారు కొందఱుందురు. వారి వెనుక అడవి దున్నలు, చిరుతలు, పెంపుడు సింగములు, పలురంగుల రెక్కలుగల నానాజాతుల పక్షులును, పిట్టలును గొనిరాఁబడు చుండెను."

. . . .

ఏడవ ప్రకరణము

సైన్య వ్యవస్థ.

క్రీ. పూ. నాలుగవ శతాబ్దమున నుండిన ఈ ప్రథమ చక్రవర్తి కాలముననే మన ఇరువదియవ శతాబ్దమునందలి రాజ్యాంగ నిర్మాణమును బోలిన విశేష రాజ్యాంగ నిర్మాణముండెను. ఒక్కొక్కయంగమును వర్ణించుట కొక్కొక్క ప్రకరణమయినను జాలదు. ప్రతిభాశాలియగు చంద్రగుప్త చక్రవర్తియు మంత్రాలోచనా ధురీణుండగు చాణక్యుడును పన్నిన రాజ్యాంగముల స్వరూపమును మాచే నయినంత సంక్షిప్తముగ నిటఁబొందుపఱచెదము.

విస్తీర్ణమున ప్రస్తుతపు భరత ఖండమునకంటె నెక్కుడగు భూభాగమును చంద్రగుప్తునకు సంపాదించిపెట్టిన సైన్యపు సంఖ్య యపరిమితముగా నుండెనని గ్రీకు చరిత్రకారులు వ్రాసియున్నారు. ఆ రాజపుంగవునికడ నాలుగులక్షల పదాతులును, 30,000 అశ్వికులును 9000 ఏనుగులును, 8000 యరదంబులును, ఉండెనని తెలియుచున్నది.

సారథిగాక ప్రతిరథముమీఁదను ఇద్దఱు రథికులుందురు, అందుచే 8000 ~~రథములనఁగా~~ 24,000 రథికులని యర్థము,

ప్రతి ఏనుఁగుపై మావటివాఁడు గాక ముగ్గురు యుద్ధభటు లెక్కుచుండిరి. కాన 9,000 గజములనఁగా 36,000 భటులని యర్థము. ఇట్లు వీరినందఱను లెక్కవేయఁగా రమారమి ఏడు లక్షల బలమగుచున్నది.

ఇంతగొప్ప స్కంధావారమున వ్యవస్థకల్పించి, ఒక్కొక్క రికి వారివారి పనుల నిర్ణయించి యేవేళ నే సందర్భము వాటిల్లిన నద్దాని కనువగు తెఱంగున బలంబుల నడిపి వ్యూహాచమత్కా రంబుల గనుపఱచి చంద్రగుప్తుఁడు విజయంబుఁగొనియె.

సైన్యవ్యవస్థకయి యీచక్రవర్తి ముప్పది యధికారుల సంఘమేర్పఱచి దానిని గూడ నాఱు పంచాయతులుగ విభ జించె. మొదటి పంచాయతిలోని యధికారులు సముద్రసైన్య మునకును, రెండవ పంచాయతివారు రస్తుసామగ్రికిని ప్రయాణ ప్రయత్నములకును, సైన్యమునకుఁ గావలసిన తృణకాష్ఠాదు లను సంపాదించుటకును, మూఁడవ పంచాయతివారు కాల్బల మునకును, నాల్గవవారు రథసైన్యంబులకును, ఐదవవారు అశ్వసైన్యములకును, ఆఱవవారు ఏనుంగులకును నధికారులై యుండిరి. 1

సముద్ర సైన్యము

ఈ చక్రవర్తివద్ద సముద్రసైన్యముండినటుల మెగస్తనీసు వ్రాతల వలనఁ దెలియుచున్నది. కాని ఆ సైన్యమును గురించిన విశేషము తెలియుంగుటకు సాధనములు గానవచ్చుట లేదు.

---

1. మెగస్తనీసు.

కౌటిల్యుని అర్థశాస్త్రమును బట్టి చూడఁగా నా కాలమున 'నావాధ్యక్షుఁడ' ను అధికారి యుండినట్లును సముద్రముల మీఁదను సరస్సులమీఁదను దిరుగునట్టి యోడలను గుఱించిన యధికారమంతయు నాతని చేత నుండినట్లును గనుపించుచున్నది. రేవులయందు సుంకములు వసూలుచేయు పనిని గూడ నితఁడే తీర్చుచుండెను. నావికాచోరులను దండించుటయు గాలివానలచే నలంగిన యోడలకు శరణమిచ్చుటయు నీతని ధర్మములలోనివియై యుండెను. గొప్పగొప్ప నదులను దాఁటుటకొరకై ప్రభుత్వము వా రేర్పఱిచిన నావలకును పడవలకును వానిపై నుండు నౌకరులకును నితఁడే యధికారి.

రస్తుసామగ్రి

రెండవ పంచాయతివారు రస్తుసామగ్రి మున్నగు వానిని సమకూర్చువారని వ్రాసితిమి. యుద్ధమునకు సైన్యము బయలుదేఱు తఱి భోజనము సిద్ధపఱచుటకుఁగావలసిన ధాన్యాదులును, [illegible]లును, యుద్ధమున గాయపడు భటుల చికిత్సకొఱకగు మందులును ఉపకరణములును, గుఱ్ఱములకు నేనుఁగులకు వలయు ఘాసాదులును, యుద్ధము సలుపునెడ నవసరమగు నాయుధాదులును వెంటనంపుటకే యీపంచాయితి యేర్పడినది. ఆకాలమునందు వైద్యశాస్త్రము భరతవర్షమున మిక్కిలి పెంపు గాంచి యుండెను. కాశీనగరంబునను తక్షశిలా నగరంబునను నెలకొల్పఁబడి యుండిన సర్వకళాభవనములు ప్రసిద్ధిఁ జెంది యుండె. అచ్చట విద్యగఱచిన వైద్యవిద్యా విశారదులు

శస్త్రములును, యంత్రములును, తైలములును (Oils) కాళ్లు చేతులు విరిగినవారికి కట్టులుగట్టుటకు వస్త్రములును మున్నగు వైద్యోపకరణంబులఁ గొని బలంబుల వెంబడి నేగుచుండిరి. గాయములువడిన యుద్ధభటులకు నుపచారములు సలిపి పథ్యపానాదుల నమర్చుటకయి తత్తదర్హ వస్తుసంచయంబులఁ గొనుచు ధాత్రికలు (దాదులు) ను వీరితోడం గూడనుందురు. ఇట్టి ధాత్రికలకు మార్గదర్శినియని యీ కాలమున లోకమునఖ్యాతిఁ దంతట పేరుగాంచిన ఫ్లారెన్సు నైటింగేలుసతి గత శతాబ్దము నందలిది. ఇట్టి ఫ్లారెన్సు నైటింగేలులు చంద్రగుప్త చక్రవర్తి కాలమున నెందరో యుండిరి. అట్టివారిని నియమించుటయు రక్షసాను గ్గి పంచాయతివారి కర్తవ్యంబై.[1]

కాల్బలము

చంద్రగుప్తుని కాలమునందలి పదాతులు ముఖ్యముగ ధనుర్ధరులు. ప్రతిభటుఁడును దన పొడవునకు సమమగు పొడవు గల వింటిని మోయుచుండును. అవసరమగుచు దానిని భూమిపై మోపి గుణము సంధించి ఆకర్ణాంతముగఁ దిగిచి మూఁడు గజములఁ బాణంబులఁ బ్రయోగించు చుండును. ఈ బాణము లకు డాళ్లుగాని కవచములుగాని మఱియెంత బలిష్ఠమయిన ఇతర రక్షలుగాని అడ్డుపడ లేకుండెను. ఆ కాల్బలంబులు తమ శరీరముల సంరక్షించుకొనుటకు పదునుచేయుని తోళ్ళతోఁ జేయఁబడిన నిలువున తమ్ముక్రను బూర్ణముగఁ గప్పఁ గలుగు కేడెముల నెడమచేత ధరించుచుండిరి.

---

1. చాణక్యుని అర్థశాస్త్రము. 10 వ భాగము.

ఈ ధనుర్ధరులుగాక పదాతిసైన్యంబున ఖడ్గధారులును గొంద ఱుందురు. వారికత్తులు పొడవును వెడల్పునునై యిరుకు సందుల నగు యుద్ధముల మిక్కిలిగ నుపయోగింపఁబడు చుండెను. అట్టి సందర్భముల భటులు లొక్కొకవేళ రెండు చేతులతోడను ఖడ్గముం జళిపించి వేయుచుందురు. 1

చంద్రగుప్త చక్రవర్తి కడనుండు బలములు మూల బలంబులు, కృతబలంబులు, శ్రేణిబలంబులు, అని మూఁడు తెఱంగులుగ నుండెను. రాజుచే శాశ్వతముగ నిలుపుకొనఁబడి యుండిన సైన్యములు మూలబలంబులు. యుద్ధప్రసంగము వచ్చినప్పుడు సిద్ధపఱిచి వేతనమొసంగి నిలుపుకొనఁబడినవి కృతబలంబులు. శ్రేణిబలంబులు అను పదమునకుఁ గొంచెము విపులమగు వ్యాఖ్యయవసరము. దేశమునం దచ్చటచ్చట క్షత్రియవీరుల 'శ్రేణులు' అనఁగా సంఘములు నెలకొని యుండెను. వీరు వర్ణమునందు క్షత్రియులేయయ్యును రాజ్యాధికారము లేమింజేసి యుద్ధవిద్య నభ్యసించియు నితరవృత్తులచే జీవనము గడుపుకొనుచుండిరి. వీరి సాహాయ్యమును యుద్ధముల యందుఁ జక్రవర్తులు పొందుచుండిరి. వీరే శ్రేణులు. ఆ కాలమున నిట్టి శ్రేణులలోఁ బ్రసిద్ధమయినవి కాంభోజమునను, సౌరాష్ట్రముననను, లిచ్ఛవియందును, వ్రిజకమునందును, మల్లకమునందును, మద్రక కుకురు కురు పాంచాలములయందును.2 నుండెను. అందు కాంభోజ సౌరాష్ట్రముల వారు కృషీవలులు

1. అర్రియను అను గ్రీకులేఖకుని వ్రాతల ననుసరించి
2. అర్థశాస్త్రము 11 వ భాగము 1 వ ప్రకరణము.

గను వర్తకులుగను గాలము గడుపుచుండిరి. తక్కుంగలవారు రాజు లనఁబడుచుండిరి. ప్రతిశ్రేణియు నొక్కనాయకునకు లోఁబడి ప్రవర్తించుచుండెను.

ఈ మూఁడు తెఱంగుల బలములు గాక ఆరణ్యకులును పార్వతేయులును సందర్భ వశంబున విశేషసైన్యాంగముగ నుపయోగించుకొనఁ బడుచుండిరి. జయింపఁబడినవారిని దోఁచు కొనుటయే వీరిని వేతనము.

ఇట్లేర్పడిన కాల్బలంబులకు నాయకుండగువాఁడే సర్వ సైన్యంబులకును నధ్యక్షుండు.

అశ్వీక సైన్యము

అశ్వీక సైన్యమునఁ బ్రతి భటుఁడును రెండు ఈటెలును డాలును యుద్ధమునకు గొంపోవుచుండెను. ఈతని డాలు కాల్బలంబు డాలునకంటె కురుచగ నుండును. గుఱ్ఱముపై జీనులు వేయుట యాచారముగాదు. గుఱ్ఱములకుఁ గళ్లెము దగిలించుటయు లేదు. కాని గుండ్రముగ కుట్టబడిన ఎద్దుతోలు మూఁతతో వాని ముఖములు కప్పఁబడుచుండెను. ఆ మూఁతల లోభాగమున వాడియంతగలేని ఇనుము, ఇత్తడి లేక దంతపు ముండ్లు ముడ్పఁబడి యుండుటచే నదియే కళ్లెమువలె నుపచ రించుచుండెడిది. 1

యుద్ధమునకయి గుఱ్ఱములకు వల్గనలంఘనేత్యాద్యనేక గతి విశేషంబులు నేర్పఁబడుచుండె. యుద్ధభూములయందును

---

1. అర్రియ నను గ్రీకు లేఖకుఁడు.

అరణ్యములయందును మధ్యభాగమున నిల్చి మిగత సైన్యంబు చేరుటకు గురియై యుండుటయు, సైన్యోపయోగమున కగు జంతువులు ప్రవాహములు దాటవలసి వచ్చినప్పుడును ఝంఝూమారుతమున ప్రయాణము సలుపవలసి వచ్చినప్పుడును చెదరిపోకుండుటకయి వానికి కట్టబడిన పగ్గములఁ బట్టుకొనుటయు, తమ రస్తుసామగ్రిని కాపాడుకొనుటయు, శత్రువుల రస్తుసామగ్రిని గొల్లకొట్టుటయు, క్రొత్తగ తమ సాహాయ్యార్థము వచ్చు దండులను సంరక్షించుకొనుటయు, శత్రువులకు సాయమునచ్చు దండుల చెదరగొట్టుటయు, తమ సైన్యమును సుశిక్షితముగఁ బెట్టుకొనుటయు, సమయమగుడు దానిని పొడువుగ గానవచ్చునట్లు దీర్చుటయు, సైన్యపార్శ్వాంగముల సంరక్షించుకొనుటయు, యుద్ధము ప్రారంభ మగునప్పుడు మొదట స్వారికి వెడలుటయు, శత్రుబలంబుల చెల్లాచెదరుచేసి నుఱుమాడుటయు, తమ బలంబుల నాకస్మికముగ వైగు లెదిర్చినచో నడ్డుపడుయుటయు, వారిం బట్టుటయు, వారు లోఁబడి శాంతివై వెడలుచో వారిని వదలుటయు, తమ సైన్యంపు మార్గమును మరల్చుటయు, రాజులను ధనంబును మోసికొనిపోవుటయు, శత్రువుల వెన్నుదన్ని తాఁకుటయు, పారిపోవు రిపులఁ దరుముటయు, జయించిన స్థానంబుల పోగుటయు నాశ్వికసైన్యంబుల కర్తవ్యంబులయి యుండెను.

ఈ యాశ్విక సైన్యంబులకు నుత్తమాశ్వంబులు కాంభోజ సింధ్వారట్టవనాయు బాహ్లిక సౌవీర పాపేయతైతల

దేశంబులు[1] నుండి కొనిరాఁబడు చుండెను. ఇందులో కాంభోజ సింధ్వారట్టవ నాయువుల గుఱ్ఱములు శ్రేష్ఠములుగ నెన్నఁబడు చుండెను.

గుఱ్ఱములమీఁది యధికారికి అశ్వాధ్యక్షుఁడని పేరు. తీక్ష్ణ, భద్ర, మంజాది గుణముల ననుసరించియు వాని జన్మస్థల ముల ననుసరించియు గుఱ్ఱముల తరగతుల నేర్పఱచి లెక్కలు వ్రాయించుటయు, వానికి యుద్ధమునందును ఇతర సమయము లందును బనికివచ్చు నానాగతులను[2] నేర్పుటయు విశాల మయిన అశ్వశాలలను నిర్మించుటయు, అశ్వచికిత్సకుల నేర్ప ఱచి వారిచేఁ బనులు గొనుటయు మఱి యితర విధముల నశ్వముల పోషించి కాపాడుటయు నీయధ్యక్షునికిఁ గర్తవ్యము లయియుండెను. అశ్వముల కుపచారములు చేయుట కీ క్రింది క్షుద్రసేవకులు నియమింపఁబడి యుండిరి.

1. సూత్రగ్రాహకుఁడు –నఘరుపని చేయువాఁడు
2. అశ్వబంధకుఁడు – గుఱ్ఱములను గట్టివేయువాఁడు
3. యావశికుఁడు – తృణమును కొని తెచ్చువాఁడు
4. విధాపాచకుఁడు – గుఱ్ఱములకుఁ బెట్టు నిమిత్తమయి గుగ్గిళ్ళు మొదలగు వానిని వండువాఁడు

---

1. కాంభోజమనఁగా ఆఫ్గనిస్థానము, సింధువుమన మెఱింగినదియే. అరట్ట పంజాబునందలి అరాష్ట్రకులదేశము వనాయు వనఁగా అరబ్బీదేశము. బాహ్లీక మనగా మధ్యఆసియా యందలి బాల్ఖ్ దేశము. సౌవీరమనఁగా గుజరాతుదేశమందలి ఈడరురాష్ట్రము. పాపేయ తైతలదేశంబు లెవ్వియో కనుంగొనవలసి యున్నది.

2. యుద్ధసమయమునందలి గతులకు " ఔపవాహ్యక " గతులనియు శాంత సమములందుచేయు స్వారిసంబంధమగు గతులకు "సన్నాహ్య" గతులనియుపేళ్ల

5. స్థానపాలకుఁడు - అశ్వశాలలను సంరక్షించువాఁడు
6. కేశకారుఁడు-వెండ్రుకలు కత్తిరించి గుఱ్ఱములకు నునుపు పెట్టువాఁడు
7. జాంగలికుఁడు - ఆహారాదులఁ బరీక్షించువాఁడు

గ జ ము లు

మనదేశమున ప్రాచీన కాలమునందు సైన్యములోని యంగములలో గంజాంగ మెక్కువ యుపయోగకారియై కన్పట్టుచున్నది. చంద్రగుప్తుని కాలమునఁ బ్రతి గజముపై మావటివాఁడు గాక ముగ్గురు యుద్ధభటులెక్కుచుండిరి. వారు ముప్వురును ధనుర్ధరులు. ఇద్దఱు ప్రక్కలనుండియు మూఁడవవాఁడు వెనుకనుండియు బాణముల వేయుచుండిరి.1 ఆ కాలమున గజసైన్యము యుద్ధసమయములఁ జేయుచుండిన పనులెవ్వియనిన :-

సర్వసేనాముఖంబున నడచుట, సైన్యము నడచుటకు మార్గములను శిబిరస్థానములను నీరు దెచ్చుటకు త్రోవలను సిద్ధపఱచుట, సైన్యము చుట్టును నావరించి రక్షించుట, అంగేతరంబులు చలించినను చలింపక యెదురొడ్డి నిలుచుట, ప్రవాహంబు లడ్డము వచ్చినప్పుడు సైన్యములను దాఁటించుట, అభేద్యస్థలంబులను బలంబున భేదించుట, శత్రుసైన్యంబులకు నగ్నిముట్టించి స్వసైన్యంబున గలిగిన యగ్నిబాధల నివారించుట, చెదరిన సైన్యంబును నొక్కెడ ప్రోగుచేయుట, వైరుల గట్టిమొనలను చెల్లాచెదరొనర్చుట, రిపువర్గమును హుంకరించి

1. మెగస్తనీసు.

బెదరించుట, వారిని త్రొక్కి వినాశముచేయుట, కోటగోడలను దుర్గద్వారములను బురుజులను డీకొని పడద్రోయుట, ధనమును మోసికొని పోవుట; ఇందు దుర్గములను సాధించుట ముఖ్యతమము.

ఇట్లుపయోగ పడుచుండుటంజేసి గజములనిన చక్రవర్తికి మహాప్రీతి. వాని సంరక్షణార్థము ఒక్కయధ్యక్షుఁడును, అనేకులు అధికారులును, లెక్కలేని క్షుద్రసేవకులును నియమింపఁబడి యుండిరి. వానికై గొప్పగొప్ప యడవులు విడదీసి యుంచియుండిరి. వాని క్షేమాత్రము నొప్పి కలుగఁజేసిన వారికిని శిక్షలు విధింపఁబడు చుండెను. గజశాలల కసవుచేర నిచ్చుటయు, ఏనుంగులకు ఆహారము పెట్టకపోవుటయు, వానికి పరుండ నేర్పఱచిన మెత్తని భూములలోఁ గాక ఇతరస్థలములలో వానిని పరుండనిచ్చుటయు, అయుక్తపట్టున వానినిగొట్టుటయు, వానిపై నితరుల నెక్కనిచ్చుటయు, సమయముగాని వేళల వాని నెక్కుటయు, ఇఱుకుసందులలోనుండి వానిని నీటియొడ్డునకు నీళ్లు త్రాగించుటకుఁ గొని పోవుటయు, వానిని దట్టమగు నడవులలోనికిఁ బోనిచ్చుటయు నను నివి నేరములుగా నెంచఁబడి యట్టి యపరాధమునకుఁ గారకులైనవారు జరిమానాతో దండింపఁబడుచుండిరి. ఏనుఁగును చంపినవాఁడు ఉరిదీయఁ బడుచుండెను.[1]

ఈ కాలమునందువలెనే ఆ కాలమునందును ఏనుఁగులు తమ్ముఁను పెంచిన మావటివాండ్రయందు మిక్కిలి విశ్వాసము

---

1. చాణక్యుని అర్థశాస్త్రము 2 వ భాగము 32 ప్రకరణము

కలిగి యుద్ధములలో సంరక్షించుచుండెను. ఇందును గురించి చంద్రగుప్తుని యాస్థానమున గ్రీకువారి ప్రతినిధిగ నుండిన మెగస్తనీ సొక చిత్రమయిన కథ వ్రాసియున్నాఁడు.

ఒకానొక భారతీయునకు తెల్ల ఏనుంగు గున్న యొకటి చిక్కెను. అతఁడు దానిని పెంచుకొని వాహనముగ నుపయోగించుకొనుచుండె. దినదినమునకును దానియెడ నతని కనురాగము హెచ్చుచువచ్చెను. అదియును దన యజమానునికి విశ్వాసము నెఱపుచుండెను. ఇట్లుండ రాజున కద్దానిని అపహరింపవలెనను దురాశ పొడమెను. కాని స్వాంతగాని కా జంతువుపై నెక్కుడు ప్రేమయుండుటచేతను ఇతరుల వశమున దాని నుంచుటకు బుద్ధిపుట్టకపోవుట వలనను దానితోడం గూడ దేశము వదలి యడవులకుఁ బారిపోయెను. ఈ వార్త విని రాజు క్రోధోద్దీపితుఁడయి ఏనుంగును మనుష్యుని బట్టి తెచ్చుటకుఁ దన పరివారము నంపెను. వారును దరలిపోయి ఏనుంగును దాని యజమానుని దాఁకిరి. గజంబుపైనుండి అతఁడు రాజభటులతోఁ బోరాటము సలిపెను. వానికి ఏనుంగుకూడ సాయమొనర్చెను. కాని రాజభటు లనేకులైనందున వాఁడు గాయములుపడి సొలి క్రిందఁ బడిపోయెను. యుద్ధమునందు పడిన భటుని నాతని సహాభటులు దమ డాలులతో గప్పుపగిది అప్పుడీ యేనుంగు తన స్వామిని గప్పియుంచి శత్రువులను గొందఱను మడియించి తక్కినవారిం జెల్లాచెదరొనర్చివైచెను. పిదప నాతనిని తన తొండముతో నెత్తి

వీపుపై నిడికొని శాలకుఁ గొనిపోయి స్నేహితునివలె నతని ప్రక్క దుఃఖించుచు నిలుచుండెను.1

రథములు

రామాయణ మహాభారతాది కాలమునుండి మనదేశమున మహాయోధులు రథారూఢులయియే యుద్ధము చేయుచున్నట్లు కానవచ్చుచున్నది. సాధారణ సైనికులు మాత్రము నేలపై నిలువంబడి పెనంగుచుండిరి. చంద్రగుప్తుని కాలమున సాధారణముగ నరదంబునకు రెండు గుఱ్ఱములు పూన్చెడువారు. నాలుగు గుఱ్ఱంబుల రథంబులును నుండెను. ప్రతి రథంబుమీఁద సారథిగాక యిద్దఱు రథికులుండుదురు. కొన్ని రథములమీఁద నిద్దఱు సారథులును, ఇద్దఱు ధనుర్ధరులును, ఇద్దఱు ఫలకధారులును నుందురు. పనిఁ బడిన వేళల సారథులుగూడ సమరరంగంబున దమ శౌర్యంబు సూపి యని సల్పుచుండిరి.2

ఇట్టి రథసైన్యంబునకు రథాధ్యక్షుం డను అధికారి యుండెడువాఁడు. యుద్ధంబునకుఁ దగిన రథంబులను సిద్ధపఱిచి యుంచుట యతనిపని.

సైన్యములోని యధికారుల పరంపర

చతురంగములోని యొక్కొక యంగమునందలి పదుగురు భటులకుఁ బై యధికారి పదికుఁడు. అట్టి పదికులు పదుగురిపై యధికారి సేనాపతి నాఁబరంగు. అట్టి సేనాపతులు

1. మాక్రిండలు మెగస్తనీసు 118 పేజి
2. కర్టియసు 8. 14

పదుగురిపై యధికారి నాయకుండు నాఁజను. అట్టి నాయకు లందఱకును సర్వ సైన్యంబునకును నధికారి యగువాఁడు సేనా ముఖ్యుం డనంబడు చుండెను.

స్కంధావారనివేశము

సైన్యము యుద్ధమునకు సన్నద్ధమయి వెడలుటకు మున్నొక నాయకుఁడును నొక జ్యోతిష్కుండును నొక వర్ధకుఁడును, అనఁగా వ్రడంగియు, బెక్కండ్రు కూలివారును బయలు దేరి మార్గములను, అందలి గ్రామములను, అరణ్యములను, వంతెనలను, కాలిత్రోవలను, బావులను, చెఱువులను బరీక్షించి చెడిపోయిన వానిని సంస్కరింపు చుందురు. సైన్యము విడియుటకుఁ దగినస్థలములను నిర్ణయించి పీలుకొలఁది వలయాకారము గలదిగఁగాని చతుష్కోణాకృతి గలదిగాఁ గాని శిబిరంబును నేర్పఱుతురు. శిబిరమునకు నాలుగు ద్వారములును ఆఱు త్రోవలును నుండును. అది తొమ్మిది భాగములుగా విభజింపఁబడును. శత్రువులవలన నపాయము జరుగకుండ దాని చుట్టును కందకములును, గోడలును, పరిధులును, బురుజులును నిర్మింపఁబడును. రాత్రింబవళ్ళు పహారాయిచ్చుటకు పదునెనిమిది జతల సైనికు లుందురు. శిబిరమునం దప్రమత్తత నెలకొనుటకయి ద్యూతము త్రాగుడు విందులు కలహములు పూర్ణముగ నిషేధింపఁబడియుండెను. శత్రువులు మారు వేషముతో శిబిరముఁ జొరకుండుట కొఱకు అభిజ్ఞానపత్రము (pass-port) పొందనివారు లోనికి రానియ్యఁబడుచుండలేదు.[1]

---

1. చాణక్యుని అర్థశాస్త్రము. 10; 1.

సైన్యంబులు దాడివెడలు విధము

గడ్డియు నీళ్లును కట్టెయలును సమృద్ధిగ దొరకు మార్గ మని ముందు వెడలిన నాయకునిచే సూచింపఁబడిన వార్తననుస రించి ఆయా గ్రామముల నెతింగికొని రాజు యుద్ధమునకు వెడలును.

సేనాముఖంబున నాయకులును, నడుమ రాజును అంతః పుర స్త్రీలును, కుడియెడమవైపుల నాశ్వికసైన్యమును, చుట్టును నేనుంగులును దక్కుఁగల సైన్యమును నడుచును. త్వరగా నడచిన యెడల దినమునకు రెండు యోజనములును (రమారమి 13 మైళ్ళు) మందముగా నడచిన నొక్క యోజనంబును (రమారమి 6 మైళ్లు) ప్రయాణము సాగించుచుండిరి. సేన విడిసి యున్నప్పుడు సేనాధ్యక్షుని కుటీరము సేనకు ముందుండును. సైన్యములు వెడలునప్పుడతఁడు వెనుక నడచును.

యుద్ధముచేయు సమయముల భటు లుత్సాహముతోఁ బనిచేయఁగలందులకు గాను శత్రుసైన్యములలోని బంటును చంపినవానికి 20 పణములును, కాల్బలముల నాయకుని జంపిన వానికి 100 పణములును, అశ్వికుని జంపినవానికి 1,000 పణము లును, ఏనుంగునుగాని రథంబునుగాని నాశనమొనర్చిన వానికి 5,000 పణంబులును శూరాగ్రేసరుల నాయకుని జంపిన వానికి 10,000 పణంబులును, యువరాజును గాని సేనాధ్యక్షునిగాని జంపినవానికి 50,000 పణంబులును, శత్రురాజును మడియించిన వానికి లక్షపణంబులును బహుమాన మొసంగఁబడు చుండెను,

ధర్మయుద్ధము

హిందువుల యుద్ధవిధులు ఇతర దేశస్థుల వానికంటె మిగుల కరుణాయుక్తములు.

"ఆయుధములు పడవైచినవారిని, జుట్టు విరియబోసికొనియో చేతులను జోడించుకొనియో దయవేడు వారిని, శరణుజొచ్చినవారిని హింసించఁగూడదని యార్యశాసనము."[1]

"భీరులతో, మత్తులతో, ఉన్మత్తులతో, మైమఱచిన వారితో, కవచభ్రష్టులతో, స్త్రీ శిశు వృద్ధ బ్రాహ్మణులతో, యుద్ధము చేయరాదు."[2]

"సంహృత యోధుల పత్నులకు సంరక్షణ నొసంగవలయు."[3]

మెగాస్తనీసు ఇట్టి హిందువుల యుద్ధధర్మకారుణ్యమునకు సాక్ష్యము పలుకుచున్నాఁడు. "ఇతర దేశస్థులలో యుద్ధకాలములందు భూనాశనము సామాన్యమైయుండఁగ నందునకు మాఱుగ హిందువులలో పంటకాఁపులు-పవిత్రులును నహింసనీయులును గావున-సమీపముననే పోరు చెలరేగుచున్నను భయమించుకయు లేకయే నెమ్మదిగ నుందురు. ఏలయన ఇఱు తెగల పోటరులును పోరుసలుపుచు నొండొరుల నఱకు కొనుచున్నను సేద్యకాండ్ర జోలి కించుకయుఁ బోక నుందురు. మఱియు పగతుని భూమిని అగ్నిదగ్ధముచేయుట గాని అచ్చటి చెట్లను నఱకివేయుట గాని వారికి వాడుక లేదు.

1. అపస్తంబ. II 5-10-11
2. బోధాయన. I 10-18-11
3. వసిష్ఠ. XIX 20

ఎనిమిదవ ప్రకరణము

రాజ్యాంగ వ్యవస్థ

చంద్రగుప్తుని కాలమున రాజునకు సలహా నిచ్చుటకు మంత్రి పరిషత్తొకటి కలదు. అందు 12 గురో లేక 18 గురో లేక ఆయా సందర్భములకు వలసినంత మందియో మంత్రులుండెడువారు. అన్నివిషయములలో రాజు వారిని యాలోచన యడుగుచుండెడు వాఁడు. మిక్కిలి రహస్యముగ నుండఁదగిన విషయములలో నొకరిద్దఱు మంత్రులు మాత్రమె యాలోచనఁ దీర్చుచుండిరి. ఎప్పుడైన నొకప్పుడు రాజు స్వతంత్రించి పనిచేయుటయుఁ గలదు. కాని సర్వసాధారణముగ మంత్రులలో బహుజన సంఖ్య ఎట్లు చెప్పిన నట్లు నడుచుకొనుచుండెడువాఁడు. సామ్రాజ్యము నందలి దూరపు ప్రాంతములపయి చంద్రగుప్త చక్రవర్తి ప్రతినిధుల నేమించి వారివలన రాజ్యకార్యముల నడపించుచుండెను. ఈ ప్రతినిధులు సామాన్యముగ రాజవంశము వారలయినట్టు కానవచ్చుచున్నది. రాజధానికి వేయి మయిళ్ల దూరము నందుండు 'గిర్నారు' అనఁబడు పశ్చిమ ప్రాంతమున పుష్యగుప్తుఁడను ప్రతినిధి పరిపాలించుచుండినట్లును అతఁడచ్చటి

రైతుల సౌకర్యార్థమయి యొకనదికి యానకట్ట కట్టించి దాని నీటిని యొక తటాకమునకు మరల్చి తప్పని నీటివసతి నేర్పఱిచె ననియు తెలియవచ్చుచున్నది.

రా జ్య వి భా గ ము

ఆ దినములలో సాధారణముగ నైదువందల కాఁపు కుటుంబములు గలది యొకపల్లె. ఇట్టిపల్లెలు ఒకదాని కొకటి రమారమి క్రోశెడు దూరమున నుండుచుండెడివి. అందువలన నాపత్సమయమున నొకయూరివారు మఱియొక యూరివారికి సాహాయ్యము చేయఁగలుగు చుండిరి. పొలిమేర విషయమున వివాదము రాకుండుటకయి నదులు పర్వతములు మొదలగు స్వాభావిక చిహ్నములు పొలిమేర గుర్తులుగ నేర్పఱుపఁ బడి యుండెను. పల్లెచుట్టును కలపతో ప్రాకారము పెట్టుచుండిరి. ఇట్టి పల్లెలు అయిదు మొదలు పదుంటివఱకు నొక్కయధికారి క్రిందనుండును. ఆ యధికారికి గోపుఁడని పేరు. ఈ గోపుఁడే ఆ గ్రామములకు సంబంధించిన లెక్కలు వ్రాయుచుండును. గ్రామములు, చేలు, తోఁటలు, మార్గములు, బీళ్లు, దేవాలయములు, తోఁపులు, తీర్థములు మొదలగువాని సరిహద్దు గుర్తులను ఇతఁడు సంరక్షించువాఁడు.[1] గ్రామస్థులు చేసికొను దానములు విక్రయములు తనఖాలు ఈతని ద్వారా జరుపుచుండెను. గ్రామములోని ప్రతి గృహము నందలి జనుల యొక్కయు దాసుల యొక్కయు సేవకుల యొక్కయు పశు

---

1. ప్రస్తుత మీ పనులన్నియు కరణములను ల్యాండురికార్డు ఇన్‌స్పెక్టరు తహశీలుదారులను చేయుచున్నారు.

పశ్వాదుల యొక్కయు లెక్క ఈతఁడు వ్రాయుచుండెను. అదే లెక్కలలో ఒక్కొక్క యింటివారు ప్రభుత్వము వారికి చెల్లించు చుండిన శిస్తుసుంకములు మొత్తమును తెల్పుచుండును. గ్రామస్థుల వృత్తులను బట్టి వారువారు గడించు మొత్తములను రమారమిగ నిర్ణయించి లెక్క వ్రాయుటయు నతని పనులలో నొక్కటి.[1] ఈ కర్తవ్యములను బట్టి ఇతఁడు అప్పటి కరణమని వేరుగ వ్రాయఁబనిలేదు.

ఎనిమిదివందల గ్రామములపై యధికారికి స్థానికుఁడని పేరు. ఈ 800 గ్రామముల సంరక్షణార్థము స్థానీయమనఁబడు దుర్గమొండుండెడిది. ప్రస్తుతపు జమీందారీలలోని ఠాణేదారు శబ్దమునకు ఈస్థానికుఁడు అనుపదము తండ్రియేమో. గోపుఁడు గ్రామముపైఁ బలెస్థానికుఁడు మండలముపై అధికారి. ఈయధికారులందఱపై వాఁడు 'సమాహర్త' నాఁబరగుచుండెను. రాష్ట్రమును మండలములుగ విభజించుటయు, గ్రామముల తరగతులను నియమించుటయు, గ్రామాధికారులయొక్కయు స్థానికుల యొక్కయు పనులను బరిశీలించుటయు నీతనికిఁ గర్తవ్యములు. ఈ సమాహర్తగాక రాజ్యాంగశాఖ లొక్కొంక్కంటికిని నొక యధ్యక్షుఁ డుండును. అధ్యక్షు లందఱును మంత్రులలోని వారె. వీరు రాజుతోఁడంగూడ పైన నుడివినట్లు రాజ్యభారమును వహింతురు.

---

1 చాణక్యుని అర్థశాస్త్రము.

గ్రామము లుత్తమ మధ్యమాధమ భేదములచే మూఁడు విధములు. ఈ విభాగము గాక యీ క్రింది విధముగ వేరు తరగతు లేర్పడుచుండెను.

(1) ఇనాము గ్రామములు
(2) సైనిక గ్రామములు
(3) ధన ధాన్యవస్తువులఁ జెల్లించు గ్రామములు
(4) పశువులను సేవకులను అమర్చు గ్రామములు
(5) పాలను పెరుగును కూరగాయలను ఇచ్చు గ్రామములు.

రాజ్యాదాయ మార్గములు

ఇప్పటింబలెె చంద్రగుప్తుని కాలంబునను రాజునకు మన దేశమున వరుంబడికి ముఖ్యాధారము నేల పన్నె యయియుండెను. "సేద్యము క్రిందనుండు భూమిలో విశేషభాగమునకు నీటివసతి కలదు. సంవత్సరమునకు రెండు కారులు పంటలు పండును ... నదులమీఁద కొందఱు అధికారు లుందురు. వారు ఈజిప్టుదేశము నందువలె భూములుకొలిచి రైతుల కన్యాయము జరుగకుండుటకయి పెద్ద కాలువలనుండి పిల్లకాలువలకు నీళ్లు విడుచు ద్వారములను తగువిధమున మూయించుచు తెరపించుచు నుందురు."[1] సాధ్యమయినవఱకు ఇట్టి నీటి వసతుల నమర్చి చంద్రగుప్తుఁడు భూములయందు కర్షకులు చేయవలసిన కష్టమును అనుసరించి కరము గ్రహించుచుండెను. 'హస్త

1. మెగస్తనీసు.

ప్రవర్తిమ ' భూములయందు అనఁగా చేతి కష్టముచేత నీటి పాఱుదలయగు భూములయందు " ఉదకభాగము "[1] పంటలో నైదవవంతుగ నిర్ణయింపఁబడి యుండెను. ' స్కంధప్రవర్తిమ '[2] భూములలో ననఁగా ఎడ్ల సాహాయ్యమున నీరు పాఱుదల చేసికొను భూములలో నాల్గవ వంతుగను; ' స్రోతయంత్రప్రవర్తిమ ' భూములలో ననఁగా వాయుయంత్రముల[3] మూలమునను ఇతర యంత్రముల మూలమునను సాగగు వానిలో మూఁడవ వంతుగను నదులు, సరస్సులు, చెఱువులు, బావులు మున్నగువాని క్రింది పంటలలో మూఁడవ లేక నాల్గవ వంతుగను పన్ను నిర్ణయింపఁబడి యుండెను.

అర్థశాస్త్రమున నొక్కెడ " సాగుచేయక వదిలిపెట్టఁబడిన భూములను (రాజు) పంటలో సగము భాగమునకు పైరు పెట్టువారికి ఇయ్యవచ్చును. స్వంత సేద్యముగల రైతులకు నాల్గవ వంతునకో యైదవ వంతునకో యిచ్చి వేయవచ్చును.

1. నీటి తీరువయని యర్థము.

2. " స్కంధప్రవర్తిమ " మనుదానికి " భుజముచేత మోసికొనుట " యని కొందఱర్థము వ్రాసి యున్నారు. ఆ యర్థ మంగీకరించినచో హస్తప్రవర్తిమము నకును దీనికిని భేదమెట్లో తెలియరాకున్నది. భేదము లేనిచో తీరువ ఎట్లు భేద పడునో నిర్ణయింపరాదు. స్కంధమను శబ్దము జత యొద్లకుంగూడ ప్రవర్తించును గాన నెడ్ల సాయమున నీరు పాఱించుకొని సాగుబడి చేసికొనఁబడు భూములనుట యుక్తి యుక్తముగా నున్నది.

3. వాతప్రవృత్తిమనందిని వద్నాయతన తటాక కేదారా రామషణ్డవాపానాం సస్యవణ భాగోత్తరిక మన్యేన్యే వాయథోపకారందద్యుః. (అర్థశాస్త్రము మూఁడవ భాగము.)

లేక వారు అనవసరముగు నష్టము పొందక యియ్యగలిగినంత యిచ్చినను ఇయ్యవచ్చును." అని వ్రాయఁబడి యుండుటం జేసి చంద్రగుప్తుని కాలమున రైతున కీయశక్యముగాని పన్ను రాజునకు కుండెననుట స్పష్టమగుచున్నది. స్వంతముగ చెఱువులు త్రవ్వించుకొనినచో నట్టి ప్రజ యా చెఱువుల క్రింది సాగుపై యైదు సంవత్సరముల కాలమును, శిథిలమైన చెఱువులను చక్కఁజేసికొనువారు నాలుగు సంవత్సరముల కాలమును, చెఱువుల విస్తీర్ణ మెక్కుడు చేసికొని యెక్కుడు భూభాగమును సాగుదల క్రిందికి తేఁ దలఁచుకొనిన వారు ఆ భాగము పయి మూఁడు సంవత్సరముల వఱకును, కుష్కి పంటల పండించు నుద్దేశముతో క్షేత్రముల సిద్ధపఱచు కొనువారు రెండు సంవత్సరముల పర్యంతమును బన్ను చెల్లించ వలదనియుఁ జేయఁబడిన నియమములు పన్ను గ్రహించుటలో రాజునకుఁ గల దూరదృష్టిని వేనోళ్లఁ జాటుచున్నవి.

ఇంతవఱకు వ్రాయఁబడిన తరములు 'ఉదకభాగము" లని పేర్కొనఁ బడినవి. అనఁగా నివి పల్లపు భూములమీఁదిఁ తరములని యర్థము. మెట్టభూములపై విధింపఁబడుచుండిన తరములను గుఱించి కనుగొనుటకు ఆధారమెద్దియుఁ గానరాదు.

రాజునకు స్వంతమాన్యము లనేకము లుండెడివి. వాని నాతఁడు 'సీతాధ్యక్షుఁ' డను నధికారి మూలమున సాగు చేయించు చుండువాఁడు. ఈ యధికారి 'కృషితంత్రగుల్మవృక్షాయుర్వే దజ్ఞఁడుగ' నుండును. అతఁడు రాజుగారి

క్షేత్రములకు వలయు బీజాదికములను సంపాదించి తత్తచ్ఛాస్త్రములం ప్రవీణులగు క్రింది యధికారుల సాయముం గొని దాసులను కూలివారలను ఖయిదీలను వినియోగించుకొని రాజుగారి సేద్యమును సాగించును. అందులకు నవసరమగు నుపకరణముల సిద్ధము చేయించుటయు నతనిపనియె. అతఁడు సూర్యచంద్రాదులయు నక్షత్రములయు గతులను గమనించి కాలవైపరీత్యముల దెలియఁజేయు చుండినట్లును వాయువులను మేఘములను బరిశీలించి వర్షముల న్యూనాధిక్యము నెఱింగించుచుండినట్లును వర్షమాపక యంత్రముల సాహాయ్యంబున 'ద్రోణ' మను పరిమాణము నుపయోగించి వర్షపాతమును లెక్కించుచుండినట్లును గానవచ్చుచున్నది. ఎఱువుల నుపయోగించు పద్ధతులు గూడ నాతఁడే నియమించుచుండినట్లు తెలియుచున్నది. ఈ విధమున కాలవైపరీత్యములను గనిపట్టి వర్షముల న్యూనాధిక్యము నెఱింగించి వర్షపాతమును లెక్కించి యెఱువుల సారాసారంబుల నిర్ణయించి సీతాధ్యక్షుఁడు తన శాఖలోని యితరాధికారుల తోడంగూడ రైతులకు సాయపడుచుండెడి[1] వాఁడు.

చంద్రగుప్తుని కాలమున గోఽధ్యక్షుఁడను అధికారి యొక్కరుఁ డుండును. అతఁడు రాజుగారి గోవులు మున్నగు పశువుల కన్నిటికిని పాలకుఁడు. ఆ పశువులకు వలయునుపచారములు చేయించి వానివలన వచ్చు నాదాయము నతఁడు రాజు

1. ప్రస్తుతము అగ్రికల్చరు డిపార్టుమెంటు వారీపనియే చేయుచున్నారు.

గారి బొక్కసమునకుఁ జేర్చుచుండును. వేనవేలు పశువులు రాజుగారి కుండుటంబట్టి యీ యాదాయము కొలఁదిపాటి యనుటకు వీలు లేదు,

రాజునకు వరుంబడి నీనుటలో సాగుబడి భూములకు రెండవది దేశములోని వ్యాపార సముదాయము.

చంద్రగుప్తుని కాలమున నెల్ల వ్యాపారమును కోట గుమ్మమునఁ గట్టఁబడిన సుంకపు కొట్టుకడనె జరుగవలసి యుండెను. ఇతర స్థలముల వ్యాపారము జరుపుట నిషేధింపఁబడి యుండెను. వ్యాపారమునకయి రైతులును వ్యాపారస్థులును దెచ్చిన వస్తుసముదాయము సుంకము కొట్టుకడ నమ్మఁబడిన తరువాత అమ్మకపు మొత్తమును బట్టి సుంకము వసూలు చేయఁబడుచుండెను. రైతులుగాని వస్తునిర్మాతలుగాని వస్తు సముదాయములు ఒక స్థలమునుండి మఱియొక స్థలమునకు మార్చుకొనుచో సుంకపు కొట్టుదారిని రావలసివచ్చినను వారు సుంకమీయ నవసరము లేకుండెను. వివాహార్థమును, రాజున కర్పించుటకును, రాజుగారి భాండారములఁ జేర్చుటకును, మతోపయోగమునకును, ప్రసవించు స్త్రీలకొఱకును, ప్రయోజనములకొఱకును గొనిపోఁబడు సామాగ్రి సుంకములేక తీసి కొనిపోఁబడుచుండెను. సుంకపుతరము వస్తువు వెలయందు ఇరువదియైదవ వంతు మొదలు ఐదవ వంతు వఱకును గలదు. సుంకపు నిబంధనలను మీరువారికి నేరము ననుసరించి 3000 పణములవఱకును (అనఁగా, ప్రస్తుతపు 2000 రూపాయలు)

అపరాధము విధింపఁబడు చుండెను. ఈవిధముగను రాజుగారి బొక్కసమునకు విశేషద్రవ్యము చేరుచుండెను.

విదేశములనుండి దిగుమతియగు సామాగ్రిపై వ్యాపార సుంకముగాక రాజుగారికి మఱియొక విధమగు సుంకము చెల్లు చుండెడిది. మొత్తముమీఁద దిగుమతియగు వస్తువులకుఁ బ్రబలతమమగు పన్ను విధింపఁబడుచుండెను. (1) 'శుల్క' మనఁబడు వ్యాపారసుంకమును (2) 'వర్తని' యనబడు మార్గసుంకమును[1] (3) 'గుల్మదేయ' మనఁబడు సైనిక సుంకమును (4) 'భాగ' మనఁబడు దిగుమతి సుంకమును సర్వసాధారణముగ దిగుమతి వస్తువులకుఁ దప్పినవి కావు.

ఇప్పగిది సార్వభౌమునకు నెగుమతి దిగుమతులవలన సుంకముల రూపమున నాదాయ ముండెడిది.

ఆకాలమున కొలతపాత్రలును తులాయంత్రములును ప్రభుత్వమువారే సిద్ధపఱచి యమ్ముచుందురు. వ్యాపారులు వానిని కొనుటయేగాక ప్రతిదినమును వాని పరిమాణము సరియయినదని నిర్ణయముద్ర వైచుటకు ప్రభుత్వమువారికి కొద్దిపాటి రుసుము చెల్లించుచుందురు. వ్యాపారస్థులు ప్రజల నేమాత్రము మోసముచేయుటకుఁ బ్రయత్నించినను నపరాధులుగ నెన్నబడి జరిమానాలతో శిక్షింపఁ బడుచుండిరి.

---

1. ఇది మఱియొక రాజ్యమునుండి తన రాజ్యమునకు వచ్చు వస్తువుల మీఁద రాజు విధియించు సుంకము.

ఇప్పటివలెనే చంద్రగుప్తుని కాలమునందుఁ గూడ 'ఉప్పు' చేయుట అమ్ముట ప్రభుత్వమువారి హక్కై యయి యుండెను. వారుస్వదేశమున స్వంతముగ ప్పును పండించు టయుఁగలదు. ఒక్కొక్కతఱి నా స్వాతంత్ర్యము కౌలుదారు లకు గుత్తకిచ్చుటయును గలదు. స్వదేశమునం దుత్పత్తియగు చుండిన యుప్పుగాక విదేశములనుండియు దిగుమతియగు చుండెడిది. అందలి వ్యాపారమును ప్రభుత్వము వారిదే యయి యుండెను.

సురాలోలు లికాలమునందుఁబలె నకాలమునను ప్రభుత్వము వారికి ద్రవ్యము నియుచుండిరి. కాని అప్పుడు త్రాగుడునకయి సర్వస్వము పోఁగొట్టుకొనుట్లు తటస్థింపకుండుట కొరకు కొన్ని నిబంధన లేర్పడియుండెను. నిర్ణయింపఁబడిన పరి మితి కెక్కుడుగ నెవ్వరికిని హాలారసంబు విక్రేత లమ్ముట లేదు. వెలకును హద్దు లునుపఁబడి యుండెను. త్రాగి మైమఱచి పడిపోయిన వారి శరీరముపైనుండు సొత్తును గాపాడుటకు నుచితమగు విధులు నియమితమయి యుండెను. విదేశపు సారా యిలపై సాధారణ సుంకములుగాక 100 కి 5 వంతున పన్నులు విధింపఁబడు చుండెను. సురామందిరములను గుఱించిన శాసన ములలో, ఆ మందిరములు సౌకర్యములైన పెక్కుగదులుండు నట్లును, ఒక్కొక్కగదియందు వలసినన్ని మంచములును కుర్చీ లుండునట్లును, ఆయా ఋతువులకు ఆవశ్యకములైన యను కూలము లన్నియు పొసఁగి యుండునట్లును, నిరంతరము పుష్ప

హారములతోను అగరు చందనాది పరిమళ ద్రవ్యములతోను నిండుకొని యుండునట్లును, అలంకరించియుండ వలెనని విధింపఁబడి యున్నది. దీనినిఁబట్టి కొందఱు చరిత్రకారులు ఆ కాలమున త్రాగుబోతుతన మెక్కుడుగ నుండెనని యూహించుచున్నారు. కాని మొదట వ్రాసిన నిబంధనలను జాగరూకతతో స్మరించిన యెడల నీ యలంకారాదులు త్రాగనేగు స్వల్ప సంఖ్య జనంబుల యారోగ్యముకొఱకును పరిసర ప్రదేశస్థులకు జుగుప్సాభార మాపాదింప కుండుటకును విధింపఁబడెనని తోఁచక మానదు. కొలతపాత్రలను తూనిక యంత్రములును ప్రభుత్వమువారి వలననే చేసి యమ్మఁబడు చుండెనని ఇది వఱకు వ్రాసియున్నారము. దానినిఁబట్టి 'యిండియన్ అంటిక్వేరీ' సంపాదకులు ఆ కాలమున నాణెములు బహుస్వల్పముగ నుపయోగింపఁ బడుచుండెననియు వ్యాపారమంతయును వస్తు గ్రహణ ప్రతిగ్రహణము వలననే జరుగుచుండెననియు వ్రాసియున్నారు. కావున నాకాలమునందు నాణెముల వలన రాజునకు నెక్కుడుగ లాభము గలుగు చుండెనని చెప్పుటకు వీలు లేదు. అయినను నక్కాలపు నాణెములను వానియందలి లోహ విశేషంబును ప్రస్తుతపు నాణెములతోటి సామ్యమును నూ చదువరులు గ్రహించుటకయి యీ క్రింది వివరణ పట్టిక నిచ్చుచున్నాము.

నాణెముల పేళ్లు.	అందలి విశేష లోహములు	వెల (గురిగింజలలో)
1 పణము	$\frac{1}{16}$ రాగి, $\frac{1}{16}$ సీసము	=80 గింజలు= $\frac{80}{122}$ తులములు=ఇంచుమించుగ నిప్పటిరూపాయిలో $\frac{2}{3}$ వంతు
2 అర్థపణము	,,	=40 గింజలు,
3 పాదము	,,	=20 గింజలు,
4 అష్టభాగము	,,	=10 గింజలు,
1 మాషము	$\frac{1}{4}$ వంతుఇతరలోహం	=5 గింజలు,
2 అర్థమాషము	,,	$2\frac{1}{2}$,,
3 కాకణి	,,	$1\frac{1}{4}$,,
4 అర్థకాకణి	,,	$\frac{5}{8}$,,

పై వివరణపట్టికయందుఁ గనినవిగాక అర్థశాస్త్రము నందు చాణక్యుఁడు మూఁడు బంగారు నాణెములను బేర్కొని యున్నాఁడు. 5 గింజలయెత్తుగలది మాషమనియు, 16 మాషముల యెత్తుది సువర్ణములేక కర్షమనియు, నాలుగు కర్షముల యెత్తుదీ యొక పలమనియు వాడియున్నాఁడు. ఈ పరిమాణ పరంపర తూనిక మాత్రమునకయి యుండనోపునా? తూనిక మాత్రమునకు సువర్ణపు దిమ్మెలు గావలెనా? చంద్రగుప్తుని కాలమున నియ్యవి వాడుకలో నుండిన బంగారునాణెములని చెప్పుటయే యుక్తి యుక్తముగ నున్నది. అప్పటికాలమున హిందూదేశము బంగారమునకుఁ బేరువడసి యుండెను.

మెగాస్తనీసు భరతవర్షమున సువర్ణమును త్రవ్వుటను గుఱించి చిత్రమయిన ఈ క్రింది కథను వ్రాసియున్నాఁడు.

తూర్పు సరిహద్దునందలి 70-80 మైళ్ల చుట్టుకొలతగల ఉచ్చ భూప్రదేశమున భారతేయులలో నొకతెగ యగు 'దరదులు' అనువారు వసించుచున్నారు. అచ్చట భూగర్భమున బంగారు గనులు గలవు. అందువలననే సువర్ణమును త్రవ్వు చీమలును నచ్చటగలవు. అవి యడవినక్కలకు పరిమాణమునఁ దీసిపోవు. వాని త్వరిత గమనము విభ్రమమును బుట్టించును. అవి వేఁటాడి జీవనము సలుపును. వానికి సువర్ణమును ద్రవ్వుటకు శిశిర ఋతువు అనుకూలము. అవి బంగారు గనులనుండి ఆ లోహమును ద్రవ్వి దానితోఁ గూడిన మట్టిని అడవి ఎలుక (Moles) వలె గనిద్వారమునఁ గుప్పలువైచును. అట్లు పడిన సువర్ణ రజమును కరగించుటయే కర్తవ్యము. చుట్టుప్రక్కలం గల జనులు మోత పశువులను గొనితెచ్చి దొంగతనముగా నా మట్టిని మోసికొని పోవుచుందురు. వారు ఎలుకవడునట్లు వచ్చినచో నచ్చటి యద్భుతమగుఁ జీమలు వారి నెదిర్చి పారిపోనీక వెన్నంటి వారిని వారి పశువులను జంపివేయును. కావున వారచ్చటచ్చట వివిధములగు మాంసఖండములనువైచి యా చీమలు వానిని భక్షించుటయం దేమఱియుండ బంగారు పొడిని యపహరింతురు. ఆరజమును గరగించు పద్ధతులు తెలియవుగాన వారితరుల కమ్ముచుందురు. 1

---

1. మాక్రిండల్ మెగాస్తనీసు. పే 94 ఈ కథ మెగాస్తనీసునకు ముంధనేకులు చెప్పుకొని యున్నారు.

పై సంగతు లత్యద్భుతముగఁ గన్పించినను నందు సత్యము లేకపోలేదు. త్రవ్వుచుండినది చీమలుగావు. కాని తిబెట్టుదేశపు ఖనన క్రియాదక్షు లకార్యములను దీర్చుచుండిరి. వారి యుపకరణాదులనుబట్టియు వారిపద్ధతులను బట్టియు నభ్యాసములను బట్టియుఁ బైకథ పుట్టియుండునని నిర్ణయింపఁబడి యున్నది.

ఏది యెట్లయినను బూర్వము హిందూదేశమున చీమలు బంగారపు పుట్టలఁ బెట్టుచున్న వన్నను బయటి దేశముల వారలు నమ్ముచుండెడివారు. అట్టి కాలమున బంగారపు నాణెము లుండెనని చెప్పుటకు వేరు యుక్తులు గావలెనా? ఒకవేళ బంగారపు తూనికదిమ్మెలను నుపయోగించుచుండిరేమో.[1]

నాణెముల కథ యింతటితోఁ జాలింతము. ఇదివఱకుఁ జెప్పినవి మార్గములేగాక రాజునకు నాదాయము నిచ్చు మార్గము లింకను ననేకములుండెడివి. వాని విస్తారవివరణమిట యనవసరము.

సామంతప్రభువులు గొనితెచ్చియిచ్చు కప్పములును, గ్రామరక్షక సంఘములు వసూలుచేయు నపరాధములును, ఖయిదీలను విడిపింప నియ్యఁబడు చుండిన ధనమును, అభిజ్ఞాన పత్రముల విలువయు, అవసరమగునెడల దేవాలయాదులలోని ద్రవ్యమును, ఓడలమీఁద పన్నులును, బాటతీరువలును, గనుల తీరువలును, అడవి ద్రవ్యముల మీఁద సుంకములును, జరిమానాలును, రాజుగారి బొక్కసమునకుఁ జేరుచుండెడివి.

---

1. ఇండియన్ అంటిక్వేరి. సంపుటము. 4. పే 225.

జ నా భా లె క్క లు.

నాగరకునకును గోపునకును నియమింపఁబడిన కర్తవ్యములలో జనాభాలెక్క యెప్పటిదప్పుడు వ్రాయుట యొక్కటియయి యుండెను. తమ గ్రామము నందలి ప్రతివ్యక్తి యొక్క తెగ, జాతి, పేరు, ఇంటిపేరు, వృత్తి, వరుంబడి, వ్యయము, పశుగణములు వీరు లిఖించి పెట్టుచుండిరి. బయటి వారెవరైనను వచ్చినప్పుడు వారిని గుఱించి తెలిసికొని వ్రాసిపెట్ట వలసిననియు నట్టివారుగాని మఱియెవ్వరుగాని తప్పు సంగతులు నుడివిన యెడల శిక్షకుఁ బాత్రు లగుదురనియు నున్నది. ఇంతకంటె విశేషమగు జనాభాలెక్క లేల కావలెను?

బాటలు-వాహనములు

చంద్రగుప్తుని రాజ్యము ఇప్పటి భరతఖండమునకంటె విస్తీర్ణమున ఎక్కుడయినదని ఇదివఱకే వ్రాసియున్నాము. ఇంతటి రాజ్యములో నొక్క భాగమునుండి మఱియొక భాగమునకుఁ బ్రయాణాదులు సలుపుటకు సదుపాయములు పుష్కలముగ నుండెను.

పలువిధములగు బాటలు వర్ణింపఁబడినవి. వానివెడల్పు వానివాని యుపయోగములనుబట్టి 32 అడుగులు మొదలు నాలుగడుగుల వఱకు నుండెడివి. ఉపయోగమును బట్టియు గమ్యస్థాన విశేషమును బట్టియు నీ బాటలకుఁ బేరు లమరి యుండెను. రాజమార్గము లనియు, రథపథము లనియు, పశుపథము లనియు, ఖరోష్ట్రపథము లనియు, చక్రపథము లనియు,

మనుష్యపథములనియు, అసంపథములనియు, వరుసగ రాజులు, రథములు, పశువులు, ఖరోష్ట్రములు, శకటములు, సాధారణ ప్రయాణికులు, బరువుమోసికొని పోవువారును ఉపయోగించు కొనుట వలన వచ్చిన పేళ్లు. రాష్ట్ర పథములనియు, వివీత పథములనియు, ద్రోణముఖ పథములనియు, స్థానీయ పథము లనియు, సయోనీయపథములనియు, వ్యూహపథములనియు, శ్మశానపథములనియు, గ్రామపథములనియు, వనపథములనియు హస్తిక్షేత్రపథములనియు, సేతుపథములనియు, నాయాగమ్య స్థానములనుబట్టి వచ్చిన నామధేయములు.

ఇవిగాక కోటలయందు విశేషమార్గము లుండెడివి. వాని నిటఁ బేర్కొనఁ బనిలేదు.

ఈ బాటలెల్లయును బహుజాగరూకతతోఁ గాపాడఁ బడుచుండెను. వీనిపై ప్రయాణీకుల కభ్యంతరము గలుగఁజేసిన వారు దండింపఁ బడుచుందురు. ఇందు దక్షిణదేశమునకుఁ బోవుచుండిన బాటలవలన వజ్రములు, ముత్యములు, రత్న ములు, బంగారు, శంఖములు మున్నగు వస్తువుల వ్యాపారము మిక్కుటముగ జరుగుచుండి నందున నామార్గములకే చాణ క్యుఁడు ప్రాముఖ్యత నిచ్చియున్నాఁడు. అన్ని మార్గముల మూలమునను జక్కని వ్యాపారము జరుగుచుండె ననుటకు సందియము లేదు. ఇంతియగాక ఈ మార్గము లింకొకవిధమునఁ గూడ నుపయోగించు కొనఁబడుచుండెను. అతివిస్తారంబగు నా రాజ్యమున సమయోచితంబుగ దండులను మందుగుండు

సామగ్రిని దూతలను పనిచి రాజకీయ కార్యములను జక్క-పెట్టుకొనుటకుఁ జక్రవర్తికీ మార్గము లెంతయుఁ దోడ్పడుచుండెడివి.

ఇట్టి మార్గముల నిరంతరమును ప్రయాణము సలుపుచుండిన వాహనసాధనములను గుఱించి యోచింతము. అందు రథములు మొదటివి. సైన్యమును గుఱించి వ్రాయునప్పుడు రథాధ్యక్షుఁ డొకఁ-డుండెనని వ్రాసితిమిగదా ! దాని వలననే అప్పటి కాలమున రథములెంత ముఖ్యవాహనము లయినదియు మా చదువరు లూహించుకొనఁగలరు. ఏడుజాతుల రథములుండెడివి. ఎత్తునందు పదియడుగులు గలవి యున్నత తమములు. అట్లే వెడల్పునందు పండ్రెండడుగుల వఱకుఁ గలవు. దేవరథములనియు, పుష్పరథములనియు, సాంగ్రామికరథములనియు, పారియానిక రథములనియు, [1]పరపురాభి యానికములనియు,[2] వైనయికములనియు,[3] రథములలో ఉపయోగము ననుసరించి విభేదము లుండెడివి.

రథములకుఁ దరువాత లఘుయానము, గోలింగము, శకటము నాఁబరగు బండ్లు ముఖ్యసాధనములు ఇవ్వియే సర్వసాధారణముగ నుపయోగింపఁ బడుచుండెడివి. వీనిని రథములను లాగుటకు ఒంటెలను, ఎద్దును, గుఱ్ఱములును వాడఁబడుచుండెను. బండ్లు నడపువానికి చక్రచరుఁడని పేరు.

---

1. సాధారణ ప్రయాణముల కుపయోగ పడునవి.
2. పరరాజులపై దండు వెడలునప్పు డుపయోగ పడునవి.
3. అభ్యాసమున కుపయోగింపఁ బడునవి.

శివికములును పీఠికములును ననంబడు పల్లకీలును నకాలమున నుండెడివి.

ఇన్ని తెఱంగులగు వాహనముల ప్రయాణంబున కాకర మగు మార్గముల పథికులకు నపాయములు గలుగకుండుటకుఁ దగిన నిబంధన లేర్పఱుపఁబడి యుండెను. వాని వివరణ యనవసరము.

ప్రయాణికుల సౌకర్యార్థము మార్గముల కిరుప్రక్కలను చెట్లవరుసలు పెంచఁబడుచుండెను. అచ్చటచ్చట నీటి వసతు లేర్పఱుపఁబడి యుండె. పూటకూలి యిండ్లను విశ్రమాలయ ములును బొడగట్టుచుండెను.

ఇదివఱకు వ్రాయఁబడిన దంతయును భూమార్గములను గుఱించియే. నీటి బాటలును చంద్రగుప్తుని కాలమున సుప్రసిద్ధములయి దూరభాగముల నొండొంటితోఁ జేర్చి భూమార్గముల వలెనే పాటలీపుత్ర సామ్రాజ్యమునకుఁ బటుత్వ మొసంగుటయేగాక లోకమునందలి యితర రాజ్యములతోడను అందలి ప్రజలతోడను భారతీయులకు వ్యాపార సంబంధములు కల్గించి గౌరవైశ్వర్యంబులు సమకూర్చుచుండెను. నీటిబాట లలో ననేక విభేదము లెన్నఁబడినవి. సాధారణ నదీనదము లకును గాలువలకును 'కుల్యామార్గము' లనియు సామ్రాజ్యము లోని రేవు లొండొంటికిని గల తీరమార్గములకు 'కూల పథము' లనియు విదేశములతో సంబంధము గడుపుచుండిన నిండు సముద్రమార్గములకు 'సంయానపథము' లనియుఁ

వేళ్లు గలవు. ఈ నీటి బాటల కుపయోగపడు నావ లనేక తరము లవి ఉండెడివి. సంయాత్యనావలును ప్రవహణములును సముద్రముమీఁద ప్రయాణీకుల కుపయోగపడునవి. శంఖముక్తాగ్రాహిణనావలు పేరే ప్రకటించునట్లు సాగరమునందు ముత్తెముల నేరి తెచ్చుటకుఁ బనికివచ్చునవి. మహానావలు మహానదులయం దుపయోగపడునవి. క్షుద్రనావలును, తెప్పలును, బుట్టలును (హారగోలు), ప్లవములును మున్నగు నీటిని దాఁటించు సాధనములకు లెక్కలేకుండెను.

నావలలోని యధికారులును, సేవకులును, వారివారి కర్తవ్యములును విస్తారముగ వర్ణితములయి యున్నవి. కావున నావికాయాన మప్పుడు పూర్ణస్థితియం దుండెనని చెప్ప నొప్పును.

వ్యాపారము—చేతిపనులు.

ఇట్టిబాట లుండుటవలనఁ జంద్రగుప్తుని కాలమున వ్యాపారము అతివిస్తారముగ జరుగుచుండెను. మధుర[1], అపరాంత[2], కళింగ, కాశి, వంగ, వత్స[3], మహిష[4] దేశములు సుందరతమమగు ప్రసిద్ధవస్త్రములఁ బంపుచుండెను. ముత్యములు పారశీకము నుండియు బర్బరము నుండియు ; వాసన ద్రవ్యములు

1 దక్షిణమధుర.
2 కొంకణము.
3 కౌశాంబి.
4 మాహిష్మతి. కొందఱమతంబున మైసూరు.

} అర్థశాస్త్రము. సం. 2 అ 11

కామరూపము[1] నుండియు, సింహళము నుండియు; తోళ్లు హిమాలయ పర్వతములమీఁది మ్లేచ్ఛగ్రామముల నుండియు; 'కాలేయక' మను గంధపుచెక్క స్వర్ణభూమి యనఁబడు బర్మా నుండియు; పట్టుగుడ్డలు చీనా నుండియు; అగరు సముద్రమున కావలినుండియు వచ్చుచుండెను. క్రీ. పూ. ఆరవ శతాబ్దమున భరతవర్షపుఁ బశ్చిమతీరమందలి వణిక్కులు బాబిలోను రాజ్యముతో వ్యాపారాదులు సలుపుచుండి రనుటకు నిదర్శనములు గలవని బ్యూలరు పండితుఁడు వ్రాయుచున్నాఁడు. ఇదియును చంద్రగుప్త చక్రవర్తి కాలమునకు సంబంధించిన దగుటవలన పై జాబితాలతోడం జేర్చిన నప్పటి వ్యాపారపరిమితి యపారమని వెల్లడి సేయుచున్నది.

సర్వసాధారణముగ వ్యాపారము వెంటన చేతిపను లభివృద్ధి యందు చుండును. అవ్వానియవస్థను గుఱించి విశేషము వ్రాయుటకు విపులాధారములు లేవు. సూత్రాధ్యక్షుఁడను అధికారి పొడగట్టుట వలనను అతఁడు నేత పనిని చూచుకొనుటకు మాత్రమే నియోగింపఁబడి యుండుటవలనను అప్పుని అక్కాలమున విస్తారము జరుగుచుండెనని చెప్పవచ్చును. కుమ్మరము వడ్రంగము మున్నగు సాధారణపుఁ బనులనిట వర్ణించుటే యనవసరము. అర్థశాస్త్రమునందలి యొకానొక ఘట్టములోని వ్రాఁతనుబట్టిచూడ నాకాలమున గాజుపని జరుగుచుండినట్లును అది నాణ్యపు బనులలో నొక్కటిగ నెన్నఁబడుచుండి నట్లును గానవచ్చుచున్నది.[2]

---

1 ఆసాము

2 ఇండియన్ ఆంటిక్వేరి సం 34. పే 116.

న్యాయవిచారణ.

"హిందువులు సొమ్మును వడ్డీకిచ్చుటలేదు. అప్పు పుచ్చుకొనుటయు నెఱుంగరు. ఒరులకు గీడొనరించుటకాని, ఒరులవలన గీడొందుటకాని ప్రాచీనాచారమునకు విరుద్ధము. కావున సమ్మతి పత్రములుగాని తాకట్టులుగాని దొరకవు. ఒక వేళ ఋణమిచ్చియున్నను ధనము నిక్షేపించియున్నను, దానిని ఋణగ్రస్తుని వలనగాని, ధనగోప్తవలనగాని తిరిగి రాఁబట్టుటకు శాసన సాహాయ్యము లేదు. కావున ఋణదాతగాని, ధననిక్షేపి గాని విశ్వసించినవాఁడు మోసకాఁడయినయెడ, నందునకుఁ దన్నుదా దూఱులాడుకొనుటకంటె నితరోపాయమ్ముగానఁడు" అని మెగాస్తనీసు వ్రాసియున్నాఁడు. ఈ వాక్యములు స్థూల దృష్టితో వ్రాయఁబడిన వనియు వానివలన నప్పటి యమాయకస్థితి నిరూపింపఁబడు చున్నదనియు మాత్రము చెప్పవలసి యున్నది. పైనివర్ణితమయిన వ్యాపారాదుల పరిమాణమునుబట్టి చూచినను చాణక్యుని అర్థశాస్త్రమునుబట్టి చూచినను అక్కాల మున న్యాయస్థాన పరంపరయుఁ దదుచితచట్ట సముదాయం బును నుండెనని వ్యక్తమగుచున్నది.

ప్రతిగ్రామికుఁడును, అనఁగా గ్రామాధికారియు, గ్రామ వృద్ధులతోఁ డంగూడ ననఁగా గ్రామ పంచాయతితోఁ డం గూడ ప్రథమన్యాయస్థానంబై యలరారుచుండు. కొన్ని వ్యాయోగ ముల నీ న్యాయస్థానము వారికి సంపూర్ణాధికార ముండెడిది. దొంగలను దుర్మార్గులను గ్రామికుఁడు దన గ్రామమునుండి

పెడలఁగొట్టుటకును స్వతంత్రుఁడయి యుండెను. ఇతనిది మొదటి న్యాయస్థానము. రాజుగారిది ఉత్తమన్యాయస్థానము. ఈ రెంటికిని మధ్య స్థానము వహించి దేశమునందలి న్యాయ విచారణమంతయు నడుపు న్యాయస్థానములు పెక్కులుండెడివి. ధర్మస్థీయములనియు కంటకశోధనములనియు నవి రెండు తెఱంగులుగ విభజింపఁబడియుండె. ఈ విభాగమునకుఁ గారణము వ్యాయోగ విశేషంబె.

ధర్మస్థీయములు ఆఱుగురు న్యాయాధిపతుల సంఘములు. అందుముగ్గురు శాస్త్రాధ్యయన పారీణులై ధర్మస్థులు నాఁబరగుచుండ్రు. తక్కుంగల ముగ్గురును రాజుగారి యమాత్యులలోనివారు. వీరు లోకానుభవము గలవారగుటంజేసి శాస్త్రవేత్తలకు సహకారులయి న్యాయము దీర్చుచుందురు. ధర్మస్థీన్యాయ సంఘముల మ్రోల విచారింపఁబడు చుండిన విషయములు సర్వసాధారణములు. ప్రజలలో నొండొరులకుఁ గల సామాన్య సంబంధ విషయక వివాదములను స్వల్ప ప్రజా సంఘంబు లొండొంటికింగల సామాన్య సంబంధ విషయక వివాదములను ఈ ధర్మస్థీయములు దీర్చుచుండెడివి[1] వీనికి కొద్దిపాటి జరిమానాలు విధించుటకంటె నెక్కుడధికారము లేదు.

---

1 వ్యవహారస్థాపనలు, సమయవిచ్ఛేదాదులు, స్వామ్యాదికారభృత్యాది కారములు, దానకల్పనలు, ఋణములు, ఔపనిధికములు, విక్రీత క్రీతానుశయములు. దానములు, సాహసములు, దండపారుష్య వాక్పారుష్యములు, అస్వామి విక్రయములు, స్వస్వామిసంబంధములు, సీమావివాదములు, మర్యాదాస్థాపనములు, వాస్తుకములు, వాస్తువిక్రయములు. వివీతక్షేత్రపథ హింసాదికములు, బాధాబాధికములు. వివాహధర్మములు. వివాహసంయుక్తములు. స్త్రీధనకల్పనలు. సంభూయసముద్ధానములు. దాయవిభాగదాయక్రమములు మున్నగునవి ధర్మస్థీయములకు విషయములని అర్థశాస్త్రమున వర్ణింపఁబడినవి.

కంటకశోధన న్యాయసంఘముల మువ్వురు అమాత్యులు మువ్వురు ప్రదేష్టారులును అధికారులు. అమాత్యులు లోకానుభవాదులు గల మంత్రి వర్గంలోని వారని యిదివఱకే వ్రాయఁబడియె. స్థానికులయి విషయములను జక్కఁగ విమర్శించి కనుగొనుటకు యోగ్యత గల యధికారులు మువ్వురకును ప్రదేష్టారులని పేరు. వీరు ఏ యభియోగము వచ్చినను దానికి వలయు నుపక్రమ ప్రయత్నములను బరీక్షలను జేసి అమాత్యులకు సాయపడుచుండేవారు. రాజునకును రాజ్యమునకును సంబంధించిన నేరములును ప్రజోపద్రవ కరములగు నేరములును హత్యాత్యాది ఘన దోషములును బహుజన సంబంధకములును నీకంటక శోధనములకు విషయములు.[1] ఉరిశిక్ష నిచ్చుటకుఁ గూడ వీని కధికారము గలదు.

పై రెండు తెఱంగుల న్యాయసంఘములును సంగ్రహణములందును అనఁగా మన తాలూకా పట్టణమువంటి పట్టణములందును నాలుగునందల గ్రామములకు ముఖ్యపట్టణములగు ద్రోణముఖములందును 800 కు ముఖ్యములగు స్థానీయములందును ప్రతి జనపథసంధి యందును అనఁగా రెండు మూఁడు మండలముల పొలిమేరలు కలియు పట్టులందును నిర్ణీత కాలమున చేరి న్యాయము తీర్చుచుండెను.

---

1 కారకరక్షణము, వైదేహరక్షణము, ఉపనిపాతప్రతీకారము, గూఢాజీవులమండిరక్ష, ఉపకిశాక్షర్మాభిగ్రహము, ఆశు మృతక పరీక్ష, వాక్యకర్మానుయోగము, సర్వాధికరణ రక్షణము, కన్యాప్రకర్మము మున్నగునవి కంటక శోధనములకు విషయంబులని అర్థశాస్త్రము తెలుపుచున్నది.

ఈ న్యాయసంఘములకు ననుసరణీయమైన సాధనములు నాల్గు విధములు. మొదటిది ధర్మము. ఇది శాస్త్రచోదితము. వ్యాఖ్యానభేద మున్నపుడే దప్ప ఇది యనుల్లంఘనీయము. రెండవది వ్యవహారము. వ్యాజ్యేదారులు తత్పూర్వము చేసి కొనిన యొడంబడికలు మున్నగు నుపకరణములును సాక్షుల సాక్ష్యమును నిం దిమిడియున్నవి. మూఁడవది; చరిత్ర. అనఁగా ఆచారాదుల ననుసరించి యేర్పడిన తీర్మాన సముదాయము. నాల్గవది రాజ శాసనము. అనఁగా రాజులు పరంపరగ నేర్పఱచుచు వచ్చిన చట్టములు. ఇందు కడపటి మూఁడు సాధనములును వరుస క్రమమున బలవత్తమ బలవత్తర బల వంతములు. అయిన నిందెద్ది యయిన ధర్మ విరుద్ధముగాఁ గాని న్యాయ విరుద్ధముగాఁ గాని ఉండినచో ననుసరణీయము.

సర్వ జనులకును సామాన్యముగఁ దెలిసిన ఈ నాలుగు సాధనములుగాక న్యాయసంఘములకు మఱియొక సాధన ముండెడిది. అది వేగులవారి సమూహము. వారు దేశము నందలి ప్రతివిషయమును గనిపెట్టి రాజునకుఁ దెలియఁజేయు చుండుటేకాక యవసరమగు సంగతులను న్యాయ సంఘముల వారికిని తెలిపి న్యాయవిచారణకుఁ దోడ్పడ నేమింపఁబడిరి. కాని వారి వార్తలను మాత్రము న్యాయాధికారులు బహు జాగ్రత్తతోఁ బరీక్షింపుచుండిరి. ఇతరాధారము సంపూర్ణముగ నుండినపుడే తప్ప ఈ సాధన ముపయోగింపఁ గొనఁ బడు చుండ లేదు.

చంద్రగుప్తుని కాలపుం జట్టములు పరిపూర్ణత్వమున నిప్పటి చట్టములకుం దీసిపోవుట లేదు. భార్య మూర్ఖురాలయి నప్పుడు భర్త ఆమె నెంతవఱకుం బారుష్యముతోం జూడ వచ్చునో చెప్పి ఆమెను వెదురుబద్దతో నైనను త్రాటితో నైనను దన యఱచేత నైనను పురుషుండు మూండు దెబ్బల కంటె నెక్కుడు కొట్టినచో నేరస్థుండగునని వ్రాయంబడి యున్నది. దీనినిబట్టి మా సిద్ధాంతము నిశ్చయమనుట తెల్లము కావున విశేషమిట వ్రాయుట యనవసరము.

ఈతిబాధలు, వాని నివారణము

అతివృష్టి రనావృష్టిః శలభామూషకాః శుకాః
ప్రత్యాసన్నాశ్చ రాజానః షడేతా ఈతయః స్మృతాః॥

అని ఈతిబాధలు వర్ణింపంబడినవి. వీనినుండి ప్రజలను సంరక్షించి పరిపాలించినవాండె ధర్మము నెరవేర్చిన రాజని మన శాస్త్రకారుల మతము. మిడుతలు, ఎలుకలు, చిలుకలు మున్నగునవి వేంటలవలనను మందులవలనను ప్రాంతిక రాజులు యుద్ధమువలనను నివారింపంబడుదురు. చంద్రగుప్తుండీ రెండు సాధనములును సంపూర్ణముగం గలవాండని అతని చరిత్ర మొదటినుండి చదివినవారందఱకు విదితంబె. అక్కాలమున గృహములు సర్వసాధారణముగం గలపచేం గట్టంబడుచుండి నందున నతివృష్టి బాధయందొక యంశమునకుం బ్రతీకారము గానవచ్చు చున్నది. కాని యతివృష్టివలనను ననావృష్టివలనను గలుగు గొప్పబాధలు క్షామములును తత్ఫలంబుగ జాడ్యము

లును, ఇవిగాక పై శ్లోకమున నుడువంబడని మఱియొక దేశోపద్రవ కారణంబును గలదు. అది యగ్ని. ఈ మూఁడు బాధలను నివారించుటకుఁ దరతరములుగ నన్ని ప్రభుత్వముల వారును బాటుపడుచు వచ్చుచునే యున్నారు. చంద్రగుప్తుని కాలమున నతఁడెట్లు ప్రవర్తించినదియు నిట వివరించుట కర్తవ్యము.

మెగాస్తనీసు వ్రాఁతల ననుసరించి యక్కాలమున సర్వసాధారణముగ చంద్రగుప్తుని సామ్రాజ్యము సుభిక్షముగ నుండెననియే చెప్పవలసి యున్నది. కాని అర్థశాస్త్రమున దుర్భిక్షముల సంగతి తడవి తత్ప్రతీకార పద్ధతులు వ్రాయఁబడి యుండుటచే క్షామమేదో యొకప్పుడు తటస్థించినను దటస్థించి యుండవచ్చును.

కోష్ఠాగారాధ్యక్షుఁ[1]డను అధికారి యొక్కరుఁడుండును. అతఁడు రాజునకయి వసూలగు సర్వసస్యాదులును పోగుచేసి కాపాడెడువాఁడు. అట్లు పోగైన భోజన సామగ్రియందు రాజెప్పుడును సగపాలుకంటె నెక్కుడుపయోగింపరాదు. తక్కుంగల యర్థభాగంబును ప్రజల యవసరముల కొఱకు తీసి యుంచుచుండిరి. ధాన్యాదులు చెడిపోకుండుటకయి ప్రతి సంవత్సరమును అదివఱకుఁ జేరినరాసుల నితరులకిచ్చి క్రొత్త పంటల ఫలంబునుండి బదులుకొనుచుందురు. ఇట్లు సేకరింపఁ

1 కోష్ఠమనగా జీర్ణకోశము. దానినుండి దేహపోషణమునకు వలసిన వస్తువులని విశేషార్థము. అట్టి వస్తువులకొట్టుగావున కోష్ఠాగారము. అర్థశాస్త్రము. సం2 అ15

బడిన సామగ్రి గలవాఁడగుట క్షామకాలమున రాజు ప్రజలకు భోజనమునకును విత్తనములకును ధాన్యము పంచిపెట్టుచుండు వాఁడు. ధనవంతులగు పౌరులనుండియు ఇతరరాజులనుండియు ధనము సంపాదించి క్షామనివారణార్థ ముపయోగించు చుండు వాఁడు.

మన ప్రభుత్వము వారింబలె దుర్భిక్ష సమయములఁ జంద్రగుప్తుఁడు గొప్ప బాటలువేయించుట చెఱువులు కాలు వలు త్రవ్వించుట మొదలగు పనులు చేయించు చుండినట్లును తెలియవచ్చుచున్నది.

క్షామములు ప్రతిదిన ప్రవర్ధమానములుగాక ఎప్పుడో యొకప్పుడు తటస్థించుచుండినందునను తన యాదాయమున నర్ధభాగము దన్నివారణార్థము వినియోగించుటకు సార్వ భౌముఁడు సన్నద్ధుఁడయి యుండుటనుబట్టియు నక్కాలమునఁ బ్రజలు క్షామమనిన వెఱపు లేనివారయియే యుండియుందు రనిన నసత్యము గానేరదు.

జాడ్యముల నివారణార్థము చంద్రగుప్తుఁడు పూర్ణమగు నేర్పాటులఁ జేసియుండె ననుటకు సందేహములేదు. ఏనుఁగుల కును గుఱ్ఱములకును జికిత్సకుల నేర్పఱచినవాఁడు ఇక్కాలము నను అరుదుగ గన్పట్టు ధాత్రికలను సైన్యముల కమర్చిన వాఁడు నైన సార్వభౌమునకు ప్రజల యారోగ్యమునెడ దృష్టి నిలువకున్నె? మెగాస్తనీసు పాటలీపుత్ర పరిపాలనమునకు నేర్పడిన యాఱుపంచాయతులలో నన్యదేశీయులఁ గాపాడు పంచాయతిని గుఱించి వ్రాయుచు "జబ్బుగా నున్నవారికి వలయు నుపచారముల జాగరూకులయి యొనర్చుట" యుని

వ్రాసి యున్నాఁడు. దీనివలన నా పంచాయతికి లోఁబడి వైద్యులు తత్తదుచితోపకరణములం గొని సిద్ధముగ నుండు చుండిరని యర్థము. వారణాసియు తక్షశిలానగరంబును విద్యా పీఠములయి విలసిల్లి వైద్యశాస్త్ర ప్రవీణులను దేశమునకు సమ ర్పించు చుండెనని ఇదివఱకే వ్రాసియున్నాము. అలకసుంద రుఁడు (అలెగ్జాండరు) ఈ దేశముపై దండెత్తి వచ్చునెడ గ్రీకు దేశీయులగుఁ దన భిషజ్వరుల వెంటఁ గొనివచ్చెను. పాంచాలదేశమునం దతఁడుండ నాతని సైనికులకు పాము కాటులు తప్పినవిగావు. ఆ యపాయకరమగు నుపద్రవమునుండి గ్రీకువైద్యులు దమ వారిని రక్షించుకొను మార్గము గాన లేకుండిరి. అప్పుడు అలకసుందరుఁడు హైందవ వైద్యుల సాయము వేఁడ వారు తక్షణము వ్యాళవిషానలంబునుండి గ్రీకు లను దప్పించిరి. దానిచే నాతఁడు నిర్వైరగంది హైందవ వైద్యుల శక్తి సామర్థ్యంబుల మెచ్చి తన సైనికుల కపాయకర మగు ఋజలు సంభవించినపు డెల్లను మన వైద్యులకడకే పోవలసినదని యాజ్ఞాపించెను.[1] గ్రీకు చరిత్రకారుఁడు వ్రాసిన యీ వ్రాఁతను బట్టిచూడ గ్రీకు వైద్యులకంటె హైందవ వైద్యులే అకాలమున నెక్కుడు విజ్ఞానము గలవారయి యుండిరనుట విస్పష్టము.

చంద్రగుప్తునికాలమున భిషజులనియు, చికిత్సకులనియు జాంగలీవిదులనియు, సూతికాచికిత్సకులనియు వైద్యులు వారి వారి యభిమాన వైద్యశాఖను బట్టి పిలువంబడుచుండిరి.

---

1 అరయన్

భిషజులు సర్వవైద్యవిశారదులు. చికిత్సకులు సాధారణ వైద్యులు. జాంగలీవిదులు విషవైద్యులు. సూతికాచికిత్సకు లనువారు మంత్రసానులు. ధాత్రికలును సైన్యమువెంట నడచు రణవైద్యులును ఈ తరగతిలోఁ జేరినవారె.

మూఁడు మూలికల పేరు నెఱింగిన వారెల్లరును వైద్యులుగ నుండుటకు వీలుండినదిగాదు. ప్రభుత్వమువారి యనుమతి లేని దెవ్వరును వైద్యవృత్తి నవలంబింపరాదు.1 ఆ వృత్తియం దుండి అజాగరూకులయి మెలంగనురాదు. వైద్యునిలోపంబున రోగికి నపాయము గలిగినచో వైద్యుఁడు దండార్హుండయి యుండెను. అనుమానాస్పదంబగు మరణము తటస్థించినచో నీ యిరువదవ శతాబ్దంబునంబలె నప్పుడును శవమును పగులదీసి ఆనుమృతపరీక్ష (Post Mortem Examination) చేయుచుండెడివారు.

ఇట్టినియమములతో వైద్యులసిబ్బంది యుండినపు డెట్టి విశేషరుగ్మత వాటిల్లినను దగుసాయము గలుగుచుండెనని ప్రత్యేకించి వ్రాయుటయే పని లేదు. క్షామాదుల ఫలంబుగ జనించిన 'మారక' వ్యాధులను రూపుమాప నెల్లవైద్యులును దమ తమ మందు పొత్తులతో సిద్ధముగ నుండువారు వారితోడంగూడ ద్వైవ ప్రార్థనాదికములు సల్పి యాపదం బాపఁగల సాధుజనంబులును బరిశ్రమ చేయుచుందురు.

అగ్నిబాధ లేకుండఁ జేయుటకుఁ దగిన నిర్బంధములును బరికరములును నేర్పఱుపఁ బడియుండెను. వేసవి కాలమున

---

1 ఈ విషయమున శాసనము చేయుటకు మన ప్రభుత్వమువారిప్పుడిప్పుడు ప్రయత్నము చేయుచున్నారు.

గ్రామికజనంబులు అగ్నినార్పు పది యుపకరణంబుల (5. ఘటములు; 1. కుంభము; 1. ద్రోణము-అనగా తొట్టి; 1. నిచ్చెన; 1. గంద్రగొడ్డలి—ఇది దంతెలు దూలములు పడగొట్టుటకు; 1. తూరుపుబుట్ట-పొగను బారదోలుట కిది; 1. అంకుశము; 1. పటకారలజత; 1. తోలుసంచి) జూపుటొండె పచనాదికార్యముల నింటివెలుపలఁ జేసికొనుటొండె చేయవలసియుండెను.

ఎచ్చటనైన నగ్నిబాధ గలిగినయెడల నా ప్రాంతమునందలి గృహస్థులెల్లరును దమతమ యుపకరణములతో వెలువడి యా యగ్నిని చల్లారుపవలసి యుండెను. అట్లు చేయని వారికి శిక్షలు విధింపఁబడుచుండె.

పంచాయతులు

పురపరిపాలనాక్రమము లెటువంటివో పాటలిపుత్ర వర్ణనాధ్యాయమునందు విస్తరింపఁబడి యున్నవి. సైన్యవ్యవస్థ ప్రకరణమునఁ దత్పరిపాలనాక్రమము వివరింపఁబడి యున్నది. మొత్తముమీఁద తేటపడునంశ మెద్దియన్న సమస్తాంశములకును పంచాయతీ పరామర్శయను పద్ధతి ముఖ్యాధారముగ గ్రహింపఁబడి యుండుటే. పుర పరిపాలనమునకు ఆఱు పంచాయతులు, సైన్యనిర్వహణమునకు ఆఱు పంచాయతులు, శిల్పులు, వర్తకులు, కర్మకరులు మొదలుగాఁగల వృత్తికులముల విమర్శనమునకు ఆయా కులమున కాయాకులస్థుల పంచాయతులు, గ్రామ పాలనమునకు గ్రామ పంచాయతి యనుచు నిట్లు పంచాయతి పుంజముగా నున్నట్లు తేటపడును. కొన్ని పంచాయతులు రాజ నిర్ణితములును రాజ పురుష

నిర్ణితములును, తదితరములెల్ల జనసముదాయ నిర్మితములు. అత్యంత బలిష్ఠ రాజకార్యముల వినా తక్కిన వన్నియు జనని యుక్త పంచాయతులు. వీనియందును రాజపురుషులైన గ్రామ ప్రముఖులైన నధ్యక్షులుగ నుండిరి. కాఁబట్టి రాజభక్తికి విరోధము లేకుండను జనస్వాతంత్రమునకు లోపము లేకుండను కార్యములన్నియు నిర్వహింపంబడె. మఱియు పంచాయతి వారు తమ తీర్మానించు విషయములందు ప్రత్యక్ష జ్ఞానాను భవములుగల వారుగాను, వాది ప్రతివాది సాక్షుల పూర్వోత్త రముల తెలిసినవారుగాను, ఆయాజన సముదాయమునకు సత్యసాక్ష్యాదులయందు యశోమాన గణ్యతాబద్ధులుగాను ఉండుటంబట్టి వారి నిర్ణయములు న్యాయ్యములు గాను అంగీ కార్యములుగాను నుండె. వారు జనసముదాయ క్షేమాభి వృద్ధుల సహజ ప్రీతియుతులగుటం బట్టియు, తత్సముదాయ అవయవీభూతులు కావునను వివాద నిర్ణయంబులకు అనగత్య వ్యయంబుల కాస్పద ముండలేదు. కావున న్యాయనిర్ణయములు సులభసాధ్యములై యుండుచు జనులకు సుఖకరములై యుండె. ఇక్కాలమునందు బలెవ్యాజ్యములకుఁ గల కాలవిలంబములు కాని, పలు తెఱంగుల ద్రవ్యనష్టములుకాని, న్యాయవాదుల తల్లక్రిందుల పొరలింపులు కాని, న్యాయనిర్ణయ విపరీతములు కాని, వివాదుల యితర కార్యభంగములు కాని ఎంతమాత్ర ముండలేదని నమ్మవచ్చును. జనస్వాతంత్రతా బుద్ధియు పదే పదే వర్ధిల్లుచు ప్రజాగౌరవమును భద్రముగ సంరక్షింపంబడె. రాజక్షేమమును అభివృద్ధిఁ బొందె.

రాజు

ఇప్పగిది సర్వవిధములఁ బ్రజల సంరక్షయే ప్రథమ కర్తవ్యముగఁ జేయుచుండిన చంద్రగుప్తుని దినచర్యను గొంచెముగ నిట వర్ణింపవలసి యున్నది.

దినము ఎనిమిది భాగములుగను రాత్రి యెనిమిది భాగములుగను విభజింపఁబడి యుండెను. ఈ భాగములకు నాళికలని పేరు. దివసపు మొదటినాళిక రక్షకుల నేమించుట యందును లెక్కలఁ బరిశీలించుటయందును రాజు గడపుచుండును. తరువాత నొక్క నాళికకాలము అనఁగా రమారమి యిప్పటి 7-30 మొదలు 9 గంటల వఱకును ప్రజల మేలుకీడుల నరయుట యతనిపని. పిదప నాళికకాలము అతని భోజనాదులకును జదువునకును వినియోగింపఁబడుచుండె. నాల్గవ నాళిక యందతఁడు కరాది హిరణ్యాంబును గ్రహించుట యందును అధ్యక్షుల నియమించుట యందును వెచ్చించును. ఐదవనాళిక మంత్రివర్గముతో జరుగవలసిన ఉత్తర ప్రత్యుత్తరముల కేర్పడి యుండెను. ఆఱవనాళిక యాటపాటలకును వినోదములకును నియమితము. ఏడవ నాళికయందు నేనుఁగులను, గుఱ్ఱములను, రథములను, కాల్బలములను రాజు పరీక్షించును. ఎనిమిదవ నాళిక యుద్ధవిషయంబుల సేనాధ్యక్షునితోఁ బర్యాలోచించుట యందు గతించును. రాత్రియందలి ప్రథమనాళిక వేగులవారి వార్తలకును, రెండవది స్నానాదులకును, మూఁడవది మృదంగాదికముల సుస్వనములచే నిద్రనందుటకును, నాల్గవ ఐదవ నాళికలు నిద్రకును, ఆఱవది మంగళారావములకు మేల్కాంచి ధర్మముల మననము చేయుటకును, ఏడవది రాజ్య కార్యపద్ధతుల నిర్ణయించుకొని చారుల నియోగించుటకును,

ఎనిమిదవది ఆచార్యులను, గురువులను, జ్యోతిష్కులను, వైద్యులను జూచుటకును వారి యాశీర్వాదముల నందుటకును వినియోగింపఁ బడుచుండెను.

ఈ విధముగ రాజుయొక్క దినచర్య నిర్ణీతమయి యుండెను. విశేష కార్యము లున్నపుడు రాజీ కాలక్రమమును మార్చుకొనుచుండె ననుటకు సందేహము లేదుగాని సర్వ సాధారణముగ నియ్యది యతనిచే ననుసరింపఁబడుచుండెను.

"కార్యమున కెప్పుడును సిద్ధముగనుండుటయె రాజునకు వ్రతము. ధర్మమును జక్కఁగ నెరవేర్చుటయె యజ్ఞకర్మ. ఎల్లరయెడ సమభావమునఁ బ్రవర్తించుటయె యాతనికినవభృథ స్నానము."

"ప్రజలసౌఖ్యమే యతని సౌఖ్యము. వారి క్షేమమే యతని క్షేమము. తనకుఁ బ్రీతికరమగునది ప్రీతికరంబని యతఁడు తలఁపరాదు. ప్రజలకుఁ బ్రీతికరంబగునదియె నిశ్చయంబుగ ప్రీతికరంబని యతఁ డెన్నవలయు."

"రాజెల్లపుడును నప్రమత్తుఁడయి ధర్మములఁ దీర్పవలయును; అప్రమత్తతయె ఐశ్వర్యంబునకు మూలంబు. దాని వ్యతిరేకంబ దుఃఖమునకుఁ బునాది."

అను నీ సూత్రంబులు చంద్రగుప్తుని జీవయాత్రకు మూలాధారములు. కావుననే రాముఁడుంబలె

"తండ్రి క్రియఁ" జంద్రగుప్తుఁడు
"దండ్రుల మఱపించి ప్రజలఁ దారక్షింపన్
"దండ్రుల నందఱు మఱచిరి
"తండ్రిగదా" చంద్రగుప్త "ధరణీపుఁడనుచున్"

తొమ్మిదవ ప్రకరణము

కొన్ని యాచారములు

రజస్వలానంతర వివాహములు

చాణక్యుఁడు అర్థశాస్త్రమున శిక్షాస్మృతి వ్రాయుచు రజస్వలానంతర కన్యలయెడ ద్రోహబుద్ధి చూపువారలకొక విధమగు దండనను విధించుచున్నాడు. ఒక్కెడ కన్య రజస్వలయయి ఏడుమాసములు చెల్లినచో యామె కృపకుఁ బాత్రుడగుట తప్పుకాదని విధించుచున్నాడు. రజస్వల యయినపిదప మూఁడు సంవత్సరములు అవివాహితగ నుండు కన్యను సజాతిపురుషుఁడు అనుభవింపవచ్చును. మూఁడు సంవత్సరములకు పైఁబడియుండినయెడల తండ్రికిఁ జెందవలసిన విభూషణము లా కన్య స్వాధీనమున నుంచుకొనదేని ఆమెను విజాతీయుఁ డయినను అనుభవింపవచ్చును. శుద్ధచరిత్ర లేని కన్యయని కన్యాస్వీకారముచేసిన తరువాత బయల్పడినచో నట్టి కన్యను త్యజింపవచ్చునని మఱియొక్కెడ లిఖింపఁబడియున్నది. అట్టి సందర్భముల శుల్కమును స్త్రీధనంబును వరునకు ఇచ్చివేయవలసినదనియు కన్యాదాత జరిమానాకుఁ బాత్రుఁడు గావలసినదనియు శాసింపఁబడినది. శుల్కమును గుఱించి వ్రాయుచు నింకొకపట్టున చాణక్యుఁడు తల్లిదండ్రు లిరువును

పరలోకవాసులయి యుండు నెడ కన్యయే శుల్క[1] స్వీకారము చేయవచ్చునని నిర్ణయించుచున్నాఁడు. వ్యాఖ్యాన మవసరము లేకయే పై విషయములు చంద్రగుప్తుని కాలమున రజస్వలానంతర వివాహములు సాధారణములని చాటుచున్నవి. రజస్వలానంతర వివాహములు సాధారణమను సిద్ధాంతము తేలిన పిదప బాలురకుగాని బాలికలకుగాని "అతిబాల్య వివాహములు" నాఁబరగు ననుచిత శృంఖల బంధనము దటస్థించు చుండలేదని వేరుగ వ్రాయవలయునా ?

పునర్వివాహములు

"భార్యవలన పురుషునకు సజీవసంతానముగాని మగబిడ్డలుగాని కలుగకున్నను లేక సంతానమే లేకపోయినను అతఁడు మఱియొక్కర్తెను బెండ్లాడుటకు ఎనిమిది సంవత్సరములు ఆగవలెను. భార్య మృతశిశువును గనినచో పదేండ్లు వ్యవధి కావలెను. ఆమె యాఁడుబిడ్డలనే కనుచుండిన పండ్రెండు సంవత్సరములు చూడవలెను. తరువాత పుత్రులు గావలెనను

1. ఈ శుల్కము నిప్పటి కన్యాశుల్కముగదా యని యెంచఁబోకుఁడి. ఆ పత్కాలమున స్త్రీలకు ఉపయోగపడుటకయి వివాహసమయముల వరుఁడు ఇచ్చు ద్రవ్యరూపమగు ఆస్తికి శుల్కమని పేరు. ఆభరణరూపముగ నొసంగు ఆస్తికిని వృత్తిరూపముగనిచ్చు ఆస్తికిని స్త్రీధనమని పేరు. శుల్కమునకును స్త్రీధనమునకును భార్య సంపూర్ణస్వతంత్రురాలు. దుర్భిక్షములను, దానధర్మములకును, రోగనివారణార్థమును, ఆపత్సమయములను నీ శుల్కమును స్త్రీధనమును వినియోగించుకొనుటకుఁ గొంతవఱకు భర్తకునుగూడ స్వాతంత్ర్యముండెడిది. ఇప్పటి శుల్కచ్ఛాయయు నచ్చటచ్చటఁ గానవచ్చునదిగాని ఈ విషయ మింకను శోధనీయము.

వాంఛపోడమినచో నతఁడు మఱియొక స్త్రీని వివాహ మాడ వచ్చును. ఈ నియమములను దిరస్కరించువాఁడు భార్యకు స్త్రీధనమును శుల్కమును ఇచ్చివేసి ఇంకను నధికముగ ధనము నిచ్చి ప్రభుత్వమువారికిఁ గొంత జరిమానా ఇచ్చుకొనవలెను. వివాహకాలమున శుల్కాదుల స్వీకరింపనివారికిఁ గూడ నీ విధముగా శుల్కాదుల నిచ్చి తగురీతిని వృత్తిని కలిగించి పురుషుడు పుత్రకాముడై ఎందఱ స్త్రీలనైనను వివాహము చేసికొనవచ్చును. "స్త్రీలు పుత్రులఁ బడయుటకు సృష్టితులు" అను వాక్యము లర్థశాస్త్రమునఁ గానవచ్చుటవలనఁ జంద్రగుప్త చక్రవర్తి కాలమున బురుషుఁడెందఱ భార్యలనైనను పెండ్లాడుటకు స్వాతంత్రము గలవాఁడై యుండెనని విశదమగుచున్నది.

ఇఁక స్త్రీ పునర్వివాహములను యోజించిన

"భర్తగతించినవెనుక భార్య ధర్మకామయయి జీవింపనెంచుకొనినచో యీమె స్త్రీధనమును శుల్కమును ఆమెకిచ్చివేయవలసినది. పేరునకుమాత్ర మాయమకిచ్చియుండి నిశ్చయముగ నయ్యవి యీమె స్వాధీనమున నుండనియెడల నవ్వాని గొవడ్డితోడఁగూడ నవి చెల్లింపఁబడవలెను.

"ఆమె కుటుంబకామయయి పునర్వివాహము ఆశించెనేని ఆయమకు భర్తగాని మామగాని ఇచ్చియుండిన సొమ్ము ఈయఁబడవలయును." అనియు

"భర్త హ్రస్వప్రవాసమునకుఁ బోయియుండిన యెడల బహ్మక్షత్రియవైశ్యశూద్ర స్త్రీలు అతనికయి యొక్క సంవ

త్సరము వేచియుండవలయును. సంతానము గలవారయిన పక్ష మున సంవత్సరమునకంటె నెక్కుడు వేచియుండవలెను. భోజ నాదులకు వసతులున్న యెడల రెండింతల కాలము వియోగము భరింపవలెను. భుక్తికి జరుగని స్త్రీలను జ్ఞాతులు నాలుగు లేక ఎనిమిది సంవత్సరములు సంరక్షింపవలెను. పిదప వివాహకాల మున వారికి దత్తము చేయఁబడిన ఆస్తినిచ్చి పునర్వివాహము చేసికొన నియ్యవలెను.

"భర్త బ్రాహ్మణుఁడయి అధ్యయనార్థము దేశాంత రస్థుఁడయియున్న సంతానరహితయగు స్త్రీ పదిసంవత్సరము లతనికయి వేచియుండవలయును. సంతానవతి యయిన యువతి పండ్రెండు సంవత్సరములు గడుపవలయును.

"భర్త క్షత్రియుఁ డయినచో భార్య ప్రాణమున్నంత కాలము వేచి యుండవలయును. కాని వంశ విచ్ఛిన్నమును దొలఁగించుట కొఱకు సవర్ణుఁడగు ద్వితీయభర్తను స్వీకరించి నను నపవాదము నందదు"

"భర్త దీర్ఘ ప్రవాసమునకు వెడలినను, సన్యాసియయి నను, మృత్యువునందినను సంతానపరిహీతయగు భార్య ఏడు మాసములు వేచియుండవలెను. సంతానసమేతయైన పక్షమున నొక్క సంవత్సరము వేచి యుండవలెను. ఈ కాలపరిమితి దాఁటిన పిదప స్త్రీ తనభర్త కనిష్ఠసోదరుని లేకున్న తనభర్త గోత్రములోనివానిని పునరుద్వాహమున స్వీకరింపవచ్చును."

అని అర్థశాస్త్రము వక్కాణించుటం బట్టి పురుషులకుం బలె స్త్రీలకును చంద్రగుప్తుని కాలమున పునర్వివాహ విషయమున స్వాతంత్ర్య ముండెనని తెల్లమగుచున్నది.

దాంపత్యవిమోచనము.

చంద్రగుప్తుని కాలమున మనమిప్పుడు మనదేశమున వినని యొక యాచార ముండెడిది. ఆ యాచారము దాంపత్య విమోచనము. భార్యాభర్తలు పరస్పరము స్నేహభావము కుదుర్చుకొనలేనిచో విధ్యుక్తముగ జరిగిన వివాహంబైనను నిర్బంధము గాదనుట యీ యాచారముయొక్క ముఖ్య ప్రయోజనము. ఇట్టి యాచార మిప్పుడు విశేషముగం బాశ్చాత్య దేశములయందు ప్రబలియున్నది. అమెరికారాష్ట్రమునందు మితిమీరిపోయి యున్నది. చీటికి మాటికి భార్యాభర్తలు న్యాయస్థానములకెక్కి యొకరిపై నొకరు అభియోగములను దెచ్చి వివాహ బంధమును త్రెంచుచున్నారు. ఇట్టి యనర్థముల కాకరమగు నీ యాచారము పలువురచే ఖండింపం బడుచున్నది. అయిన నిది చంద్రగుప్తుని కాలమున నేపగిది వ్యవహారము నందుండెనో కనుంగొనిన యెడల విభేదము తేటపడం గలదు.

భర్తపై విద్వేషముగలిగిన స్త్రీ ఏడుమాసముల కాలము అలంకారాదుల పొంతంబోక కాలము గడుపవలెను. తరువాతం దనకు భర్తయిచ్చిన నగలను శుల్కమును సంపూర్ణముగ నాతని స్వాధీనముచేసి అతనికి మఱియొక భార్యను స్వీకరింప

ననుమతినియ్యవలెను. భర్త భార్యపై విద్వేషము కలవాఁడయి నచో భార్యను భిక్షుకుల[1] గృహములనో బంధువుల యింటనో పోషకులయింటనో శరణమంద ననుజ్ఞ నీవలెను. పురుషుఁడు తన భార్యపై అన్యాయముగ నేరముమోపి ప్రత్యక్షసాక్షులచేఁ గాని నిర్ధారణ కాఁజాలని దుష్కార్యముల నామె కారోపించిన యెడల నతఁడు పంద్రెండు పణములు అపరాధము నిచ్చుకొను చుండెను. భార్య భర్తయందు విద్వేషము కలదైనను అతని యిష్టములేక వివాహబంధ వినిర్ముక్త కాఁజాలదు. ఇదే విధముగ భర్తయు భార్య కిష్టములేనిచో వివాహ బంధమును త్రెంచుకొనఁగూడదు. కాని పరస్పర విద్వేషముండిన యెడల దాంపత్యవిమోచనము కల్పించుకొనవచ్చును. భర్త భార్య వలన అపాయము కొఁగునని భయమంది ఆభయాతిశయంబుచే విమోచనము గోరుపక్షమున నాయమకు చెందవలసిన సర్వస్వ మును నతఁడిచ్చివేయవలెను. భార్య భర్తవలన అపాయమునకు జడిసి ఆ యపాయమునుండి తప్పించుకొనుటకు విమోచనమును ఆశించినచో నామె యేవిధమగు ధనమునకు గాని ఆ స్త్రీకిగాని హక్కుగలది కాదు.

ఈ దాంపత్య విమోచనాచారము మొదటి నాలుగు తెఱఁగుల వివాహములకును నిషేధింపఁబడియున్నది. బ్రాహ్మము ప్రాజాపత్యము, ఆర్షము, దైవము అనునియ్యవి ఆ నాలుగు తెఱఁగులు. సాలంకార కన్యాదానమునకు బ్రాహ్మమని పేరు[2]

---

1. వైరాగ్యవంతులగు స్త్రీలు.
2. బ్రాహ్మోవివాహ ఆహూయదీయతే శక్త్యలంకృతా (యాజ్ఞవల్క్య1-58)

శుల్కాది విరహితంబుగఁ గన్యాదానం బొనర్చుట ప్రాజాపత్యము నాఁబరగు[1]. ఒకటిలేక రెండుజతల యావులం గొని కన్యనిచ్చుట ఆర్షమనంబడు[2] యజ్ఞమున ఋత్విక్కునకుఁ గన్యాదానము సేయుట దైవము[3] అనంబడియెడి. రజస్వలానంతర వివాహములు సామాన్యములయి యుండినందున నీ నాలుగు విధముల యుద్వాహములయందును కన్యకకు కన్యయొక్క తలిదండ్రులకును వారివారి స్వాతంత్ర్యంబుల నుపయోగించుకొని తమలోఁ దామాలోచించుకొని వధూవరులకు సౌఖ్యావహంబగు విధంబున వివాహములు నడుప వీలుండెను. ఈవివాహము లిట్లు ఆలోచితములయి లోభాదిదుర్గుణవ్యాపార విదూరంబులగుటచేత వీని విషయమున విమోచన విధులు అనావశ్యకము లయ్యెను. తక్కంగల వివాహము లన్ననో చూదుఁడు.

గాంధర్వము : యియ్యది కన్యాపురుషు లొండొరులను జూచుకొనినంత మాత్రనఁ బెండ్లిచేసికొనుట.[4] ఇట్టి వివాహము భ్రమ కాకరంబుగదా. వినికిడి మాటలవలనను ఆకస్మిక దర్శనము వలనను ఒక్కరినొక్కరు ప్రేమించిన నా ప్రేమ కొన్ని సందర్భములఁ గ్రమక్రమముగ క్షీణించి దాని స్థానమున

1. “ సహోభౌచరతాంధర్మమితి వాచానుభాష్యచ కన్యాప్రదా
నమభ్యర్చ్యం ప్రాజాపత్యో విధిఃస్మృతః ” మనుస్మృతి 3-30.
2. ఆదాయార్షస్తు గోద్వయం—యాజ్ఞవల్క్య 1-59.
3. యజ్ఞ స్య ఋత్విజేదైవః— ” ”
4. గాంధర్వః సమయాన్మిథః—యాజ్ఞవల్క్య 1-61.

నసహ్యాత నా దేశంబగుట సర్వజనవిదితము. అట్టి సందర్భముల బంధవిమోచనమునకు మార్గము లేకపోయిన ననర్థములు వాటిల్లును గదా !

ఆసురము:[1] ఈ తెగ పెండ్లిండ్లు నేఁటికిని మనదేశమునఁ గానవచ్చుచు మన సంఘాభివృద్ధికి వేరుపురుపులై పరిణమించు చున్నవి. ధనాశాపిశాచము పీడింపఁ గన్యాశుల్కము పుచ్చుకొని తలిదండ్రులు మాంసవిక్రయ మనిదైన వెనుదీయక తాము గడుపార కన్న బిడ్డలను అమ్మివేయుటను మన ధర్మకర్తలు ఒక విధమగు వివాహముగ వర్ణింపక తప్పనందుల కెంతయుఁ జింతిల్లవలసి యున్నది. అయిన వారిడిన పేరు మాత్రము ఈ వివాహముల నెంతవఱకు ఖండింపవలెనో యంత వఱకును ఖండించుచున్నది. ఇట్లు దుష్టమగు వివాహంబు గావున దీనికి విమోచనం బవసరమని వేఱుగఁ జెప్పఁబని లేదు. కులగోత్రములను స్థితిగతులను రూపారూపంబులను ఆరోగ్యానారోగ్యంబులను యౌవన వృద్ధాప్యంబులను యోగ్యతాయోగ్యతలను విచారింపక భర్తను గట్టిపెట్టిన నాతఁడు దుర్మార్గుఁడో షండుఁడో యైన భార్య యేమిచేయవలయును ? అతనిం బరిత్యజింప వలసినదే గదా ! ఈ కన్యాశుల్కాచారపు దుష్ఫలంబులను మాన్పుటకు నిప్పుడు మనదేశంబున దాంపత్య విమోచన స్మృతియొండు చంద్రగుప్తుని కాలంబునందువలెఁ గల్పించిన శ్రేయోదాయకం బగునని తోఁచెడిని.

---

1. ఆసురో ద్రవిణాదానాత్ యాజ్ఞవల్క్య 1—61
మనుస్మృతి 3—33

రాక్షసము: యుద్ధమునందు కన్యయొక్క బంధువుల నోడించి కన్య నెత్తుకొని పోవుటకు రాక్షసమని పేరు.[1] రుక్మిణీ కృష్ణుల వివాహ మీ తెఱంగుది. పూర్వము ఈ విధమగు వివాహములయందు కన్యాపురుషులకుఁ బరస్పరానురాగము విస్పష్టముగఁ గానఁబడుచున్నది. అది యుండినను గాంధర్వ వివాహముతో నిదియును సామ్యముకలదియే కాన దీనను భ్రమాదుల కాస్పదంబుగలదు. ఒకవేళ నిందు కన్యక కనురాగము లేకుండుటయుఁ దటస్థింపవచ్చును. అప్పుడిది గాంధర్వాంబున కంటె దూష్యంబయ్యెడు. కావున నిద్దానికిం గూడ విమోచనస్మృతి.

పైశాచము: ఇది వివాహములయం దధమము. కన్య కిష్టములేకయే ఆమె నిదురించుచుండఁగనో మైమఱచి యుండఁగనో మనోవికలత్వమంది యుండఁగనో ఆమెపై బడి వరుఁడు ఆమెను లోఁబఱచుకొనుట పైశాచ మనంబరగు. ఇద్దానిని వివాహవిధులలో మన ధర్మకర్త లేల చేర్చిరో తెలియ రాకున్నది.[2] ఈ బంధమునకు విమోచన మవసర మని వేరుగ వ్రాయవలెనా? వట్టి విమోచన మొక్కటియేగాక కామాంధకార సంజనితదుశ్చేష్టాలంకృతుండయి ఈ విధమగు వివాహంబు నాశించువరునకు నుచితంబగుఁ గఠిన శిక్షాస్మృతియుం

1. రాక్షసోయుద్ధహరణాత్ : యాజ్ఞవల్క్య 1—61
మనుస్మృతి 3 — 33
2. సుప్తాం మత్తాం ప్రమత్తాం హరహోయత్రోపగచ్ఛతి
సపాపిష్ఠోవివాహానాం పైశాచశ్చాష్టమో అధమః మనుస్మృతి 3—34

కూడ యత్యంతావశ్యకంబె. అయిన చంద్రగుప్తుని కాలంబున నా శిశుసంస్మృతి మాత్రముండినట్లు గానరాదు.

ఎనిమిది విధముల వివాహములను జర్చించి పైనివ్రాసిన విషయములు వ్రాసిన పిదప చంద్రగుప్తుని కాలమునఁ బ్రచారమునం దుండిన దాంపత్యవిమోచన చట్టముయొక్క లాభా లాభము లిట్టివని మా చదువరులకుఁ బ్రత్యేకించి నివేదించుకొనఁ బనిలేదు.

చంద్రగుప్తుని కాలమున మఱియొక చిత్రము కలదు. ఆస్తి విభాగములు చేసికొనుటకు హక్కుదారు లెల్లరును యుక్తవయస్కు లయియే యుండవలెను. యుక్తవయస్కులు గాని హక్కుదారులుండి వారికి యుక్తవయస్సు రాకముందే విభాగములుగ తీర్మానము చేయఁబడినచో వారికి అప్పులతో సంబంధము లేకుండెను. ఆస్తికి మాత్రము వారు హక్కుదారులే గాని అప్పులకు వారు ఉత్తరవాదులు గారఁట! 1

1. అర్థశాస్త్రము పు. 3. అ. 5.

పదియవ ప్రకరణము

చంద్రగుప్తుని సమకాలీనులు

చరిత్రయందు మహాపురుషు లెప్పుడును నొంటిగఁ దోఁచుటలేదు. పరిస్థితి పరిపక్వము కుదిరినంగాని మహాపురుషు లవతరించుట యరుదు. కాన లోకచరిత్రమున సుప్రసిద్ధములగు పట్టుల నెటఁ బరిశీలించినను కార్యనిర్వాహణ ధురంధరులు సమాజములు కల్పించుకొని విచ్చేసిరో నాఁబరఁగుచుండ్రు. చంద్రగుప్త చక్రవర్తికాలము నిట్టిదియే. చంద్రగుప్తుని గంటికి రెప్పవోలె కాచి యాతనికి రాజ్యమును సంపాదించిపెట్టిన చాణక్యుండును, ఆ చాణక్యునకుఁ బ్రశంసనీయుండగు విరోధియయి పరఁగిన రాక్షసుండును, చంద్రగుప్తుఁ డడవుల నిడుమలు గుడుచుచుండ లోకమునంతయు నేకచ్ఛత్రముక్రిందికి జేఁ బ్రయత్నించిన సుప్రసిద్ధ వీరుండగు నలెగ్జాండరును, అలెగ్జాండరునకుఁ దరువాత నాతని కార్యమును గొంతదీర్చి యంతటి వాఁడని పొగడ్తఁగని చంద్రగుప్త చక్రవర్తి రాజ్యము నపహరింపనెంచి యాతనిచే పరాజితుఁడయి తనబిడ్డ నాతనికిచ్చి సంధిచేసికొనిన శెల్యూకసును, శెల్యూకసుచే నిర్ణీతుఁడయి చంద్రగుప్తుని యాస్థానమున రాయబారిగ

నుండి తన దినచర్య గ్రంథముచే నిప్పుడు హిందూదేశ పూర్వ చరిత్ర లేఖనమునకు నాధారభూతుఁడయిన మెగాస్తనీసును మనకు సంస్మరణీయులు. వీరిచరిత్ర దొఱకినంత వఱకు సంక్షిప్తముగ నీ క్రిందఁ బొందుపఱచుచున్నారము.

చాణక్య చరిత్రము

శ్రీమద్రామాయణమునందు అయోధ్యాపురిని దశరథ సుమంత్రులను, కిష్కింధాపురిని సుగ్రీవ హనుమంతులను భారతమునందు ధృతరాష్ట్ర విదురులను, కృష్ణార్జునులను చేర్చి చేర్చి తలఁచుట యెంత ప్రకటమో, అటువలెనే ముద్రారాక్షసమును చదువువారలకు చాణక్య చంద్రగుప్తులను నంద రాక్షసులను ఏకకాలముతో స్మరించుట సహజము. మఱియు నా చదువరులు చాణక్యవాక్యములను చాణక్య చేష్టితములను పరికించుతఱి, విశ్వామిత్రుని కోపసాహస సామర్థ్యములను, భీష్ముని నీతి ప్రవీణతను, కృష్ణుని శత్రుసంహారమును కపట సూత్రధారిత్వమును, హనుమంతుని స్వామికార్య ధురంధరత్వ మును, హనుమద్భీష్ముల బ్రహ్మచర్యనిష్ఠను స్మరింపక మానరు.

విష్ణుపురాణములోను మత్స్య వాయు భాగవత పురాణములందును, బృహత్కథయందును చాణక్యుఁడు ప్రశంసింపఁ బడియున్నాఁడు. కామందకములో "ప్రతిగ్రహము చేయ నదియు విశాలమునైనదియు నగు ఋషివంశములలో పుట్టిన యశస్వి, అగ్నిసమ తేజుఁడు, వేదవిద్వరుఁడు, నాల్గువేదములను ఒక్క వేదము వలెనే అధ్యయనము చేసినవాఁడు, ప్రజ్వలన

తేజుఁడు, అభిచారవజ్రముతో నందపర్వతమును వేరుతో పడ కొట్టిన భూసురుఁడు, శక్తిధరసముఁడు, మంత్రశక్తితో నేకాకిగ కార్యకరణశక్తుఁడు, చంద్రగుప్తునకు ఈ మేదినిని సంపాదించి యిచ్చినవాఁడు, అర్థశాస్త్ర మహాసముద్రమునుండి నీతిశాస్త్రామృతమును చిలికి యెత్తినవాఁడు నైన విష్ణుగుప్తునకు నమస్కరించెదను "[1] అని యున్నది.

రాక్షసుఁడు చాణక్యసన్నిధి చేరినపుడు, "ఇతఁడుగదా దురాత్ముఁడు లేక మహాత్ముఁడు కౌటిల్యుఁడు ! సముద్రము రత్నములకెల్ల బొక్క-సమయినయట్లు సర్వశాస్త్రములకును శరణ్యుఁడైన వాఁడు. వీనియందు మాత్సర్యవశమున గదా ఈతని గుణములకు సంతోషింపక యున్నారము!"[2] అనుచు పాండిత్యస్తవమును జేసియున్నాఁడు. దశకుమారచరితము,

---

1. వంశేవిశాలవంశానా మృషీణామివభూయసాం ।
అప్రతిగ్రాహకాణాంయో బభూవభువిశ్రుతః ॥
జాతవేదా ఇవార్చిష్మా న్వేదాన్వేదవిదాంవరః ।
యోఽధీతవాన్సుచతుర శ్చతురోఽప్యేకవేదవత్ ॥
యస్యాభిచారవజ్రేణ వజ్రజ్వలనతేజసః ।
పపాతమూలతశ్శ్రీమా న్సుపర్వానందపర్వతః ॥
ఏకాకీమంత్రశక్త్యాయః శక్త్యాశక్తిధరోపమః ।
ఆజహారనృచంద్రాయ చంద్రగుప్తాయమేదినీమ్ ॥
నీతిశాస్త్రామృతంధీమా నర్థశాస్త్రమహోదధేః ।
యఉద్దధ్రేనమస్తస్మై విష్ణుగుప్తాయవేధసే ॥

2. కరః సర్వశాస్త్రాణాం రత్నానా మివసాగరః ।
గుణైర్నపరితుష్యామో యస్యమత్సరిణోవయమ్ ॥

పంచతంత్రము, కాదంబరి, చణ్డకౌశికము, బృహత్కథ, హితోపదేశము, విక్రమార్కచరిత్రము మున్నగు గ్రంథముల యందు సమస్తరాజ నీతిశాస్త్రములకును చాణక్యుఁడు గొప్ప ప్రమాణముగ నంగీకరింపఁబడి యున్నాఁడు.[1]

ముద్రారాక్షసమునందు ప్రబలపాత్రముగఁ బ్రజ్వలించుచు, పరిస్ఫుటబుద్ధిని, ఆత్మవిశ్వాసమును, యుక్తితంత్రజ్ఞతను, నిరంకుశ నీతిశాస్త్ర ప్రావీణ్యమును, దూరదర్శనమును,

1. నీతిశాస్త్రము మనదేశమునందు మొట్టమొదట నుత్పన్నమయినది. సంస్కృత గ్రంథావళియం దత్యంత ప్రాచీనమయినది. చాణక్యుని నీతిసారము స్వజాతీయశాస్త్రము లన్నిటిలోను అత్యంత బహుజనాదృత మయినది.

ఇటీవల రెండుమూఁడు సంవత్సరములక్రిందట మైసూరు రివ్యూనందు మ-రా-రా-శ్రీ. ఆర్. శ్యామశాస్త్రిఐగారు, బి. ఎ. చాణక్యకృత అర్థశాస్త్రము నందు ఒకభాగమును ఇంగ్లీషునందు భాషాంతరీకరించుచు వచ్చిరి. ఇయ్యది ప్రాచీన గ్రంథ ప్రతిగా ననేక పండితులచే నంగీకరింపఁబడి యున్నది. చాణక్య రచిత శాస్త్రములును అందు రూపముగ నతఁడు పడసిన బిరుదులును ఈ దిగువ శ్లోకమునందు గూర్చియున్నవి.

వాత్స్యాయ నోమల్లనాగః కౌటిల్యశ్చణకాత్మజః ।
ద్రావిళః పక్షిలస్వామి విష్ణుగుప్తశ్చాంగులశ్చసః ॥

ఇందు పక్షిలనామమున అతఁడు నైయ్యాయికుఁడనియు, కౌటిల్య పేర రాజతంత్రజ్ఞుఁడనియు, జ్యోతిశాస్త్రమునందు విష్ణుగుప్తుఁడనియు. కామసూత్రముల యందు వాత్స్యాయనుం డనియు నీతి శాస్త్రమునందు చాణక్యుఁడనియుఁ బ్రసిద్ధిఁ గాంచియున్నాఁడు. మల్లనాగనామము అతని యుద్ధవీరత్వమును, ద్రావిళనామము రణరంగ ప్రాముఖ్యతను ప్రకటించుచున్నవి. అంగుళ నామము గణితశాస్త్ర నిపుణతను తెలిపెడిని కాఁబోలు. పాఠాంతరము త్రికాండ శేషమునందు అంసుళ అని యున్నందున విశాలభుజుఁడు దృఢగాత్రుఁడని సూచించుచున్నది.

నిర్ణీత ఫలప్రాప్తికి వలసిన సర్వోద్యమ పరత్వమును చాణక్యుఁడు వెల్లడిసేయుచున్నాఁడు. ఈ నాటకమునందలి సర్వకార్య వ్యవసాయమును చాణక్యునిదిగనే ద్యోతకపడుచున్నది.

ఇతఁడు "విఘ్నైర్ముహుర్ముహురపి హన్యమానాః ప్రారబ్ధముత్తమగుణా నపరిత్యజన్తి," 1 అను శ్లోకమునకు దృష్టాంతరూపుఁడన్నను సరిపోదు. విఘ్నముల ఘాయములైనను పొడఁగట్టనట్టులు భూతభవిష్యద్వర్తమానములను గణితశాస్త్రజ్ఞుల సునిశ్చితతో సమాసపఱచి, యుపక్రమించిన యత్నములను పూర్వనిర్ణీత యుపసంహారములకు కొనసాగించుచు ఆయా దేశములలో నాయా కాలములలో అస్ఖలిత జయులై సంచరించిన మహాత్ములలో నొకఁడు. గ్రీకులలో అలెగ్జాండరు, రోమనులలో సీజరు, ఫినిషియనులలో హానిబలు, యూరోపియనులలో నెపోలియను, అమెరికనులలో వాషింగుటను చరిత్రములు, జదివిన వారల కెట్టి యుత్సాహము పుట్టఁగలదో యట్టియుత్సాహము చాణక్య చంద్రగుప్తుల చరిత్రము జదివినవారికిఁ బుట్టకమానదు. అలక సుందరాంగులకైన కొన్నికొన్ని యుపజయములు, చిత్తక్లేశములు కలవు. కాని ఈ చాణక్యునకు మాత్రమది యేమియులేదు. "వృషలుని కల్పనాయాసమును నాయొక్క మతి జాగరూకతయు" నని చాణక్యవచనమున

1 శా. ఆరంభింపరు నీచమానవులు విఘ్నాయాస సంత్రస్తులై
యారంభించి పరిత్యజింతు రురువిఘ్నాయత్తులై మధ్యముల్
ధీరుల్ విఘ్నవిహన్యమాను లగుచున్ ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థము లుజ్జగింపరుసుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్.

చదువరులు తడయు గల్గుచున్నది. కాని, సమస్త విషయము లును అతఁడు అనాయాసముగనే నిర్వహించు నట్లులు ఒక్క యుదంతము వెనుక మఱియొక్కటి అనాలస్యముగ వచ్చుటం బట్టి కార్య ప్రవాహమునందు వేవేగముగ అందఱిని లాగికొని పోవునట్లును తోఁచుచున్నది.

ప్రతిజ్ఞాభంగకారి గాఁగల దయా దాక్షిణ్యముల కెడ మియ్యక, అప్రతిగ్రహణ వ్రతంబును మఱపింపఁగల రాజకీ యాభిమానాడంబరకాంక్షలఁ గలనైనను తలఁపక, జీర్ణకుడ్యపు పర్ణశాలయందు త్రేతాగ్ని సంరక్షణావిహిత కర్మల పరిపా లించుకొనుచు బ్రాహ్మణ వృత్తిపరుఁడై రాజనీతి ధురంధరత యందు తన్నెతియు క్తమార్గము నవలంబించుచు, బ్రాహ్మణ క్షాత్రధర్మముల సమ్మేళన పఱచికొని, చాణక్యుఁడు శాంతాశ్వ ఉగ్రాశ్వములఁ బూన్చిన శకటంబుం బ్రోలు సారథివలెఁ బ్రవర్తించె. "ఇక్కాలమందును బ్రాహ్మణాది జాతిజన్యులు స్వస్వధర్మముల పరిపాలించుకొనుటకు వీలులేక, ఆ ధర్మ ములు శాస్త్రములయందు మాత్రము సుస్థిరములై నెలకొని యుండఁగ, దినదినానుభవమునందు మిశ్రాచారపరులై యుండఁ జూడమె? నిత్యకర్మానుష్ఠానములు త్రేతాగ్నిహోత్రక్రియలు గ్రామవాసములలో సహితము అంతర్ధానములైనవి గదా?" యందురే? మహమ్మదీయ ప్రభుత్వమునందు శ్రుతిస్మృతుల యదార్థానుష్ఠానము లెట్లుండెనో తచ్చరిత్రకారులు చెప్ప గలరు. తత్పూర్వమునందున చాణక్యుఁడు ఇప్పటి వారింబలె

వేషధారి బ్రాహ్మణుడనుట బొత్తిగ ననాదరణీయము. వారి నిష్ఠ లెల్లయు బౌద్ధజైనుల వ్యాప్తిని ఆటంకపఱుచుటకు చాణక్య ప్రభృతులైన బ్రాహ్మణులు పన్నిన కుట్రయని ముద్రా మంజూషమునందు చాణక్య వాక్యాలముగ చెప్పఁబడియున్నది. కొందఱు పశ్చిమఖండపు పండితులు సిట్లే యూహించిరి. కాని ఇయ్యది శంకనీయమని తెలాంగుగారి యభిప్రాయము. నాల్గవ శతాబ్దమునందు బౌద్ధనిగ్రహము చేసినట్లు తెలిసెడి గుప్త వంశపు రాజుల చెయిదమును చాణక్యునిపై నారోపించిరేమో! బౌద్ధనిగ్రహకథకు చోటియ్యక మెగాస్తనీసు దినచర్య వారిని గుఱించిన ప్రశంసయే చేయకున్నది. కావున బౌద్ధ జైనుల యాధిక్యతకు అశోకవర్ధనుని కాలమే మొదలని యూహింపవలసి యున్నది. అథవా బౌద్ధులవంటి వారిని నిగ్రహించుటకు వారిని మించిన సుశీలతానుష్ఠానము యుక్త మార్గముకాని కేవల రాజస తామస భూయిష్ఠమైన రాజ ద్రోహాది కార్యముల వంటిదికాదని జ్ఞప్తి నుంపవలసియున్నది. మనము నిర్ణయింపగలదెల్ల నేమనఁగ, చాణక్యుని యభిప్రాయము స్వధర్మవును రక్షించుకొనవలసినది; క్షత్రియ కృత్యములలో ఫలసంప్రాప్తికిఁ గావలసిన మార్గ మేదైనను నీతియుక్తమె యగు. రాక్షసుఁడు చంద్రగుప్త నాశనమునకై చేసిన కూట ప్రయత్నములును అటువంటివిగనే యున్నవి. కావున ఆకాలపు రాజామాత్య కులములవారి యభిప్రాయమున నీతిస్వరూప మమ్మయని భావింపఁబడి యుండె ననవలయు.

'చాణక్యవటువు' అన్నపదము రాక్షస రాక్షసపక్షపాతుల వైరహేళనములనేకాక చాణక్యుని వయస్సును రాక్షసుని వయస్సుకంటె మిక్కిలియు తక్కువయని గాన్పింపఁ జేసెడిని. కొందఱి యభిప్రాయము చొప్పున చంద్రగుప్తుఁడు సర్వార్థసిద్ధికి మనుమఁడే యయిన నందు లతనికి పిన్నతండ్రులు కావలెను; అట్టి నందుల శైశవమునుండి కాపాడినవాఁడును మధ్యవయస్సు దాఁటినవాఁడుగను, చాణక్యుఁడు మధ్యవయఃప్రవిష్టుఁడుగను ఉండవలయును. *

చాణక్యుఁడు పరిపూర్ణముగ దుష్టాత్ముఁడాయనిన, రాక్షసుని సామర్థ్యమును, స్వామిభక్తిని శ్లాఘించువాఁడుగ నున్నాఁడు. అటువంటి యమాత్యుని సురక్షితునిగ చంద్రగుప్త సాహాయ్యమునకు కూర్చి యుండనియెడల ముద్రారాక్షసమునకును ముద్రామంజూషమునకును అవకాశాస్పదతయే లేకపోయి యుండును. మిత్రునికై ప్రాణత్యాగ, మానత్యాగ, క్షేమత్యాగ, కుటుంబ త్యాగములకు అవలీలగఁ దెగించిన చందనదాసుని శ్లాఘించి కార్యార్థము కారాగృహాది పీడలకు లోఁబఱచినను, కడపట నతని లోకములకెల్ల అగ్రశ్రేష్ఠిగా నియమించుచున్నాఁడు. చంద్రగుప్తుఁడు వృషలుండైనను, ప్రాచీనక్షాత్రకుల జనిత పరిపాలిత రాజ్యమునకు, సింహాసన సదృశపార్థివ సాంగత్యమునుబట్టి అభిషేకము చేసినవాఁడు.

అర్ధరాజ్యదానమున కొప్పుకొని పర్వతకేశ్వరుని పిలిపించినవాఁడు విషకన్యకద్వార యాతనిని చంపినది చూచిన,

---

* "భో అమాత్యరాక్షస, విష్ణుగుప్తోఽహ మభివాదయే" అనువాక్యమును బట్టియు చాణక్యుఁడు రాక్షసునకు నమస్కరించుటయే యాతని న్యూనవయస్కతకుఁ జాలినంత యాధార మయ్యెడిని.

"పూర్వప్రతిజ్ఞయగు నందరాజ్య సర్వస్వమునకును చంద్రగుప్తాభిషేకమునకు భంగము గల్గెడిని. మఱియు నా పార్వతేశుఁడు అర్ధరాజ్యలాభముతోఁ దృప్తిఁబొందక అడియాసపడి స్వరాజ్యబలమును గూర్చికొని చంద్రగుప్తార్ధ రాజ్యమును కబళించు నట్టియని యాతిధర్ముండు. కావున అతని సామీప్యమున ప్రతిజ్ఞా సర్వస్వ భంగమగు" నని యూహించి ఇట్టి సందిగ్ధమున, పర్వతకుని తొలఁగించుట సునీతియే అనియు అందున కుపాయము రాక్షసుఁడే చూపఁగా దాని నంగీకరించుటయే భగవదాజ్ఞ యనియు నూహించెఁబోలు. వైరోచకుని యభిషేకము నకును అదేన్యాయ మనుటతోఁగూడ కూటతోరణమునుండి చంద్రగుప్తుని తప్పించుటయు నధికముఖాంతరమాయె. రాక్షస గ్రహణమునకై చేసిన యుపాయము పంచరాజ నిగ్రహమునకును మలయకేతు సంయమనమునకును సాహాయ్యమగునట్టులు గావించిన బహుఫలదాయక నీతిబీజము, ద్విపక్షసేనలకును అనగత్య జీవనష్టము లేకయుండునట్లును భూలుబ్ధులైన మూలకంటకులు మాత్రము నివారింపఁబడునట్లును, వేయఁబడుట మహామేధావియు, మహాజనోపకారియు నగువాని కర్మగా శ్లాఘింపఁదగినది. ♦

♦ కర్లయిలను గొప్పచరిత్ర తత్త్వజ్ఞుఁడు ఫ్రాన్సుదేశపు నెపోలియన్ జర్మను దేశపు ఫ్రెడరిక్కు చక్రవర్తుల తారతమ్యములఁ బరిశీలించుచు, ఇరుతెగలకును ప్రాణనష్టము అనావశ్యకముగ హెచ్చక కార్యసాధకమైన పరాజయమె జయతుల్య మని భావించిన ఫ్రెడరిక్కుని కోమలతయే, అత్యంత ప్రాణనష్టముతో జయ సంపాదనము చేసిన నెపోలియనుని క్రౌర్యముకంటె మిక్కిలి శ్లాఘనీయంబని అభిప్రాయ పడుచున్నాఁడు.

రాక్షసుని భేదించుటకు తానాలోచించినపుడెల్ల వీర రసంబగు ఆత్మశ్లాఘనవచనంబులనేకాంతమున భాషించినవాఁడైనను రాక్షసమిత్రంబగు చందనదాసుని మొకుట "అన్యచ్చ, నందమివ విష్ణుగుప్త-" అనుచు ఆత్మస్తుతివిషయమున అర్థోక్తి యందు లజ్జను నటించుటయు "సర్వంమే—(అని యర్ధోక్తి యందు లజ్జను నటించుచు (వృషలస్య వీరభవతా సంయోగమిచోర్చన్నయః" అను నదియు చాణక్యుని సభావినయమును ద్యోతక పఱచుచున్నవి. ఇట్టి స్వస్తుతియందు లజ్జగలవాని నైజము ఎంతటి నీతినమ్రతయో తేటపడుచున్నది.

కౌటిల్యుఁడను పేరఁబరంగిన ఈతని కౌటిల్యము ఇతనికి మాత్రము సహజమా? అని విచారించితిమా, తన యనుజుఁడు లక్ష్మణునిచే సేవయందుచున్న శ్రీరాముఁడు సుగ్రీవ విభీషణులను అనుమోదించుచు వారి అగ్రజులయిన వాలి రావణులపై నభియోగము గావించిన కౌటిల్యమును, వాలి సుగ్రీవులు పోరుచుండు తఱి చెట్టుచాటుననుండి వాలిని ఏసిన కౌటిల్యమును, పూతన హననము మొదలుకొని దుర్యోధన సంహారము వఱకును కృష్ణుఁడాచరించిన కౌటిల్యమును, భీష్మద్రోణ కర్ణ హననమునకై యాచరింపఁబడిన శిఖండి యుధిష్ఠిరార్జున కౌటిల్యములును, ఒకొక్క యుద్ధమునందును అలెగ్జాండరు వినియోగించిన కౌటిల్యమును, సీజరు అగస్టనుల కౌటిల్యమును, మహమ్మదు ఘోరి అల్లాఉద్దీను బాబరు ఔరంగజేబుల కౌటిల్యమును, క్లైవు హేస్టింగ్సు కౌటిల్యమును, నెపోలియను

కౌటిల్యమును, బిస్మార్కు కౌటిల్యమును, ఈసమస్త కౌటిల్యాల క్రౌర్యమును జూడఁజూడ ధర్మాసక్తులకుఁ బూర్ణముగ గర్హణీయంబయిన కౌటిల్యము రాజనీతియందు తఱుచుగఁ గన్పట్టుచున్నదని చెప్పవలసి యున్నది. ఇదియెంతయు విచారకరము.

"చాణక్యుని అంతరంగ జీవితము అతిశ్లాఘనీయము. తీవ్ర నిత్యాచారానుష్ఠానములను యావజ్జీవ బ్రహ్మచర్యావలంబనమును వినాయించి తక్కిన యంశములయందెల్ల తాత్త్వికుఁడగు అరిస్టాటులు పేరుగల అలెగ్జాండరుని గురువువంటి ఉగ్ర శిక్షకుఁడు. అతనియింట సమస్త అలంకారాడంబరములును వర్జితములు. అతఁడు జితేంద్రియుఁడును సుఖదుఃఖ ఉదాసీనుండును, చిరంజీవియై మనియుండి వార్ధక్యమున ప్రాచీనాచారానుసారముగ అరణ్యనివాసియాయెను. ఈ ప్రసిద్ధ మహాత్ముని చరిత్రము చూడ నతి మహోన్నత దశయందును సర్వసంగ పరిత్యాగమునకు ప్రమాణమైయుంచె. గావుననే బ్రాహ్మణభావ మట్టిదై యుండవలెనని శాసించినవాఁడు. సార్వభౌమాధికారైశ్వర్యములు అతని యాజ్ఞయందిమిడి యున్నను వానినన్నిటిని తాత్త్వికౌదాసీన్యముతో చూచువాఁడు. అతని సమస్త కృత్యములును పరిశీలింప సమస్త కలాశాస్త్రాధికారియు, కల్పనాకౌశల సంపన్నుఁడును అరిస్టాటులు వలెనే సర్వశిష్యులను తన శక్తిననుసరించు నట్లు వాంఛితముల నిలుపుకొంప యత్నించినవాఁడునునై కనుపట్టుచున్నాఁడు." 1

---

1 భువనచంద్రదత్తు.

చాణక్యునకు 'బ ం డ ద ం తుఁ డ' నియు పేళన నామమును గలదఁట! అదియేల యనఁగ నతని యమ్మ ముంబంటిని పీకికొను మన్నందున మాతృవిధేయతకు కొఱఁత లేః యట్లుగావించి కొనెనట! కాఁబట్టి ఈ మాతృభక్తియందు అరిష్టాటులుకంటె నతని శిష్యు నలెగ్జాండరుకంటె మిక్కిలియు శ్లాఘనీయుఁ డని యెంచఁదగినవాఁడు.

రా క్ష సుఁ డు

చంద్రగుప్త చాణక్యులకుఁ దరువాత రాక్షసుఁడే ముఖ్యపురుషుఁడు అయినను ఇతనిచరిత వ్రాయుటకుఁ జారిత్రక మగు నాధారము లెవ్వియుఁ గానరావు. ముద్రారాక్షస కథ వ్రాయునెడల మూఁడవ ప్రకరణమున రాక్షసుని బుద్ధిచాతుర్య మును స్వామిభక్తిని వెల్లడిపఱచు సంశములు చేర్చఁబడినవి. ఇదివఱకు చాణక్య చరిత్రము వ్రాయుటలో నతని వయస్సును గుఱించి కొంత చర్చించినారము. ఇతఁడు నందవంశమునకు మొదటినుండియు మంత్రియైపరఁగి ఆ మైత్రిచే నా వంశమును నిలువఁ బెట్టుటకు మహాసాహసమునఁ బ్రయత్నించిన నసన్య సామాన్య స్వామిభక్తుఁడు. విధివశమున నాతని పన్నుగడ లెవ్వియును ఫలించినవిగావు. కష్టపరంపర లెన్ని డీకొనినను ఆలుబిడ్డలు ఇడుమల గుడుచుచున్నను దనకెంత యపాయము వాటిల్లినను వెనుదీయక కార్యముసాగినంతకాలము ధైర్యముతో స్వామికై పరిశ్రమ సల్పిన మహావీరుఁడుగదా ఇతండు. చాణక్యుఁడే ఇతనిని గుఱించి.

"కొందఱు ద్రవ్యకాంక్షమెయి
కొల్తురు రాజుల ద్రవ్యమున్నచోఁ
గొందఱు రాజు లాపదలఁ
గూరిననాఁడు భవిష్యదాశచే
నుందురు వీడకుండ ; నిటు
లుర్వికిఁ బాసిన రాజులందు నీ
చందము భక్తిఁ జూపఁగల
సాధులు మాత్రము దుర్లభుల్ గదా!"

అని నుడివియున్నాఁడు. ఇంతకంటె నెక్కుడు వ్రాయుటకు వీలు లేకుండుట కెంతయుఁ జింతిల్లవలసి యున్నది.

అలకసుందరుఁడు

ఇతఁడె అలెగ్జాండరునాఁ బరఁగువాఁడు. ఈతనిని చంద్రగుప్తుని సమకాలికుఁడుగ నెన్నుట యంత సమంజసము గాకున్నను సెల్యూకసు రాజ్యముతో నితనికి విశేషసంబంధము గలదగుట చేతను ఇతఁడు భారతవర్షముపై దండెత్తివచ్చినప్పుడు చంద్రగుప్తుడీతనిని సందర్శించినట్లు చెప్పఁబడియుండుట చేతను ఈతని చరిత్ర యప్పటి పాశ్చాత్య ప్రపంచ పరిజ్ఞానమునకు ముఖ్యతమ మగుటచేతను నిట నది సంక్షిప్తముగ వర్ణిత మగుచున్నది. *

* ఇయ్యది ఈ క్రింది శ్లోకమునకు శతావధానులఁ దిరుపతి వేంకటేశ్వర కవుల భాషాంతరీకరణము.

ఐశ్వర్యాదనపేత మీశ్వరమయం లోకోర్థతః సేవతే
తం గచ్ఛంత్యనుయే విపత్తిషు పునస్తే తత్ప్రతిష్ఠాశయా
భర్తుర్యే ప్రలయేఽపి పూర్వసుకృతాసంగేన నిఃసంగయా
భక్త్యా కార్యధురం వహంతి బహవ స్తేదుర్లభా స్త్వాదృశాః.

ఇతఁడు గ్రీసు దేశమున కుత్తరమునందలి మెకడోనియా రాజ్యమునకుఁ బ్రథమచక్రవర్తి నాఁజను ఫిలిపునకు పుత్త్రుఁడు. తల్లి పేరు ఒలింపియసు. అ ల క సుం ద రుఁ డు జన్మించిన ముహూర్తము సుముహూర్తము. ఫిలిపున కప్పుడు మూఁడు శుభవార్త లొక్కటొక్కట వచ్చిచేరెను. ఆతని సేనాని మహాయుద్ధ మొక్కింట విజయము గొనుటయు, అశ్వము పందెమున గెలుపు నందుటయు, అలకసుందరుఁడు పుట్టుటయు నొక్క నిమేషమున నాతని వీనులకు విందుగొలిపెను. (క్రీ. పూ. 355 సం॥ జూలై మాసము 6వ తేది) నాఁటినుండి యలకసుందరుఁడు గారాముగఁ బెరుగుచుండె. ఆతనికి మొదటి నుండియు దేహముపై విశేషాభిమానము లేకుండెను. ఎల్లప్పుడును నుత్త మాదర్శముల యెడనె అతనికి దృష్టి నిలుచుచు వచ్చెను. గ్రీసు దేశమున సుప్రసిద్ధములయి ఎల్లయావనులకు నాదరణా స్పదములయిన ఒలింపియా పందెములకు నితనిని బురికొల్పిన "నాతోఁ బ్రతిఘటింపఁ గిరీటధారులే తేరినచో నేను పందెము నకుఁ బోవుదు" ననియె నఁట. ఫిలిపు నూతనముగ విజయము నందెననియు గొంత రాజ్యమును స్వైవసము చేసికొనెననియు వినినప్పుడెల్ల నలకసుందరుఁడు సంతసించుటకు మారుగ తన ప్రతాపమును బ్రకటించుటకు నవసరములు దగ్గుచు వచ్చునే యని చింతించు చుండెనఁట!

ఇట్టి తేజోవంతుఁడగు నీ బాలుఁడు కార్యములయందుఁ దన ప్రతిభను జూపకుండువాఁడుగాఁడు. ఫిలిపులేని సమయమున

పారసీక దేశమునుంచి కొందఱు రాయబారులాతని నగరమునకు వచ్చేసిరి. అప్పు డలకసుందరుఁడు వారి క త్యుచితమర్యాదతో స్వాగతమిచ్చి వారినుండి ఆయా దేశముల స్థితిగతులను, వ్యాపారములను అందలి మార్గములను ప్రభుత్వ పద్ధతులను నరసికొనియెను. దీనికిఁ గొంత కాలమునకుఁ దరువాత నలక సుందరుని బుద్ధిని ధైర్యమును వెలువఱచు విశేష మొక్కటి దటస్థించెను. ఫిలిపునకు క్రొత్తగుఱ్ఱ మొండు బహుమానముగ దొఱకెను, దానిని స్వాధీనపఱచుకొని స్వారిచేయుట కెవ్వరికిని సాధ్యముగాలేదు. పెద్దవారలపాటు లన్నియుటెనిం జూచుచుండిన బాలుఁ డలకసుందరుఁడు "అరరె! మీరు దీనిని స్వాధీనము చేసికొన లేకున్నారే" యని యొకటి రెండుమారులు తండ్రికి వినవచ్చు తెఱంగున గొణంగెను. అంత ఫిలిపు దన కుమారుని పొగరునకు నచ్చెరువంది యశ్వముపై నతనిని స్వారిచేయ నియోగించెను.

అంత నలకసుందరుఁడు గుఱ్ఱపునీడ దాని ముందు రానట్లు త్రిప్పి దాని నధిరోహించి దౌడు విడువసాగెను. అది కని యెల్లరుం బ్రశంసించిరి.

అరిస్టాటిలు నా సుప్రసిద్ధుఁడగు గ్రీకు తత్త్వవేత్తకడ నలకసుందరుఁడు విద్యాభ్యాసము చేసెను. నైజశక్తిం జేసియు గురు ప్రభావంబునను నతఁడు పదునారు వత్సరంబుల వాఁడగు సరికి ఫిలిపువలన నొకడోనియాకుఁ దానులేని సమయములఁ బ్రతినిధిగ నేమింపఁ బడియెను. తండ్రి యొక దండయాత్రకుఁ

బోయియున్న సమయమున మెడారిజాతివారు తిరుగుబాటు నొనర్చిరి. బాలుండయ్యును అలకసుందరుడు వారిపై నెత్తిపోయి వారిం బరాజితులంజేసి తనపేర నొక పట్టణమును గట్టించెను. తరువాత తండ్రి తోడం గూడ యుద్ధభూమికి వెడలి కెరొనియా యుద్ధమని పేరుగాంచిన సమరమున ముఖ్యుండై పనిచేసెను. ఫిలిపు కుమారుని మిక్కిలి గౌరవముతోఁ జూచుచువచ్చెను.

అయిన నియ్యది బహుకాలము నడచినదిగాదు. వయసు చెల్లినవాఁడే యయినను ఫిలిపు మోహావేశముచే రెండవ భార్యను బెండ్లియాడెను. దానివలన గృహకల్లోలములు కలిగి అలకసుందరుఁడు దేశత్యాగియయి తలదాచుకొనవలసి వచ్చెను. ఒక స్నేహితుని మధ్యవర్తిత్వమున నతఁడు మరల తండ్రికడ స్నేహభావముతో వచ్చి చేరెను. పిదపఁ గొంతకాలమునకు నన్యాయము ననుభవించి క్రుద్ధుండయిన పౌసనొక్కఁడు ఫిలుపును దుదముట్టించెను. అలకసుందరుఁడు సింహాసనము నధిష్టించె. (క్రీ. పూ. 335) వెన్వెంటన ఫిలిపు సామ్రాజ్యమున నెల్లెడల తిరుగుబాటులు దలసూపి రాజ్యవిచ్ఛేద మగునట్లు గాన్పించెను. గ్రీసు పట్టణములగు థీబ్సు ఆథెన్సులు యుద్ధము నకు సమకట్టెను. అలకసుందరుఁ డంతట సాహసమున నెదిర్చి పరాజితులఁ గావించెను. గ్రీసుపట్టణ రాజ్యములెల్లయు నితనిని తమ నాయక శిఖామణిగ నెన్నుకొని అప్పుడు దమకును పారసీక ప్రభువగు డెరయసునకును నడచుచుండిన విగ్రహమున కితనిని నియమించిరి. రమారమి యీ కాలప్రాంతమున నొక

విచిత్రమగు నుపాఖ్యానము జరిగినట్లు తెలియుచున్నది. గ్రీకు పట్టణములు అలకసుందరుని తమనాయకశిఖామణిగ నెన్నుకొను సమయమున దేశముయొక్క పదిచెరంగుల యందలి ప్రముఖులెల్లరును విచ్చేసి యుండిరి. సైనోపునగరమునకుఁ జేరిన 'డయోజనిసు' అను తత్వశాస్త్రవేత్త మాత్రము రాఁడయ్యె. ఏలరాకుండెనో చూచివత్తము గాకయని యలకసుందరుఁడు పయనమైపోయెను. ఆ సమయమున డయోజనిసు సూర్యరశ్మిలో పరుండియుండెను. జనులు గుంపుగ వచ్చుటం జూచి యతఁడు తలయెత్తి చూచెను. అంత నలకసుందరుఁ డాతని సమీపించి "అయ్యా! తమకు నే నెవ్విధమునైన నుపయోగపడఁ గలుగుదునే" యని యడుగ "నీవు సూర్యరశ్మి కడ్డము నిలువకున్నఁ జాలును" అని ప్రత్యుత్తరమిచ్చెనఁట! అది విని యలకసుందరుఁ డాతని స్వాతంత్రమునకుఁ మెచ్చి "నే నలకసుందరుఁడు గాకుండిన డయోజనసు నగుట కాస చేసియుందు" నని పలికెను. దీనింబట్టి యలకసుందరుఁ డెంత నమ్రతగలవాఁడో చదువరు లెఱుంగఁ గలరు.

గ్రీకు పట్టణములచే నాయకశిఖామణిగ నెన్నుకొనఁబడి అలకసుందరుఁడు డెరయసుపైకి వెడలెను. ఇప్పుడు మనయందు వలె నక్కాలమున గ్రీకులు మున్నగు జాతులవారియందుఁ గూడ శకునములయెడ నెక్కుడు నమ్మకముండెడిది. అనమ్మకములవలన నిప్పుడు మనకుఁ గార్యభంగము గలుగునట్లే వారికిని గార్యభంగ మగుచుండెడిది. అలకసుందరుఁడు మాత్రమట్టి నమ్మకముల యాటంకమునకు నిలిచినవాఁడుగాఁడు. శకునములు

దన్ననుసరించునట్లు చేసెనేగాని తాను శకునముల ననుసరింపఁ డయ్యె. ఇట్లు మహాశక్తితోఁ గార్యము నెసఁగి శత్రువుల భూమింజొచ్చి వారిని రణరంగంబున నోడించి వారి దేశము నందు విశేషభాగము నాక్రమించుకొని యుద్ధములందు దొరకిన కొల్లను గ్రీకుపట్టణములకు బహుమానముగా నంపెను. గార్డియ మను పట్టణమును స్వాధీనము చేసికొనినప్పు డచ్చటి జనులొక రథమును జూపి దానికాడికి వైచియుండిన ముడిని విడఁదీసిన వాఁడు లోకంబునంతయు నేకచ్ఛత్రాధిపతియై యేలునని నుడివిరి. అంత అలకసుందరుఁడు కత్తిదూసి యా ముడిని భేదించి వైచె నని చెప్పుదురు. ఇప్పటికిని ఆంగ్లేయభాషయందు "గార్డియను ముడిని విప్పుట" యనిన గొప్పచిక్కును వదలించుట యని యర్థము, ఇంచుమించుగ నీ గార్డియను ముడిని విడఁదీసిన కాలముననే అలకసుందరుఁడు జబ్బుపడియెను. అతని రుగ్మతకుఁ దగు మందునిచ్చువారు లేరైరి అప్పుడు ఫిలిపు అనువాఁ డొకఁడు సాహసించి ఔషధం బియ్యవచ్చెను. కాని అతఁడు కపటియనియు శత్రుపక్షపాతి యనియు నాతనిచేతి యౌష ధమును గొనవలదనియు నలకసుందరున కొకమిత్రుఁడువ్రాసెను. అలకసుందరుఁ డది చూచికొని ఫిలిపు మందుగిన్నె చేతి కందిచ్చిన తరుణమున నా యుత్తరము నాతనికిచ్చుచు మందును ద్రావివైచెను. ఫిలుపును విభ్రాంతి చెందెను. అప్పుడు ఫిలుపు అలకసుందరుల డెందములఁ గొందలము గొనిన భావము లూహ్యములేగాని వర్ణనీయములుగావు. కొంతసేపటికి అలక సుందరుఁడు మందువలన నారోగ్యము పొందువడఁ దన

మెకడోనియనుల కమందానందము గలిగించుచు డెరయసును సంపూర్ణముగ నోడింప బయలుదేరెను. అజాగ్రత్త వలన డెరయసు ఇఱుకు ప్రదేశమున యుద్ధము చేయవలసి వచ్చినందున అలకసుందరుని సైన్యము కొద్దియే యైనను సునాయాసముగఁ బారసీకులను దోలివైచెను. డెరయసు మాత్రము తప్పించుకొని పోయెను. ఆతని భార్యయు తల్లియు మఱియిద్దఱవివాహితలగు కన్యలును నలకసుందరునిచేఁ జిక్కిరి. వారికీతఁడు గనుపఱచిన మర్యాదవలన నితఁడు డెరయసునకే సంస్తవనీయుఁ డయ్యెను. ఆ యువిదలకు అలెగ్జాండరు రాజవనితలకుం దగు సదుపాయము లన్నియు నమర్చెను. పురుషులెవ్వరును వారి యంతికముల కడకు పోఁగూడదని శాసించి వారి కేలాటిలోపమును రానీక కాపాడెను. డెరయ సొక్కరుఁడు లేఁడనుటఁ దక్క వారికి డెరయసునగరమునకంటె అలకసుందరుని నగరముననె నెక్కుడు సౌఖ్యము గల్పింపఁబడెను. పట్టువడిన కొన్ని మాసములకు డెరయసుభార్య గర్భస్రావమువలన మృతినొందెను. తన యుదారహృదయమును డెరయసునెడఁ జూపుటకు వీలులేకపోయెనే యని వగచుచు నలకసుందరుఁ డామెకు మహా విభవముతో నుత్తరక్రియలు జరిపించెను. ఇదివిని డెరయసు వికలమనస్కుఁడయ్యె. కాని ఆతనిభార్యతో గూడ పట్టుపడి ఆమెయొద్ద అలెగ్జాండరువలన సేవకుఁడుగ నియమింపఁబడి ఆమె మరణానంతరము దప్పించుకొనిపోయి డెరయసుం జేరియుండిన కొజ్జాటిరియ ననువాఁడు అలెగ్జాండరుయొక్క నైర్మల్యముం బ్రశంసించి నమ్మకమగు సాక్ష్యముపలికి

డెరయసు మనము దేర్చెను. అలెగ్జాండరు శుద్ధచరిత్రుఁడని వాఁడు నొక్కినొక్కి వక్కాణించి యున్నాఁడు.

ఈదుఃఖము వాటిల్లిన కొంతికాలమునకే డెరయసునకు నలెగ్జాండరుతో ఘోరయుద్ధము సంప్రాప్తించి అపజయము కలిగెను. నాఁటితో పారసీక సామ్రాజ్య మంతరించె. అలెగ్జాండరునకు గ్రీసు మొదలు భరతవర్షముః నఱకుఁగల ఆసియా ఖండంబును ఈజిప్టుదేశమును లోఁబడిపోయె. అచిరకాలంబుననె డెరయసు పరలోకప్రాప్తిఁ జెందెను. అతని కళేబరంబును రాజపురుషుని కళేబరమునకుం దగినరీతిస మర్యాద దప్పకుండ సమ్మానించి ద్రావకములో నునిచి అతని తల్లికి నివేదించునట్లు అలెగ్జాండరు ఏర్పాటులఁ గావించెను. డెరయసుతోఁ బోరు సల్పుచుండిన కాలమున నలకసుందరుఁడు చూపిన కొన్ని గుణములు ప్రశంసనీయములయి యతని స్వభావమును దెలియఁ జేయుచున్నవి.

అరిస్టను అను సేనాని యొక్కఁడు శత్రువులలో నొక్కరుని జంపి వాని శరీరముం గొనితెచ్చి అలకసుందరునకు సమర్పించి "అయ్యా! మా జాతిలో నిట్టిసమర్పణకు బంగారుగిన్నె బహుమానము" అనియెనఁట. అంతట అలకసుందరుఁడు "వట్టిగిన్నె ఏల ? సిండుగిన్నె నిచ్చెద" నని యొక బంగారుగిన్నెకు సారానించి ఉందిచ్చి అతసని గౌరవించు తెఱంగునఁ దానును ద్రావెను.

ఒకదివసము హీనజన్ముఁ డొకఁడు మొకడోనియను కంచరగాడిదెపయి రాజుగారి ద్రవ్యమును వేసికొని బొక్కసము

నకుఁ దోలుకొని పోవుచుండెను. మార్గమధ్యమున నా మోయు పశువు పడిపోయెను. అంతట నా సేవకుఁడు ద్రవ్యపుమూటలను వీపునవేసికొని మోయలేక మోసికొని పోవుచుండెను. అప్పుడు వానిని అలకసుందరుఁడు చూచుట తటస్థించెను. వెంటనే సంగతులు తెలిసికొని అలెగ్జాండరు "మిత్రమా ! నిలువుము. మునుముకు సాగిపోవలదు. అది నీ సొమ్ము. నీయింటికిఁ గొని పోయి నీవే యుపయోగించుకొనుము" అని నియోగించెను. ఆహా ! ఒక్క నిమిషంబున దారిద్ర్యమునుండి లేవఁదీసి మహైశ్వర్యవంతునిగఁ జేసిన అలెగ్జాండరునెడ నా దరిద్రుఁ డెంత భక్తివిశ్వాసములు గలవాఁడయ్యెనో మనమెఱుంగఁ గలమా ? అలెగ్జాండరింతటి యుదారవంతుఁ డనియైన మన మిప్పుడు లెక్క వేయఁగలమా ?

ఒక సందర్భమున నలెగ్జాండరు సైన్యము మిక్కిలి విరివి యగు నిర్జలప్రదేశముగుండ ప్రయాణము సలుపవలసి వచ్చెను. కొందఱు మెకడోనియనులు మాత్రము ఒక ఏటికడ బుడ్లలో నీరు నించుకొని తమ వాహనములపైఁ దెచ్చుకొనుచుండిరి. అలెగ్జాండరునకు విశేషము దప్పిపుట్టెను. అప్పుడు వారిలో కొందఱు శిరస్త్రాణంబున నొక్కట నీరునించి అతని కిచ్చిరి. అతఁడు దానిని పుచ్చుకొని ఎవ్వరికిఁగాను గొనివచ్చుచుండిరని యడిగెను. వారు "మా బిడ్డలకొఱకు కొనివచ్చుచున్నారము. మా ప్రభువు జీవించినచో నిప్పటి బిడ్డలు పోయినను మాకు బిడ్డలకుఁ గొదవయుండ" దనిరి. ఈ లోపల నలకసుందరుఁడు చుట్టుఁజూడ సైనికులనేకులు దలలువాంచి అతని చేతిలోని

నీటిపై పునఁ జూచుచుండిరి. అది గమనించి అతఁడు "నేనుదక మును ద్రావినయెడల నావలెనే పిపాసాపీడితులగు నీ సైనికులు అధైర్యపడియెదరు" అనుచు నీటిని వెనుకకు నిచ్చివేసెను. అతని యౌదార్యమునకును త్యాగమునకును మెచ్చి సైన్య మెల్లయు నొక్కపెట్టున మిక్కిలి తెగునతోఁ ద్రోవనడచెను.

అలెగ్జాండరు భరతవర్షముమీఁదికి దండెత్తి వచ్చుట మున్నగు విషయములు నాలుగవ ప్రకరణమున వ్రాయఁబడినవి. మరల నిచ్చట వ్రాయుట అనవసరము.

డెరయసు మరణానంతరము అలెగ్జాండరు దనరాజ్యము నందు సంబంధములును బాంధవ్యములును నుండిన రాజ్య స్థైర్యమున కనుకూలమగునని తలఁచి పౌరవాత్య పద్ధతులను అవలంబింప మొదలిడెను. భరతవర్షమునుండి తిరిగి పోవుచు సూసాపట్టణముకడ మహావైభవమున రోక్సానా యను పారసీక కన్యను జేపట్టి పెండ్లియాడెను. తన మిత్రులకును బంధువు లకును గ్రింది యధికారులకును అనేకులకుఁ బూర్వదేశముల యందలి కన్యలను వివాహమున నిప్పించెను. 9000 వివాహ ములు జరిగెను. తాను ఉడుపులు మున్నగు నితర విషయము లను గూడ పౌరవాత్యపద్ధతులనే అనుసరించుచు వచ్చెను.

భరతవర్షమునుండి దిరిగిపోవుచు నతఁడు బాబిలోను వద్దకు వెళ్లినప్పటి కాతనికిఁ జలిజ్వరము సంభవించి మృతుఁ డయ్యెను. (క్రీ. పూ. 323)

అలెగ్జాండరు అంతమదశయందు విశేషము త్రాగుడు వలన కొందఱను అన్యాయముగ జంపినట్లు చెప్పఁబడుచున్నది. ఎట్టివారికిని గళంకము లుండును గదా!

సెల్యూకసు

అలెగ్జాండరుచేఁ జయింపఁబడి కొంతకాల మాతని పాలనకు లోనయియుండి అతని మరణానంతరము చెల్లాచెదరయి పోయియుండిన రాజ్యశకలములను, జంద్రగుప్తుఁడు భరతఖండ మును ఏకచ్ఛత్రాధిపత్యము క్రిందికిఁ దెచ్చుచుండిన కాలము ననే, ఏకచ్ఛత్రాధిపత్యమునకుఁ దేఁ బ్రయత్నించి జయము వడసి చంద్రగుప్తుని నెదిర్చి నిలువలేక అతనికిఁ బుత్రికనిచ్చి మైత్రిచేసికొనిన మహావీరుఁడు ఈ సెల్యూకసు.

ఇతఁడు క్రీ. పూ. 358–354ల మధ్యకాలమున జనన మందెను. ఇతఁడు రమారమి ముప్పదిసంవత్సరముల వాఁడయి ఆసియా మీఁదికెత్తి పోవనున్న అలెగ్జాండరు సైన్యమునఁ జేరువఱకుంగల ఇతని జీవిత చరిత్రము మనమెఱుంగము. క్రీ. పూ. 326-వ సంవత్సరమున నితఁ డలెగ్జాండరు సైన్యము లోని ముఖ్యాధికారులలో నొక్కఁడుగ గన్పట్టుచున్నాఁడు. ఆఫ్ఘనిస్థాన ప్రాంతము నందలి పర్వతప్రదేశమున నలకసుందరుని బీతుంజేయుటచేత నతనికడఁ బ్రధానాధికారిగ నేమింపఁ బడెను. అలెగ్జాండరు, టాలమీ, పర్డిక్కాసు, లాసిమేకసులతో భరతవర్షముంజొచ్చి పురుషోత్తముతోడి పోరున నితఁడు పేరు మగండయి వెలసె. అందువలన నలకసుందరున కితనిపయి ననురాగము చెన్నువహించి నట్లగుపించుచున్నది. సూసా పట్టణమున క్రీ. పూ. 324 వ సంవత్సరమున జరిగిన మహా వైభవోపేత వివాహములలో నలెగ్జాండరు వివాహమునకు

రెండవ దీతని దె యయి యొప్పెను. పారసీక ప్రభువులలో నలెగ్జాండరు మామయు నీతని మామయు సమానౌన్నత్యము గల ప్రముఖులు.

బేబిలోనున క్రీ. పూ. 323 లో నలెగ్జాండరు పరలోకగతుఁడయిన పిదప నాతని రాజ్యమంతయు నరాజకముగాఁ జొచ్చెను. ఫ్రిజియాక్షత్రపుఁడగు అంటిగోనసును, ఫిలిపు సేనాని యగు అన్టిపేటరునుఁ ఈజిప్టుక్షత్రపుఁడగు టాలిమీయును, మెకడోనియా ప్రతినిధియగు క్రెటరసును స్వతంత్రరాజులము గాఁగలుగుదుము గదాయని పన్నుగడలకు ప్రారంభించిరి. కొలఁది కాలముననే రోక్సానాకు కొమరుండుపుట్టెను. పర్డిక్కాసు ఆ చిన్ని యలెగ్జాండరునకు సహపాలకుఁ డయ్యెను. ఇతర క్షత్రపులతోఁ జేరియుండిన సెల్యూకసునకును వెన్వెంటనె రాజ్యభాగ మబ్బియుండునుగాని ఏ కారణముననో అతఁడు సహపాలకుని రక్షకసైన్యమున (Companions) కధ్యక్షుఁడుగ నుండనియ్యకొనెను. అయిన నిది బహుకాలము జరిగినదిగాదు. క్రీ. పూ. 321 లో అన్టిగోనసు సహపాలకుని యాజ్ఞ నుల్లంఘించుటంజేసి వీ రిద్దఱకును విగ్రహము ప్రారంభ మాయెను. క్షత్రపు లందఱును అన్టిగోనసుతోఁ జేరిరి. పర్డిక్కాసు విగ్రహమును నడుపుచు సైన్యముతో నీజిప్టుఁ జొచ్చెను. అతని సైన్యము లోడిపోయి యతఁడు ప్రాణము లర్పింపవలసి వచ్చెను. బహుకాలముగ సంగతులను గమనించుచుండిన సెల్యూకసు సమయము చూచుకొని సహపాలకుని దిగనాడి క్షత్రపుల పక్షమునఁ జేరిపోయెను.

సహాపాలకుఁడు పర్డికాస్సు మడిసిన పిదప ఆన్టిపేట రాతని స్థానమునకు నియమింపఁబడియెను. అట నతనికిఁ గొన్ని చిక్కులు దటస్థించెను. సైనికులలోఁ గొందఱకు నాతఁడు ఇయ్యవలసిన ధనమిచ్చుటకు సందర్భము లతనికి వ్యతిరేకము లయ్యెను. అంతట వా రతనిని శిలావర్షమున నొప్పించి చంపఁ జూచిరి. ఆ తరుణమున వారినుండి యాతనిని సెల్యూకసు దప్పించె. కృతజ్ఞతఁ జూపుటకు నతఁడును సెల్యూకసునకు బేబిలోనియా ప్రభుత్వమిచ్చి యసిపెను. ఇదియు సెల్యూకసునకుఁ జాలకాలము దక్కినదిగాదు. ఆన్టిగోనసు మహాబలవంతుఁ డగుటయు అతనికిని సెల్యూకసునకును వైరము గలుగుటయుఁ దటస్థించెను. ఎంతఁ బ్రయత్నించినను ఆన్టిగోనసును సమాధానపఱచుట యసాధ్యమయ్యెను. క్రీ. పూ. 317 లో సెల్యూకసు ఈజిప్తునకుఁ బారిపోయి టాలమీ శరణుఁ జొచ్చెను. 316 లో రాజవంశము పేరైనను లేకపోవుటయు ఆన్టిగోనసు ప్రజల ప్రభువగుటయు సంభవించె. అంతట నితర క్షత్రపులు—ఈజిప్తున టాలమీయును, అతనికడఁ జేరియుండిన మన సెల్యూకసును, మెకడోనియాయందు కసాండరును లాసిమేకసును—ఆన్టిగోనసునెడ నీర్ష్యగలవారయి యాతనిపై వైరమూని క్రీ. పూ. 315 నందుఁ గొన్ని సమాధానము లడిగిరి. దానిపయి వారికిని అతనికిని విగ్రహముపుట్టె. అందు 315 మొదలు 312 వఱకును సెల్యూకసు టాలమీ సేనానులలో నొక్కఁడుగఁ బనిచేసెను. కాని యా సంవత్సరము ప్రారంభ

మగునప్పటికి సెల్యూకసున కదృష్టము పట్టుటకుఁ బ్రారంభించెను. ఆన్టిగోనసు మెకడోనియాపై కెత్తిపోవ నుండెను. ఆ దాడి నాటంకపఱచి యతని విఫలమనోరథునిఁజేయ సెల్యూకసు ఉపాయము వెదకి ఆతని కుమారుని పరాజితుంజేసి యతని సైన్యములను 'గాజా' యుద్ధమున నుజ్జుమాడించెను. అంతటితో ఆన్టిగోనసు తనచేసిన ఏర్పాటులనెల్లయు మార్చుకొనవలసినవాఁడాయెను. సెల్యూకసు శకము ప్రారంభమయ్యె. టాలమీ 800 పదాతులను, 200 స్వారులనిచ్చి సెల్యూకసును బేబిలోనియా స్వాధీన పఱచుకొనుమని పనిచెను. ఇంత స్వల్ప సైన్యముతో నేమి చేయవచ్చునని కొందఱు సెల్యూకసుతో వాదింపఁ జొచ్చిరి. కాని అలెగ్జాండరు దృష్టాంతమును జూపియును, వీరపురుషోచిత ధర్మముల నుపన్యసించియు, శకునముల గనుపఱచియు సెల్యూకసు వసబలములఁ బురికొల్పి మార్గమున జయము గొనుచు బేబిలోను చేరి ఆన్టిగోనసు పక్షమువారిని పరాజితుల నొనర్చి యానగరమును వశపఱచుకొనెను. నాఁడె సెల్యూకసుల సామ్రాజ్య జన్మదినము. నాఁటినుండియు సెల్యూకసు తన స్థానమును బలపఱచుకొనఁ జొచ్చెను అచిరకాలముననే ఆన్టిగోనసు తన పుత్రపుఁడగు 'నికనరు' ను 10,000 పదాతులతోను, 7000 అశ్వికులతోను సెల్యూకసుపైకి నంపెను. ఇతని సైన్యమున 3000 కాల్బంటులును, 400 స్వారులును నుండిరి. అయినను సెల్యూకసు ప్రతిభవలన నీచిన్న సైన్యము నికనరును సంపూర్ణముగ నోడింపఁ గలిగెను.

ఈ దెబ్బతోడనే ఆన్టిగోనసునకుఁ బశ్చిమమునఁ దొందరలు చూపట్టెను. అయినను వెనుదీయక ఆన్టిగోనసు తనకొమరుని డెమిత్రియసును బేబిలోనియామీఁదికి గొప్పదండుతో సని పెను. ఆ దండు కొల్లగొట్టుటతప్ప మఱి యేవిధమయిన ఫల మును గొనిరాదయ్యె. సెల్యూకసు మెల్ల మెల్లఁగ ఆన్టిగోనసు పక్షపాతులను పరాజితులఁజేసి మరల బేబిలోనియాను స్వాధీన పఱచుకొనెను. రెండవమారి తేఁడు ఈ నగరమును కైవసము చేసికొనినది మొదలు క్రీ. పూ. 302 వఱకు తొమ్మిది సంవత్స రములకాల మేమిజరిగెనో మన మెఱుంగుట కాధారములు గానరావు. 302 లో సెల్యూకసు లాసిమేకసులకును ఆన్టి గోనసునకును ఇప్సను అను స్థానమున యుద్ధము జరిగెను. ఆన్టి గోనసు హతుఁడయ్యె. సెల్యూకసునకు పాలెస్టను మొదలు భరతఖండమువఱకుఁగల రాజ్యము సర్వస్వాతంత్ర్యములతో వచ్చెను. పాలెస్టను సెల్యూకసునకును ఈజిప్తు క్షత్రపుఁడగు టాలమీకును వివాదకారణమయ్యె. కాని టాలమీ సెల్యూ కసునకు కష్టకాలమున సాయముచేసినవాఁడు గావున నా వివా దము అప్పుడు విగ్రహము కాదయ్యెను.

సెల్యూకసు రాజ్యవిస్తారము పెంపునందిన ఆ 303 వ సంవత్సరముననే అతఁడు భరతవర్షము పయికెత్తివచ్చి చంద్ర గుప్తునిచేఁ బరిభవమంది పుత్రికనిచ్చి సంధి చేసికొనెను.

సెల్యూకసు బలవంతుఁడగుట చూచి తక్కుంగల క్షత్రపులతనిపై విరోధమూనిరి. టాలమీ లాసిమేకసు

లోక్కొండైరి. కొంతకాలము ఆన్టిగోనసు కుమారుఁడు డెమిం ట్రియసు సెల్యూకసుతోఁడఁజేరి, కొంతకాల మెదిరించి, కొంత కాలములోఁబడి పలుపాట్లఁబడి క్రీ. పూ. 283 లో విషము పుచ్చుకొని చచ్చెను. అతనితోఁటి సంబంధములలో సెల్యూకసు ఉదారుఁడుగను, దయార్ద్రహృదయుఁడుగను, ధైర్యశాలిగను గన్పట్టుచున్నాఁడు. డెమిట్రియసు పలుత్రోవలఁ ద్రొక్కి తుట్టతుదకుఁ జిక్కి సెల్యూకసుచే రాజపురుషోచితమగు చెఱ యం దుంచఁబడెను. అప్పుడు లాసిమేక సతనిని జంపిన రెండు వేల టాలెంటులు ఇచ్చెదనని సెల్యూకసునకుఁ దెలియ పఱ చెను. దానిపై సెల్యూకసు మండిపడి అట్టి దుష్కార్యము తగదని లాసిమేకసునకు విశదీకరించుచుఁ బ్రత్యుత్తరమిచ్చెను.

ఒకతఱి ప్రజలు కొందఱు డెమిట్రియసు పక్షము వహించియుండిరి. అతనికిఁ గొంచెముగ విజయము కలిగి యుండెను. బలములఁ జేర్చుకొని అతఁడు కొంత యనా రోగ్యము దటస్థించినను లెక్కసేయక పితూరీపోట్లాటలు జరుపు చుండెను. అట్టి సమయమున సెల్యూకసు డాలునొక్కటిని మాత్రము చేతఁబట్టుకొని యొంటరిగా డెమిట్రియసు విడిసి యుండిన యెడవిఁజొచ్చి యచ్చటి యుద్ధభటులను దనపక్షము నకు రావలసినదని చీరెనఁట! ఆహా! ఎంతసాహసము! ఎంత ధైర్యము!!

ఇంత యాత్మవిశ్వాసము గలవాఁడు గావుననే దైవము గూడ నతనికిఁ దోడయ్యె.

లాసిమేకసు టాలిమీలరాజ్యములలో నంతఃకలహములు పొడంగట్టె. క్రీ. పూ. 281 న లాసిమేకసు సెల్యూకసుచే యుద్ధమున మడిసె. టాలమీ రాజ్యమున కర్హుండగు కెరౌనసు టాలమీ ఈతనివద్ద శరణుఁజొచ్చియుండె. అట్లగుటచేత నలెగ్జాండరు రాజ్యమున నీజిప్తుదప్పఁ దక్కిన భాగంబులకీతఁడు సర్వాధికారి యయి ఈజిప్తు యువరాజును దన వశవర్తునిగఁ జేసికొని యడ్డులేక యలరారె.

సెల్యూకసునకు ఆంటియోకసు నాఁబడు పుత్త్రుఁడు గలఁడు. సెల్యూకసు డెమిట్రియసు బిడ్డను స్ట్రాటొనిసె అను నామెను బెండ్లియాడి యుండె. ఆంటియోకసునకు నామెపయి యనురాగము గలిగెనఁట. అంతట సెల్యూకసు పుత్త్రుని యందలి ప్రేమచే నాయమ నాతనికిచ్చి వారిద్దఱను అర్ధరాజ్యమున కధికారులనుజేసి పంపియుండెను. (క్రీ. పూ. 293) నాఁటి నుండియు వారల కీపౌరవాత్య దేశములను ఇచ్చివైచి తాను తన తండ్రి తాతల దేశమగు మెకడోనియాయందు కడపటి దినములు గడపవలయునను నుద్దేశము కలిగినట్లు గానుపించెను. ఆ యుద్దేశమును నెఱవేర్చుకొను కొఱకు సెల్యూకసు క్రీ. పూ. 281 లో మెకడోనియాకుఁ బ్రయాణ మయ్యెను. వెన్వెంటనె కెరౌనసు టాలమీయుఁ జనియె మధ్యమార్గమున నీ కెరౌనసుయొక్క విశ్వాసఘాతుకముచే సెల్యూకసు అకాల మరణము నందెను.

అతనిచే స్థాపితమయిన రాజ్యము బహుకాలము జరిగి చరిత్రమున ప్రసిద్ధిగాంచెను.

మెగాస్తనీసు

మెగాస్తనీసును గుఱించి మనకు విశేషము తెలియదు. ఇతని గ్రంథమును లేదు. ఇతని తరువాతి గ్రీకు గ్రంథకారు లీతనివని కొన్నికొన్ని వాక్యముల ననువాదించి యుండుటం బట్టి లోకమున కితని చరిత్ర తెలియకున్నను ఇతర విషయముల చరిత్ర పరిస్ఫుటముగఁ దెలియవచ్చుటకు వీలు కలిగియున్నది.

కొందఱు మెగాస్తనీసు పారసీకుఁ డనియు నలెగ్జాండరు వెంట వచ్చినవాఁ డనియు ననుచున్నారు. కాని యవి వట్టి యూహాలు.

ఇతఁడు క్రీ. పూ. 302 లో సెల్యూకసుచే చంద్రగుప్తుని యాస్థానమున రాయబారిగ ననుపఁబడెను. ఇతఁడు పంజాబులలోని నదులను బేరొ్కనుటచే నామార్గముగఁ బాటలీపుత్రముం జొచ్చినట్లూహింపఁ దగియున్నది. ఆ పట్టణమున నితఁడు బహుకాలము నివసించెను. దానికిఁ బూర్వభాగమందుండు భరతవర్షమును ఇతఁడు సమక్షముగఁ జూచి యుండలేదు. కొందఱితఁడు చంద్రగుప్తుని తోడంగూడ దేశమును జుట్టుచుండె నందురుగాని దాని కాధారము గానము. ముఖ్యముగ బ్రాహ్మణులనుండి విని సర్వమును నితఁడు వర్ణించి యున్నాఁడు. దేశభాషలు చక్కఁగఁ దెలియమింజేసి వినుట కొక్కటి యర్థము చేసికొనుట మఱియొక్కటియయి యీతఁడొక కొన్ని యద్భుతముల వ్రాసె ననుటకు సందియములేదు.

కాని కొందఱు వాదించు విధంబున నితఁడు గపటికాఁడు. భాషలు దెలియమిం జేసియు, హైందవపద్ధతులను గ్రీకు అనుభవములతో విమర్శించుటం జేసియుఁ గొన్ని లోపములు గల్గిన వనుట సమంజసము. ఇంతియగాక ఇతని సంపూర్ణ గ్రంథము లేని దీతని దూర నేరికి దరంబు? తరంబైనను అదెట్టి న్యాయంబు? తెలిసినది తెలిసినవఱకు దేశమును గుఱించియు, భూస్థితిని గుఱించియు, శీతోష్ణస్థితిగతులను గుఱించియు, పశుపక్ష్యాదులను గుఱించియు, జాతిమతములను గుఱించియు, ఆచారవ్యవహారములను గుఱించియు, రాజ్యాంగ పద్ధతులను గుఱించియు విషయమును సేకరించి లిఖించియుంచి భారతవర్ష ప్రాచీన చరిత్రాంశములఁ బెక్కింటికి నాధార భూతుఁడైన ఈ మెగాస్తనీసు మనకు సంస్మరణీయుండు గాఁడే!

ఉత్తమ బాల సాహిత్యం

పిల్లల బొమ్మల భారతం	వేంకటపార్వతీశ్వరకవులు	1-8-0
పిల్లల బొమ్మల రామాయణం	..	1-8-0
పిల్లల బొమ్మల భాగవతము	..	1-8-0
పిల్లల బొమ్మల భారత నారీమణులు	ఆ॥అన్న	1-8-0
పిల్లల భారత వీరాంగనలు	త॥కృ. నీ॥శ్రీ	1-8-0
పిల్లల బొమ్మల భారతవీరులు	అ॥ల. వే॥కా	1-8-0
పిల్లలచారిత్రక వీరగాథలు	దు॥శే	1-0-0
పిల్లలపాటలు-బాలానందం	స్వామి. వేదుల	1-0-0
పిల్లల కథలు	కా॥ల	1-0-0
పిల్లల హాస్యకథలు	కో॥సో	1-0-0
పిల్లల పురాణకథలు	ఓగేటి (జూ)	1-0-0
పిల్లల మధురగాథలు	వే॥కా	1-0-0
అమ్మమ్మ కథలు	ఆ॥ల	1-0-0
తాతయ్య కథలు	..	1-0-0
బాల కాశీమజిలీ కథలు	కే॥కృ 1.2.3.4.5 భా॥ భా1కి	1-0-0
బొమ్మరిల్లు ఆటలు-పాటలు	కో॥సో	0-8-0
పిట్టకథలు	అ॥వి	4-0-0
హిందీ కథలు	స॥రా	3-0-0
బుద్ధ భగవానుడు	డి. కె. మూర్తి	1-0-0
స్వామి వివేకానంద	..	1-0-0
రామకృష్ణ పరమహంస	..	1-0-0
బాపూజీ	..	1-0-0
నేతాజీ బోసు	..	1-0-0
ప్రధాని నెహ్రూ	స్వామి	1-0-0
రాజేంద్ర ప్రసాద్	..	1-0-0

¼ సొమ్ము ముందుగా అడ్వాన్సు పంపాలి - పోష్టుఖర్చులు ప్రత్యేకం.

కాళహస్తి తమ్మారావు అండ్ సన్సు

బాలసాహిత్య నికేతనం, రాజమహేంద్రవరం.